
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 254

మంగళవారం 5-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బీజేపీకి 'జై'.., సూచీలు సైసై..!

కొత్త శిఖరాలపై సెన్సెక్స్, నిఫ్టీ.. 18 నెలల్లో ఒక రోజు అతిపెద్ద లాభం -13లో



పసిడి.. పరుగో పరుగు!

అంతర్జాతీయంగా, దేశీయంగా ఆల్‌టైమ్ గరిష్టానికి.. -13లో



సీఎంల ఎంపికపై బీజేపీ కసరత్తు!

రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఆ రాష్ట్రాల్లో నూతన ముఖ్యమంత్రుల ఎంపికపై దృష్టి పెట్టింది.

- వివరాలు 6లో



దాడుల తీవ్రత పెంచిన ఇజ్రాయెల్

హమాస్ నాయకులు, కీలక టన్నెళ్లు, ఆయుధ డిపోలు తదితర 200 నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

- వివరాలు 6లో



బద్దలైన అగ్నిపర్వతం

ఇండోనేసియాలో మరపీ అగ్నిపర్వతం బద్ద లైన ఘటనలో 11 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో



నేలనీరే జీవనాధారం!

నేలలను పరిరక్షించుకోవాలన్న స్ఫూర్తితో ఏటా డిసెంబర్ 5న ప్రపంచ నేలలు లేదా భూముల దినోత్సవాన్ని ఎఫ్.ఎ.ఓ. నిర్వహిస్తోంది.

- వివరాలు 11లో

న్యూస్‌రీల్

కూలిన శిక్షణ విమానం



సంగారెడ్డి జిల్లా దుండిగల్‌లో వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ శిక్షణ విమానం సోమవారం సాంకేతిక కారణాలతో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని రాళ్లగుట్టలో కుప్పకూలింది. విమానంలోని ఇద్దరు పైలట్లు సజీవదహనం అయ్యారు.

- వివరాలు 14లో

27న సింగరేణి ఎన్నికలు



హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్సీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

- వివరాలు 5లో

కాంగ్రెస్‌కు 'కౌన్సిల్' కష్టాలు



తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభలో అధికారం చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ శాసన మండలిలో మాత్రం విచిత్రమైన స్థితిని ఎదుర్కోనుంది. 40 మంది సభ్యులున్న మండలిలో 37 మంది ప్రతిపక్షాలకు చెందిన వారే కాగా ముగ్గురు (బీఆర్‌ఎస్‌ను వీడిన ఇద్దరితో కలిపి) మాత్రమే కాంగ్రెస్ సభ్యులుగా ఉన్నారు.

- వివరాలు 3లో

24% పెరిగిన సైబర్ నేరాలు



దేశంలో సైబర్ నేరాల నమోదు ఏటా పెరుగుతోంది. 2021తో పోలిస్తే దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నమోదు 2022లో 24.4 శాతం పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2022 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని పేర్కొంది.

- వివరాలు 10లో

కాంగ్రెస్ అధిష్టానం కోర్టులోకి సీఎం అభ్యర్థి ఎంపిక వ్యవహారం

ఈ అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ సీఎల్పీ ఏకవాక్య తీర్మానం

ఓవర్ టు ఢిల్లీ..!



సీఎల్పీ భేటీలో మాట్లాడుతున్న డీకే శివకుమార్. చిత్రంలో ఉత్తమ్, భట్టి, దీపాదాస్ మున్షీ, ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులు

డీకే శివకుమార్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లో సమావేశం.. హాజరైన 64 మంది కొత్త ఎమ్మెల్యేలు

అంతకుముందు డీకేతో భట్టి, ఉత్తమ్, దామోదర, రాజగోపాల్, శ్రీధర్‌బాబు, ప్రేమ్‌సాగర్‌రావు భేటీ

- హడావుడిగా వద్దని, అన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి
- సీఎల్పీ భేటీ తర్వాత ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడిన పరిశీలకులు
- ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలన్న దానిపై అభిప్రాయ సేకరణ
- అధిష్టానం ఎవరికి ఇచ్చినా ఓకే అన్న ఎమ్మెల్యేలు
- ఇంతలో ఢిల్లీకి రావాలంటూ డీకే టీమ్‌కు పిలుపు.. నేడు ఏఐసీసీ పెద్దలతో సమాలోచనలు
- సీఎం ఎంపికపై నిర్ణయం.. తర్వాత సీఎల్పీ భేటీలో లాంఛనంగా ఆమోదం

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించినా.. ముఖ్యమంత్రిని ఎంపిక అంశం కొలిక్కి రాలేదు. సోమవారం పొద్దంతా భేటీలు, సమావేశాలు, చర్చలు, ఇంకాసేపట్లోనే ప్రమాణ స్వీకారమనే ప్రచారాల మధ్య ఈ వ్యవహారం ఢిల్లీకి చేరింది. పార్టీ శాసనసభాపక్షం (సీఎల్పీ) నాయకుడిని నిర్ణయించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో సమావేశమైన కొత్త ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వెల్లడించేందుకు మాత్రమే పరిమితమయ్యారు. వారి అభిప్రాయాలను ఢిల్లీకి పంపి, అధిష్టానం స్పందన కోసం ఎదురుచూసిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని పరిశీలకుల బృందం.. ఎలాంటి తుది నిర్ణయాన్ని ప్రకటించకుండానే హస్తిన బాట పట్టింది. మంగళవారం పార్టీ అధిష్టానం పెద్దలతో డీకే బృందం భేటీ కానుంది. అనంతరం సీఎం, మంత్రి పదవులు, ఇతర కీలక అంశాలపై తుది నిర్ణయం వెలువడనుందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. అయితే తుది నిర్ణయాన్ని వెలువరించే ముందు అధిష్టానం పెద్దలు మరోసారి టీపీసీసీ ముఖ్యులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని అంటున్నాయి. ఈ ప్రక్రియ ముగిసేందుకు రెండు రోజుల సమయం పడుతుందని పేర్కొంటున్నాయి. సీఎంతోపాటు డిప్యూటీ సీఎంలు, మంత్రివర్గ బెర్తులు ఖరారైన తర్వాతే ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించాలన్న అభిప్రాయాల నేపథ్యంలో.. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఎప్పుడైనా కొత్త ప్రభుత్వం కొలువు దీరనుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

ఏకవాక్య తీర్మానానికి ఆమోదం

సోమవారం ఉదయం 11.30 గంటలకు ఎల్లా హోటల్ వేదికగా కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశమైంది. కాంగ్రెస్ నుంచి తాజాగా గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు దీనికి హాజరయ్యారు. డీకే శివకుమార్ పర్యవేక్షణలో ఏఐసీసీ పరిశీలకులు కేజే జార్జి, దీపాదాస్‌మున్షీ, అజయ్ కుమార్, ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు కూడా

మిగతా 3వ పేజీలో ▶

కొత్త సర్కారుకు శ్రీకారం!

- కొత్త సీఎం, మంత్రుల ప్రమాణం కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు
- తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాతో గెజిట్ ప్రకటన
- రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు అందజేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి

2లో



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకి గెజిట్ ప్రతిని ఇస్తున్న సీఈఓ వికాస్‌రాజ్

మిజోరంలో జెడ్‌పీఎం జయభేరి

40 అసెంబ్లీ స్థానాలకు గాను **27** స్థానాలు కైవసం చేసుకున్న జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్

- అధికార మిజో నేషనల్ ఫ్రంట్‌కు 10 సీట్లు
- బీజేపీకి రెండు.. కాంగ్రెస్‌కు ఒక స్థానం
- సీఎం జోరామ్‌తాంగ పరాజయం
- కొత్త సీఎంగా జెడ్‌పీఎం అధినేత లాల్దుహోమా త్వరలో ప్రమాణ స్వీకారం



లాల్దుహోమాకు శుభాకాంక్షలు చెబుతున్న కార్యకర్తలు

ఈశాన్య రాష్ట్రం మిజోరం శాసనసభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) సంచలన విజయం సాధించింది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)ను మట్టికరిపించింది. మొత్తం 40 అసెంబ్లీ స్థానాలకు గాను 27 స్థానాల్లో గెలిచింది. మెజారిటీ మార్కును సులువుగా దాటేసింది. అధికార ఎంఎన్‌ఎఫ్ కేవలం 10 స్థానాల్లో నెగ్గింది.

వివరాలు 6లో

ప్రజాతీర్పును గౌరవిద్దాం..

- కొత్త సర్కారుకు సహకరిద్దాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కేసీఆర్
- భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూద్దాం
- త్వరలో పార్టీ శాసనసభా పక్ష నేత ఎన్నిక



కేసీఆర్‌తో భేటీ అయిన పోచారం ▶

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా జనవరి 16వ తేదీ వరకు మన ప్రభుత్వం కొనసాగే అవకాశమున్నా ప్రజల తీర్పును గౌరవిస్తూ హుందాగా తప్పుకున్నాం. ప్రజల తీర్పును గౌరవిస్తూ కొత్త ప్రభుత్వానికి సహకరిద్దాం. రాష్ట్ర రాజకీయాలు, పాలనలో భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూద్దాం..'అంటూ భారత్ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, పలువురు నేతలు కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ అధినేత ఆశీర్వాదం తీసుకున్నారు.

త్వరలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం

'త్వరలో తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేసుకుందాం. ఎన్నికల క్షేత్రంలో గెలుపోటములు అత్యంత సహజం. నిరాశ చెందకుండా

మిగతా 2వ పేజీలో ▶

జనంలో ఉందాం!

- ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం.. ఓటమితో నిరాశ చెందకుండా ముందుకు సాగుదాం
- ఇకపై తెలంగాణ భవన్ నుంచి కార్యకలాపాలు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలతో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'ప్రజలు వేరే పార్టీకి అవకాశం ఇచ్చినా మనకు గౌరవ ప్రదమైన స్థానాలు కట్టబెట్టారు. ప్రజలు మనకు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దాం. ఓటమితో అధైర్య పడకుండా జనంలో ఉంటూ ప్రజలకు సంబంధించిన అంశాలపై పోరాడుదాం..'అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేటీఆర్, బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు, సీనియర్ నేతలతో

మిగతా 2వ పేజీలో ▶

నామినేటెడ్ పదవులకు బై బై

బీఆర్‌ఎస్ నేతల రాజీనామాల పరంపర..

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు రాజీనామా..

వివరాలు 5లో

ఆ నైరాశ్యాన్ని సభలో వెళ్లగక్కొద్దు

ప్రతిపక్షాలకు ప్రధాని మోదీ సూచన



'ఫలితాలను చూసి విపక్షాలు ఆందోళన చెందొద్దు. ఫలితాలకు అనుగుణంగా దేశంలోని సామాన్య ప్రజల సంక్షేమం, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కట్టుబడి ఉన్నాం. సభలో సహకరించాలని ప్రతిపక్షాలను కోరుతున్నా. ప్రతిపక్షాలు ద్వేషం, ప్రతికూలతను పక్కనపెట్టి దేశానికి సానుకూల సందేశాన్నివ్వాలి. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షం కూడా కీలకమైనందున అది అంతే సమర్థవంతంగా ఉండాలి.' –ప్రధాని మోదీ

వివరాలు 6లో

ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసం ఖాళీ

రెండు దశాబ్దాలుగా ఆ ఇంటితో అనుబంధం

- 2, 3 రోజుల్లో పూర్తిగా తెగిపోనున్న బంధం
- ఎంపీగా, సీఎంగా ఇదే బంగ్లాలో బస

వివరాలు 2లో



సోమవారం తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లాలో వరదలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయక సిబ్బంది

తీవ్ర తుపానుగా.. మిచాంగ్

నేడు మధ్యాహ్నం ఏపీలోని బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం

తెలంగాణలో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే చాన్స్

ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు భారీ వర్ష సూచన

మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం 14లో

ఇదం జగత్



.. ఫ్యామిలీ మెంబర్స్ ఓటెయ్యలేదని అలా అనుమానంగా చూడటం ఏం బాగోలేదు!

లెక్క ఎక్కడ తప్పింది?



- ముఖ్య నేతలంతా ఎలా ఓడారు?
- బీఆర్‌ఎస్ సర్కార్‌పై వ్యతిరేకత బీజేపీకి కాకుండా కాంగ్రెస్‌కు ఎలా లాభించింది?
- రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో సమీక్షలకు రంగం సిద్ధం

ఇక సమీక్షలు షురూ ● కమలంలో అంతర్మథనం

సాక్షి, హైదరాబాద్: కమలదళంలో అంతర్మథనం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవడానికి కారణాలేమిటి? గట్టిగా పోరాడినా కూడా అనుకున్న విధంగా ఫలితాలను ఎందుకు సాధించలేకపోయామనే కోణంలో పార్టీలో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన 111 సీట్లలో 8 స్థానాల్లో మాత్రమే గెలుపునకు పరిమితం కావడంపై రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో అంతర్గత సమీక్షలకు రంగం సిద్ధమైంది. పార్టీకి పట్టుతో పాటు, ముగ్గురు ఎంపీలు గెలిచిన ఉమ్మడి జిల్లాల పరిధిలో, ముఖ్యనేతలు (ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, అర్వింద్ ధర్మపురి, సోయం బాపూరావు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్) ఓటమి పాలవడం, దుబ్బాకలో మరో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఓటమికి కారణాలు ఏమిటంటూ పార్టీలో అంతర్గత చర్చ

మిగతా 5వ పేజీలో ▶



అత్యధిక ఎంపీ సీట్లలో **గెలుపే లక్ష్యం** 5లో

వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నాం : కిషన్‌రెడ్డి



రైళ్ల రాకపోకలపై తుపాను ఎఫెక్ట్

- హైదరాబాద్ నుంచి దక్షిణాదికి నిలిచిన రైళ్లు
- ఉత్తరాది నుంచి వచ్చే వాటికీ బ్రేక్
- ఇప్పటికే 150కిపైగా రైళ్లను రద్దు చేసిన దక్షిణమధ్య రైల్వే

14లో

చెన్నైలో జలప్రళయం

- ముంచెత్తిన మిచాంగ్ తుపాను
- ఏకంగా 35 సెంటీమీటర్ల వాన
- పూర్తిగా స్తంభించిన జనజీవనం
- హైవేలు, సబ్‌వేల మూసివేత

14లో

47 ఏళ్లలో అతి భారీ వర్షం

‘ఉమ్మడి ఆస్తుల’పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సోమవారం ఈ పిటిషన్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పలు అంశాల నేపథ్యంలో పిటిషన్‌ను వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

ఓటుకు కోట్లు కేసు విచారణ జనవరికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కేసు నుంచి తప్పించాలంటూ తెలంగాణ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. విచారణ వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం, పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోరడంతో వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

ఢిల్లీ హైకోర్టుకు వెళ్లండి

నిమ్మగడ్డ రమేష్‌కు సూచించిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా గందరగోళం, ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను తొలగించాలన్న అంశంపై ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధి నిమ్మగడ్డ రమేష్‌కు సుప్రీంకోర్టు సూచించింది. రమేష్ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఢిల్లీ హైకోర్టులో ఇప్పటికే ఈ తరహా పిటిషన్ విచారణలో ఉండడం, ఈ తరహా పిటిషన్లు గతంలో ఢిల్లీ హైకోర్టుకు పంపిన నేపథ్యంలో రమేష్‌కు కూడా అవే ఆదేశాలు పాటించాలని ధర్మాసనం సూచించింది. ఈ నేపథ్యంలో పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది తెలపగా ధర్మాసనం అనుమతించింది.

దాడుల సంస్కృతి ఉండదని భావిస్తున్నా

బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో దాడుల సంస్కృతి ఉండదని భావిస్తున్నట్లు బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హుందాతనంతో కూడిన పాలన ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. నీచమైన రాజకీయాలకు స్వస్తి పలికి, స్వచ్ఛమైన రాజకీయాలు చేద్దామంటూ ఆయన నేతలకు పిలుపునిచ్చారు. డిపాజిట్లు కోల్పోయిన స్థాయి నుంచి పార్టీని అధికారం వరకు నడిపించిన రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ శకం ముగియడం సగం ఆనందాన్ని ఇస్తోందని, ఇది బీఆర్ఎస్ పతనానికి ప్రారంభమని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న కొద్ది మంది ఎమ్మెల్యేలు సైతం జారుకుంటారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే ప్రధాన పార్టీలుగా కొనసాగుతాయని వివరించారు. ఏడాది క్రితం వరకు రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉండగా.. ఈ ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని పేర్కొన్నారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయకపోవడం కూడా బీజేపీ ఓటమికి ఒక కారణమని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అనే నినాదాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి బాగా తీసుకెళ్లడంలో సక్సెస్ అయిందని, దీనిని ప్రజలు బాగా నమ్మారని తెలిపారు. బీజేపీకి ఎనిమిది సీట్లు ఎందుకు వచ్చాయో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం కారణంగానే తాను ఓటమి పాలైనట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బు పంచే విధానంలో మార్పు రావాలని ఆశిస్తున్నట్లు అర్వింద్ పేర్కొన్నారు.

మా లోపాలను కచ్చితంగా సమీక్షించుకుంటాం: కె.కేశవరావు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, తమ లోపాలను కచ్చితంగా సమీక్షించుకుంటామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు తెలిపారు. ప్రపంచం మెచ్చేలా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించడానికి కారణాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు దిశగా పని చేయాలని కోరారు. కొత్తగా కొలువు దీరనున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కేశవరావు అభినందనలు తెలిపారు.

సాగర్ వద్ద పూర్వస్థితిని పునరుద్ధరించాలి

కృష్ణాబోర్డుకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయాన్ని మళ్లీ తెలంగాణ రాష్ట్ర నియంత్రణ పరిధిలోకి తీసుకురావడంలో భాగంగా నవంబర్ 28కి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను కోరింది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఇదే నిర్ణయాన్ని తీసుకున్నారని గుర్తు చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ సోమవారం కేఆర్ఎంబీ చైర్మన్‌కు లేఖ రాశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ భూభాగం పరిధిలోని నాగార్జునసాగర్ డ్యాంను ఇప్పటికే సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించామని, ఏపీ ప్రభుత్వం సైతం తగిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కృష్ణాబోర్డును కోరారు.

క్వార్టర్‌ను ఖాళీ చేసిన పువ్వాడ



పువ్వాడ అజయ్‌కు కేటాయించిన క్వార్టర్స్‌ను ఖాళీ చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: ఖమ్మం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలైన పువ్వాడ అజయ్ కుమార్ బంజారాహిల్స్ మంత్రుల సముదాయంలో తనకు కేటాయించిన క్వార్టర్‌ను సోమవారం ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో మంత్రుల నివాస ప్రాంగణంలోని క్వార్టర్స్‌ను ఇప్పటివరకు మంత్రులుగా ఉన్నవారంతా ఖాళీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్వార్టర్స్‌లో శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, కడియం శ్రీహరి తదితరులు ఉన్నారు.

వారంలోగా మనోహర్‌రావుపై సస్పెన్షన్ ఎత్తివేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల వెల్లడి పూర్తయి ప్రవర్తనా నియమావళి ముగిసినందున వారంలోగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ బోయిన్‌పల్లి మనోహర్‌రావుపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఒక ఉద్యోగి లేదా అధికారిని నిరవధికంగా సస్పెన్షన్‌లో ఉంచలేమని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఉన్న తనను సస్పెండ్ చేస్తూ గత నెల 17న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మనోహర్‌రావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

కొత్త సర్కారుకు శ్రీకారం!

నూతన ప్రభుత్వ ఏర్పాటు కోసం ప్రారంభమైన ప్రక్రియ

- తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాతో గెజిట్ ప్రకటన
- రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి అందజేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి
- రెండో శాసనసభను రద్దుచేస్తూ గవర్నర్ ఉత్తర్వులు
- కొత్త సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం కోసం రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు



ప్రమాణస్వీకారం కోసం రాజ్‌భవన్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా.. తాజా ఎన్నికల్లో గెలిచినవారి జాబితాతో కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ సోమవారం గెజిట్ జారీ చేశారు. ఆ వెంటనే సీఈఓ వికాస్‌రాజ్ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు గెజిట్ నోటిఫికేషన్ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ వికాస్‌రాజ్ నేతృత్వంలోని ఎన్నికల అధికారుల బృందం గవర్నర్ తమిళిసైతో కొంతసేపు మర్యాదపూర్వకంగా సమావేశమైంది.

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతను ఎన్నుకోవడానికి సోమవారం సమావేశమయ్యారు. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి ఎన్నికవుతున్నారని, ఆయన రాజ్‌భవన్‌కు చేరుకుని సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని, మరో ఒకరిద్దరు మంత్రులుగా ప్రమాణం చేస్తారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో రాజ్‌భవన్ ఉన్నతాధికారులు సోమవారం ఉదయమే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు ప్రారంభించారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో కొత్త సీఎం, మంత్రులతో గవర్నర్ తమిళిసై ప్రమాణ స్వీకారం చేయించడానికి వీలుగా పోడియంను, కార్యక్రమానికి వచ్చే ఆహ్వానితుల కోసం కుర్చీలను సిద్ధం చేశారు. దర్బార్ హాల్‌ను అలంకరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీర్మానం తీసుకుని సీఎల్పీ నేత రాజ్‌భవన్‌కు వచ్చే అవకాశం ఉండటంతో గవర్నర్ తమిళిసై, రాజ్‌భవన్ అధికారులు సాయంత్రం వరకు వేచిచూశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రాజ్‌భవన్ వద్దకు చేరుకోవడంతో సందడి నెలకొంది.

కాన్వాయ్‌లనూ సిద్ధం చేసినా..

కొత్త సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రొటోకాల్ ప్రకారం వారికి ప్రత్యేక కాన్వాయ్‌ల కోసం కూడా ఏర్పాట్లు జరిగాయి. రాజ్‌భవన్ పక్కనే ఉన్న దిల్‌కుషా అతిథి గృహం వద్ద ఈ మేరకు వాహనాలను సిద్ధంగా ఉంచారు. అయితే సీఎల్పీ నేత ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం రాలేదని, కొత్త సీఎం ప్రమాణ స్వీకారం సోమవారం ఉండదనే స్పష్టత రావడంతో జీఏడీ అధికారులు రాజ్‌భవన్ నుంచి వెనుతిరిగారు.

కొత్త కొత్తగా సచివాలయం

నూతన సీఎం, మంత్రులకు రాష్ట్ర సచివాలయంలో ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయంలో పాత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధుల నేమ్ ప్లేట్లను అధికారులు సోమవారం తొలగించారు. కొత్త సీఎం, మంత్రుల కోసం చాంబర్లను సిద్ధం చేస్తున్నారు. కొత్త సీఎం, మంత్రులకు సంబంధించి తమకు ఎలాంటి కబురు అందలేదని, అధికారికంగా సమాచారం అందగానే వారికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని సాధారణ పరిపాలన విభాగం అధికారులు తెలిపారు.

అసెంబ్లీ కూడా ముస్తాబు

కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక త్వరలోనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, కొత్తగా ఎన్నికైన వారితో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీని కూడా ముస్తాబు చేస్తున్నారు. అసెంబ్లీ భవనానికి రంగులు వేయడంతో పాటు పాత ఫర్నీచర్‌ను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మంత్రులు, సీఎం చాంబర్లను అందంగా తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ రెండో శాసనసభ రద్దు

కేసీఆర్ నేతృత్వంలోని మంత్రివర్గం సిఫార్సు మేరకు తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రద్దు ఉత్తర్వులు ఆదివారం (డిసెంబర్ 3) మధ్యాహ్నం నుంచే వర్తిస్తాయని పేర్కొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల కోడ్ ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సాధారణ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమలును కేంద్ర ఎన్నికల సంఘం ఉపసంహరించుకుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అజయ్‌కుమార్ వర్మ సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)కు లేఖ రాశారు. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 9న రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నాటి నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనానియమావళి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.



ఢిల్లీలోని కేసీఆర్ అధికారిక నివాసం

ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసం ఖాళీ

రెండు దశాబ్దాలుగా ఆ ఇంటితో అనుబంధం

- 2, 3 రోజుల్లో పూర్తిగా తెగిపోనున్న బంధం
- ఎంపీగా, సీఎంగా ఇదే బంగ్లాలో బస

సాక్షి, న్యూఢిల్లీ: రెండు దశాబ్దాలపాటు దేశ రాజధాని ఢిల్లీలో కేసీఆర్‌కు అధికారిక నివాసంగా కొనసాగిన తుగ్లక్ రోడ్‌లోని 3వ నంబరు ఇల్లును ఖాళీ చేస్తున్నారు. తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హస్తినలోని కేసీఆర్ అధికారిక నివాసాన్ని ఇక్కడి సిబ్బంది ఖాళీ చేస్తున్నారు. ఇప్పటికే కొంత సామాను తరలించిన సిబ్బంది.. రెండు మూడు రోజుల్లో ఈ ఇంటిని పూర్తిగా ఖాళీ చేయనున్నారు. లోక్‌సభ సభ్యుడిగా ఉన్న సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం చంద్రశేఖర్‌రావుకు ఈ బంగ్లాను కేటాయించింది. అప్పటి నుంచి ఆయనకు ఇది అధికారిక నివాసంగా మారింది. ఈ ఇంటి నుంచే హస్తినలో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని నడిపించారు. రాష్ట్ర సాధన అనంతరం రెండు పర్యాయాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. సీఎం హోదాలో హస్తినకు ఎప్పుడు వచ్చినా ఇదే ఇంట్లో ఆయన బస చేసేవారు. అధికారం కోల్పోయిన ఏ ప్రజా ప్రతినిధి అయినా.. అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడానికి నెల రోజుల సమయం ఉంటుంది. కానీ.. కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ ఇంటిని రెండు మూడు రోజుల్లోనే పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ఆ ఇల్లు ఖాళీ అయితే రెండు దశాబ్దాలుగా కేసీఆర్‌కు ఈ ఇంటితో ఉన్న బంధం తెగిపోనుంది.

మెజార్టీని మించి ‘నోటా’

చేవెళ్ల, దేవరకద్రలో నమోదు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల బరిలో ఉన్న ఏ పార్టీ అభ్యర్థికీ ఓటు వేయడానికి ఇష్టంలేని పక్షంలో, ఓటరు అభిప్రాయాన్ని నమోదు చేసే దిశగా ఎన్నికల సంఘం నోటా (నన్ ఆఫ్ ది అబౌ)ను ప్రవేశపెట్టింది. ఈవీఎంలో అందరు అభ్యర్థుల పేర్లకు దిగువన అంటే చిట్టచివరన నన్ ఆఫ్ ది ఎబౌ అని, పక్కనే నోటా అని రాసి ఉంటుంది. ఆ పక్కనే ఇందుకు సంబంధించిన బటన్ కూడా ఉంటుంది. సాధారణంగా నోటా బటన్‌ను నొక్కే వారి సంఖ్య అత్యల్పంగా ఉంటుంది. ఎందుకంటే ఏ కారణం చేతనైనా ఓటు వేయొద్దని అనుకున్న వారు పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉంటారు. కానీ తమకు ఏ అభ్యర్థీ ఇష్టం లేదనే విషయాన్ని నమోదు చేసేందుకు ఏ కొందరో తప్ప రారు. ఈ కారణంగా ఇలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. అయితే తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే రెండు స్థానాల్లో అభ్యర్థులు సాధించిన మెజారిటీని మించి నోటా ఓట్లు ఉండటం గమనార్హం. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపొందిన అభ్యర్థి 268 ఓట్ల మెజార్టీ సాధించగా.. అక్కడ నోటా బటన్ నొక్కిన వారు ఏకంగా 1,423 మంది ఉండటం ఆసక్తికరం. అలాగే దేవరకద్ర నియోజకవర్గంలో అభ్యర్థి సాధించిన మెజార్టీ 1,392 ఓట్లు కాగా.. నోటాకు 1,706 పడ్డాయి.

మేడ్చల్‌లో గరిష్టంగా..

తాజాగా జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నోటా బటన్ నొక్కారు. ఇక్కడ ఏకంగా 3,737 ఓట్లు నోటాకు లభించాయి. ఆ తర్వాత స్థానంలో అచ్చంపేట 2,419, బోథ్ 2,313, నిజామాబాద్ రూరల్‌లో 2,268, దుబ్బాకలో 2,252 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

ప్రజాతీర్పును గౌరవిద్దాం..



కేసీఆర్‌తో భేటీ కోసం సోమవారం ఎర్రవల్లికి వచ్చిన బీఆర్ఎస్ నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలతో మమేకమై వారి విశ్వాసాన్ని తిరిగి చూరగొనాల్సిన బాధ్యత నాయకులపైనే ఉంటుంది. అందువల్ల నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండాలి. త్వరలో పార్టీ శాసనసభ పక్ష నాయకుడిని కూడా ఎన్నుకునేందుకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుందాం..’అని కేసీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లకుపైగా సుస్థిర పాలన అందించి అభివృద్ధి, సంక్షేమంతో చెరగని ముద్ర వేసుకోగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలబెట్టడమేగాకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించి గొప్ప పరివర్తన తీసుకురాగలిగామన్నారు. బీఆర్ఎస్ అంటే ఒక భరోసా అనే విశ్వాసాన్ని కలిగించామని చెప్పారు. మెజారిటీ ఎంత వచ్చింది? ఎన్నిక ఏ విధంగా జరిగింది? ఏ తరహా పోటీని ఎదుర్కొన్నారు? లాంటి కొన్ని సాధారణ అంశాలను కూడా కేసీఆర్ ఆరా తీశారని ఆయనను కలిసిన నేతలు ‘సాక్షి’కి తెలిపారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన భేటీలో ఆయన కుశల ప్రశ్నలు సైతం వేసినట్లు చెప్పారు.

హరీశ్, తదితరుల భేటీ

ఉదయం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన కేటీఆర్ ఫామ్‌హౌస్ భేటీకి వెళ్లలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇలావుండగా ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు కూడా కేసీఆర్‌ను కలిశారు. గజ్వేల్ ఎన్నికలో కేసీఆర్ ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరించిన అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ‘ఎన్నిక ధ్రువీకరణ సర్టిఫికెట్’ను అందజేశారు. దుబ్బాక ఎన్నికల ప్రచారంలో కత్తిపోటుకు గురై కోలుకుంటున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోగ్య స్థితిపై కేసీఆర్ వాకబు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ యాదవ్, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రగతిభవన్ నుంచి ఫామ్‌హౌస్‌కు..

కేసీఆర్ దంపతులు ఆదివారం రాత్రి ప్రగతిభవన్ నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా ఒకటి రెండు రోజుల్లో బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసానికి మారనున్నారు. వ్యక్తిగత సామానును తరలించే పని జరుగుతున్నట్లు ప్రగతిభవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే కేటీఆర్ జనవాడలోని ఫామ్‌హౌస్ నుంచి రాకపోకలు సాగించే అవకాశమున్నట్లు తెలిసింది.

ఆ లోక్‌సభ సెగ్మెంట్‌లలో మిశ్రమ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ సెగ్మెంట్‌ల వారీగా చూస్తే..అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆయా రాజకీయపార్టీలకు మిశ్రమ స్పందన మిగిల్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 9 ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీఆర్ఎస్‌కు నాలుగు లోక్‌సభ సెగ్మెంట్‌లలో కనీస ప్రాతినిధ్యమే దక్కలేదు. కాంగ్రెస్ పార్టీకి సైతం రాజధాని పరిధిలోని 3 లోక్‌సభ సెగ్మెంట్లలో గెలవలేకపోయింది. నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ కేవలం ఆదిలాబాద్‌లోనే నాలుగు అసెంబ్లీ సీట్లతో పూర్తి ఆధిపత్యాన్ని చాటుకుంది. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో గుడ్డిలో మెల్లగా ఒకటి రెండు సీట్లతో ఉనికిని చాటుకుంది.

బీఆర్ఎస్: నాలుగు చోట్ల జీరో... మూడు చోట్ల ఒక్కో స్థానమే



39 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సీట్లు గెలిచి బలమైన ప్రతిపక్షంగా అవతరించిన బీఆర్ఎస్‌కు లోక్‌సభ సెగ్మెంట్‌ల వారీగా చూస్తే...నాలుగు చోట్ల ప్రాతినిధ్యం దక్కలేదు. పెద్దపల్లి, మహబూబ్‌నగర్, ఖమ్మంలతోపాటు హైదరాబాద్ లోక్‌సభ స్థానాల్లోని 28 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా దక్కించుకోలేదు. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎంఐఎం, గోషామహల్‌లో బీజేపీ గెలిచింది. ఇక పెద్దపల్లి, మహబూబ్‌నగర్, ఖమ్మంలోని 21 స్థానాల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేకుండా పోయింది. భువనగిరి ఎంపీ పరిధిలో కేవలం జనగామలో మాత్రమే టీఆర్ఎస్ గెలవగా, మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లాయి. వరంగల్ లోక్‌సభ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, నల్లగొండలో సూర్యాపేట, మహబూబాబాద్‌లో భద్రాచలం సీట్లు మాత్రమే బీఆర్ఎస్ గెలుచుకోగా, మిగతా ఆరేసి సీట్లను కాంగ్రెస్ సొంతం చేసుకోవడం గమనార్హం.

కాంగ్రెస్: రాజధానిలో హస్తవాసి బాగాలేదు



ముఖ్యమంత్రి రేసులో ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి దేశంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాల్లో ఒకటి. ఈ లోక్‌సభ స్థానం నుంచి రేవంత్‌రెడ్డి 2019 ఎన్నికల్లో 13వేల స్వల్ప తేడాతో విజయం సాధించారు. అయితే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని ఏడు సెగ్మెంట్లలోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఎంపీగా ఉన్న హైదరాబాద్‌లో కూడా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో మెదక్‌లో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందగా, మిగతా ఆరుచోట్ల బీఆర్ఎస్ విజయ కేతనం ఎగురవేసింది.

బీజేపీ: నలుగురు ఎంపీలున్నా నిరాశే



బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు లోక్‌సభ సీట్లలోనూ నిరాశే మిగిలింది. కేవలం ఆదిలాబాద్ ఎంపీ పరిధిలోనే బీజేపీ మెరుగైన స్థానాలు సాధించింది. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ సోయం బాపూరావు బోథ్ అసెంబ్లీ నుంచి ఓడిపోయినా, ఆదిలాబాద్, నిర్మల్, సిర్పూరు, ముథోల్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఒకింత ఓదార్పు. మరో ఎంపీ సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు సీట్లలో నాలుగు కాంగ్రెస్, మూడు బీఆర్ఎస్ గెలుచుకుంది. సంజయ్ పోటీ చేసిన కరీంనగర్, సిట్టింగ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్‌లలో బీఆర్ఎస్ గెలుపొందడం విశేషం. మరో ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్‌లో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లలో మాత్రమే బీజేపీ విజయం సాధించింది. సిట్టింగ్ ఎంపీ అర్వింద్ పోటీ చేసిన కోరుట్లలో ఆయనే ఓడిపోయారు. ఇక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని 6 అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించగా, నాంపల్లిలో ఎంఐఎం స్వల్ప తేడాతో కాంగ్రెస్‌పై విజయం సాధించింది.

యాదాద్రి విమాన గోపురం రాగి రేకుల పనులు పూర్తి



యాదాద్రి ఆలయ విమాన గోపురానికి రాగి రేకులు బిగించిన దృశ్యం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ విమాన గోపురానికి రాగి రేకులు అమర్చే పనులను శిల్పులు పూర్తి చేశారు. విమాన గోపురానికి బంగారం తాపడానికి గత ప్రభుత్వంలో కేసీఆర్ నిర్ణయించారు. నాటి నుంచి విమాన గోపురానికి రాగి రేకులను అమర్చి, అచ్చులు తీసుకునే పనులను చేపట్టారు. ప్రస్తుతం ఈ రాగి రేకుల బిగింపు పనులను శిల్పులు పూర్తి చేయడంతో బంగారు తాపడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ రాగి రేకులను తీసుకువెళ్లి వాటిపై బంగారు తాప డం పనులు చేసిన తర్వాత తిరిగి విమాన గోపురా నికి బిగించనున్నారు. రాగి రేకుల కోసం 10,680 కిలోల కాపర్ వినియోగించామని, మొత్తం రూ.5. 40 కోట్లు ఖర్చు చేసినట్లు ఈఓ గీతారెడ్డి తెలిపారు.

జనంలో ఉందాం!

▶ మొదటి పేజీ తరువాయి

భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ కవిత కూడా నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ అభ్యర్థులు, ఇతర నేతలతో తెలంగాణ భవన్‌కు వచ్చారు. గెలుపొందిన ఎమ్మెల్యేలను కేటీఆర్ అభినందించారు. ఓటమి పాలైన అభ్యర్థులకు ధైర్యంగా ఉండి కలిసి పనిచేద్దామంటూ భరోసా ఇచ్చారు.

ప్రజల నుంచి సానుకూల స్పందన

‘ఎన్నికల తర్వాత ప్రజల నుంచి మన పార్టీ నాయకత్వం విషయంలో ఒక సానుకూల స్పందన వస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదంటూ సమాజంలోని అన్ని వర్గాల నుంచి వందలాది మెసేజ్‌లు వస్తున్నాయి. తెలంగాణ బాగు కోరుకున్న అనేక మంది భావోద్వేగానికి గురవుతూ సందేశాలు పెడుతున్నారు. ఓటమితో నిరాశ చెందకుండా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుదాం. రెండు మూడురోజుల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు వెళదాం. ప్రభుత్వంలో, అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం, ప్రగతిభవన్ కేంద్రంగా విధులు, కార్యకలాపాలు కొనసాగించిన మనమంతా ఇకపై తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉందాం ’అని కేటీఆర్ అన్నారు.

నేతల భావోద్వేగం

ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, నేతలు భావోద్వేగానికి గురయ్యారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా పార్టీ అడుగుజాడల్లో నడిచిన తాము ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారైన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. పలువురు నేతలు కేటీఆర్, కవితతో ఫోటోలు దిగేందుకు పోటీలు పడ్డారు. వందలాది మంది తెలంగాణ భవన్‌కు తరలిరావడంతో పరిసరాలు సందడిగా కనిపించాయి. సుమారు మూడు గంటల పాటు తెలంగాణ భవన్‌లోనే గడిపిన కేటీఆర్ కొందరితో గ్రూపుగా, మరి కొందరితో ముఖాముఖి సంభాషించారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబిత ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, మహమూద్ అలీతో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కృష్ణారావు, గోపీనాథ్, వివేకానంద, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి: నారాయణ

కూనంనేనికి అభినందనలు తెలిపిన పార్టీ నేతలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. కొత్తగూడెం నుంచి గెలుపొందిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు సోమవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీ య కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, ప్రజాపక్షం సంపాదకుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా యణ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి, కుటుంబ, నియంత పాలన, బీఆర్ఎస్ ఆరాచకాలు, దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయి చిత్తుగా ఓడించారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషిస్తాం: అసదుద్దీన్



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుభాకాంక్షలు తెలిపారు. 7 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన మజ్లిస్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన నగరవాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాతెలంగాణ కోసమే కాంగ్రెస్‌కు పట్టం

- ఎన్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్

సాక్షి,హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో ప్రజాతెలంగాణ కోసమే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఎన్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు అన్ని విధాలుగా విసుగు చెంది ఓడించారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఓటురూపంలో తమ ప్రతాపం చూపారన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజాపాలన చేయకపోతే ఓటమి తప్పదనే విషయం ఈ ఫలితాలతో తెలిసిపోయిందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై బీఎస్పీని ఓడించాయి'



కాగజ్‌నగర్ టౌన్: సిర్పూర్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ రహస్యంగా ఒక్కటై బీఎస్పీని ఓడించాయని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సార్సాల, కాగజ్‌నగర్ పోలింగ్ కేంద్రాల వద్ద బీఎస్పీ ఏజెంట్లను బీఆర్ఎస్ గుండాలు మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేసినా ఓటర్లు బీఎస్పీని ఆదరించి ఓట్లు వేశారన్నారు. బహుజన గొంతుకగా నిల్చిన బీఎస్పీకి కొత్త ఆశలు రేకెత్తించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు శ్రేణులను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. సిర్పూర్ వాసులు తనను దత్తత తీసుకున్నారని, ఇక్కడే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు. బీఎస్పీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీల పరిష్కారానికి ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

గృహజ్యోతి @ 3,431 కోట్లు!



200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాకు కాంగ్రెస్ ఇచ్చిన హామీకి అయ్యే వ్యయం ఇదీ

- రాష్ట్రంలోని 88 శాతం గృహాలు వినియోగించే విద్యుత్ 200 యూనిట్లలోపే
- ఇప్పటికే వ్యవసాయానికి ఉచితం, కొన్ని వర్గాలకు రాయితీపై విద్యుత్
- ఇందుకు డిస్కంలకు ఏటా రూ.11వేల కోట్ల సబ్సిడీలు ఇస్తున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ హామీ అమలు చేస్తే ఈ భారం రూ.15 వేల కోట్లకు చేరిక

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకం కింద ఇళ్లకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలుకు(అందరికీ వర్తింపజేస్తే) ఏటా రూ.3,431.03 కోట్ల సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉంటుందని విద్యుత్ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు అందిస్తున్న సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలను కొనసాగిస్తూ అదనంగా ఈ మేరకు నిధులివ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు.

రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వినియోగదారుల సంఖ్య, ఆ గృహాలకు అవసరమైన విద్యుత్ సరఫరా, ఈ మేరకు ఉచిత విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన అదనపు సబ్సిడీల వివరాలను కింది పట్టికలో చూడవచ్చు..

గృహ వినియోగదారులు	కనెక్షన్ల సంఖ్య	అవసరమైన విద్యుత్ (మిలియన్ యూనిట్లలో)	ప్రభుత్వం ఇవ్వాల్సిన అదనపు సబ్సిడీలు (రూ.కోట్లలో)
0–50 యూనిట్లలోపు వాడకం	42,17,297	3,027.23	862.65
51–100 యూనిట్లలోపు వాడకం	32,59,881	971.52	609.4
101–200 యూనిట్లలోపు వాడకం	30,81,570	5,023.2	1,958.98
మొత్తం	**1,05,58,748**	**9,021.95**	**3,431.03**

➤ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి డిస్కంలు సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక 2023–24లోని ఫారం–12 ప్రకారం రాష్ట్రంలో మొత్తం గృహ కేటగిరీ విద్యుత్ కనెక్షన్లు 1.20 కోట్లు కాగా, అందులో 1.05 కోట్ల కనెక్షన్లు నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తున్నాయి. అంటే రాష్ట్రంలోని 87.9 శాతం గృహాలు నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వాడుతున్నాయి.

➤ ఇందులో అన్ని గృహాలూ నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించవు. కొన్ని గృహాలు 0–50 యూనిట్లలోపు, మరికొన్ని 51–100 యూనిట్లలోపు, ఇంకొన్ని గృహాలు 101–200 యూనిట్లలోపు విద్యుత్‌ను వాడుతున్నాయి. డిస్కంల లెక్కల ప్రకారం.. ఈ మూడు శ్లాబుల్లోని గృహాలకు 2023–24లో మొత్తం 9,021.95 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయాల్సి ఉంటుంది.

➤ గృహ వినియోగదారులకు జారీ చేసే విద్యుత్ బిల్లుల్లో వాడిన విద్యుత్ మేరకు ఎనర్జీ చార్జీలతో పాటుగా మినిమమ్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలను విధిస్తారు. ఈ నాలుగు రకాల చార్జీలు కలిపి 1.05 కోట్ల గృహ వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.3,431.03 కోట్ల విద్యుత్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు ఇవ్వాల్సి ఉంటుంది.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా, కాళేశ్వరం వంటి ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లులు, కొన్ని వర్గాల గృహాలకు సబ్సిడీ విద్యుత్ సరఫరా కోసం.. ఏటా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు రూ.11 వేల కోట్లకు పైగా నిధులను సబ్సిడీగా అందజేస్తోంది. గృహజ్యోతి పథకం అమలుతో విద్యుత్ సబ్సిడీల భారం రూ.15 వేల కోట్లకు చేరే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఓవర్ టు ఢిల్లీ..!

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. తొలుత పార్టీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి డీకే శివకుమార్ మాట్లాడారు. గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలిపి.. సీఎం ఎంపిక వ్యవహారంలో పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. తర్వాత సీఎం అభ్యర్థి ఎంపిక అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడికి కట్టబెడుతూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఏకవాక్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీఎల్పీ నేత భట్టి తీర్మానాన్ని సమర్థించగా.. మిగతా ఎమ్మెల్యేలంతా ఆమోదించారు.

సీఎం ఎవరైతే బాగుంటుంది?

ఏఐసీసీ పరిశీలకులు సీఎల్పీ సమావేశం తర్వాత ఎమ్మెల్యేలందరితో విడివిడిగా సమావేశమై.. సీఎం ఎవరైతే బాగుంటుందన్న అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో చాలా మంది కొత్త ఎమ్మెల్యేలు ఏఐసీసీ ఎవరిని ఎంపిక చేసినా తమకు సమ్మతమేనని చెప్పినట్టు సమాచారం. డీకే బృందం ఈ అభిప్రాయాలను వెంటనే ఢిల్లీకి చేరవేసింది. వాటిని హైకమాండ్ పరిశీలించి ఏం చెప్తుందోనని సాయంత్రం వరకు ఎదురుచూసింది. కానీ డీకే బృందాన్ని ఢిల్లీ రావాల్సిందిగా అధిష్టానం నుంచి పిలుపువచ్చింది. దీంతో డీకే శివకుమార్, ఏఐసీసీ పరిశీలకులు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. మంగళవారం తెలంగాణ సీఎం ఎంపిక వ్యవహారంపై హైకమాండ్ పెద్దలతో చర్చించనున్నారు. సీఎం క్యాండిడేట్‌పై స్పష్టతకు వచ్చాక రాష్ట్రంలోని ముఖ్య నేతలతో చర్చించి, అవసరమైతే వారిని ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్టు సమాచారం. తర్వాత సీల్డ్ కవర్‌లో సీఎం అభ్యర్థి పేరును హైదరాబాద్‌కు పంపి, సీఎల్పీ సమావేశంలో సదరు నేతను ఎన్నుకుంటారని తెలిసింది.

సోమవారమే ప్రమాణమంటూ హడావుడి!

సోమవారం మధ్యాహ్నం సీఎల్పీ సమావేశం ముగియకముందే కాంగ్రెస్ వర్గాల సీఎం ఎంపిక పూర్తయిందని, సాయంత్రమే రాజ్‌భవన్‌లో సీఎం, ఒకరిద్దరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ మేరకు రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయంటూ కొన్ని వీడియోలు కూడా బయటికి వచ్చాయి. గాంధీ భవన్ వర్గాల్లోనూ దీనిపై చర్చ జరిగింది. కానీ ఏఐసీసీ పెద్దలు డీకే టీమ్‌ను ఢిల్లీకి పిలిపించాక ఈ హడావుడి ఆగిపోయింది.



మీడియాతో మాట్లాడుతున్న డీకే శివకుమార్, మాణిక్‌రావు ఠాక్రే

గెలిచిన వారికి అభినందనలు

ఢిల్లీలోని సోనియా నివాసంలో సోమవారం జరిగిన పార్లమెంటరీ స్ట్రాటజీ కమిటీ సమావేశం తెలంగాణలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అభినందించింది. ఈ సమావేశంలో సీఎం ఎంపిక వ్యవహారంపై ఎలాంటి చర్చ జరగలేదని ఏఐసీసీ నేతలు జైరాం రమేశ్, మాణిక్యం ఠాగూర్ తెలిపారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి వస్తున్న ఏఐసీసీ పరిశీలకులతో మాట్లాడాక హైకమాండ్ తుదినిర్ణయం తీసుకుంటుందన్నారు.

హడావుడి వద్దు... ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి

సీఎల్పీ సమావేశానికి ముందు హోటల్ పార్క్ హయత్‌లో కీలక సమావేశం జరిగింది. భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, ప్రేమ్‌సాగర్‌రావు, దామోదర రాజనర్సింహ, రాజగోపాల్‌రెడ్డి తదితరులు డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య వాడీవేడి చర్చ జరిగినట్టు తెలిసింది. ముఖ్యంగా సీఎం అభ్యర్థి ఎంపిక వ్యవహారం, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న హడావుడి పార్టీకి నష్టం చేస్తుందని వారు డీకేతో పేర్కొన్నట్టు సమాచారం. ''ఫలానా వారికి సీఎం పదవి ఇవ్వవద్దని మేమేమీ అనడం లేదు. కానీ అందరు ఎమ్మెల్యేలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకోవాలి. ఆ అభిప్రాయాలపై నిర్ణయం తీసుకునేందుకు అనంతరం జరిగే పరిణామాల గురించి ఆలోచించాలి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. మనం ఇప్పుడు ప్రజల్లోకి పంపాల్సింది 'స్ట్రాంగ్' మెసేజ్ కాదు.. 'స్మార్ట్' మెసేజ్. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేసి ఫలితాలు సాధించాల్సిన బాధ్యతను పరిగణనలోకి తీసుకోవాలి'' అని వారు డీకేకు స్పష్టం చేసినట్టు సమాచారం. పార్టీ భవిష్యత్తును, పార్టీ పట్ల విధేయత, అనుభవాలను ఆచితూచి అంచనా వేసి నిర్ణయం తీసుకోవాలని.. ఇప్పటికిప్పుడే ఎమ్మెల్యేలకు వచ్చే ఇబ్బందేమీ ఉండదని వారు పేర్కొన్నట్టు తెలిసింది.

మన బలమింతేనా?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగిన సీపీఎం ఎక్కడా తన ప్రభావం చూపలేకపోయింది. భద్రాచలం మినహా ఇతరచోట్ల గెలుపోటములను నిర్దేశించలేకపోయింది. సీపీఎం పోటీ చేసిన 19 సెగ్మెంట్‌లలో 15 చోట్ల కాంగ్రెస్, నాలుగు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. అయితే ఏ నియోజకవర్గంలోనూ సీపీఎంకు డిపాజిట్ దక్కకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీచేసిన పాలేరులోనూ సత్తా చాటలేకపోయారు. ఆయనకు 5,308 ఓట్లు మాత్రమే వచ్చాయి. అక్కడ 20 వేలకు పైగా ఓట్లు వస్తాయని ఆ పార్టీ భావించింది. అయితే తమ ఓట్లను కూడా సీపీఎం పొందలేకపోయిందా? లేక పార్టీ బలం అంతేనా? అన్నదానిపై కూడా చర్చ జరుగుతోంది. భద్రాచలంలో సీపీఎం అభ్యర్థికి 5,860 ఓట్లు రాగా, అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి 5,719 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇక్కడ మాత్రం కాంగ్రెస్ గెలుపునకు సీపీఎం అడ్డుపడినట్టుగా హస్తంవర్గాలు అంటున్నాయి. పొత్తుల చర్చల సందర్భంగా సీపీఎం ఐదు స్థానాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీకి ప్రతిపాదనలు పంపించింది. పాలేరు, భద్రాచలం, మధిర, ఇబ్రహీంపట్నం, మిర్యాలగూడ స్థానాలను కోరింది. చివరకు పాలేరు, మిర్యాలగూడ స్థానాలు ఇవ్వాలని పట్టుబట్టింది. తర్వాత మిర్యాలగూడ, వైరా స్థానాలు తెరపైకి వచ్చాయి. అయితే మిర్యాలగూడ సెగ్మెంట్ ఒక్కటే ఇస్తామని కాంగ్రెస్ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. కానీ సీపీఎం మాత్రం మిర్యాలగూడ సహా ఖమ్మం జిల్లాలో వైరా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టింది. కాంగ్రెస్ ప్రతిపాదించినట్టుగా మిర్యాలగూడ అసెంబ్లీ స్థానంతోపాటు, రెండు ఎమ్మెల్సీలు తీసుకొని ఉంటే ఎలాగోలా గౌరవం దక్కేదన్న చర్చ ఇప్పుడు సీపీఎంలో జరుగుతోంది.

నిరాశలో సీపీఎం



- 19 స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తే, 15 చోట్ల 'హస్త'గతం
- భద్రాచలం సెగ్మెంట్‌లోనే కొద్దిగా కామ్రేడ్ల ప్రభావం

ఆయా సెగ్మెంట్‌లలో సీపీఎంకు వచ్చిన ఓట్లు.. అక్కడ గెలిచిన పార్టీ

నియోజకవర్గం	సీపీఎం ఓట్లు	గెలిచిన పార్టీ
ఇబ్రహీంపట్నం	3,948	కాంగ్రెస్
అశ్వారావుపేట	2,488	కాంగ్రెస్
ఇల్లెందు	2,137	కాంగ్రెస్
పాలేరు	5,308	కాంగ్రెస్
మధిర	6,575	కాంగ్రెస్
వైరా	4,439	కాంగ్రెస్
ఖమ్మం	1,940	కాంగ్రెస్
సత్తుపల్లి	1,210	కాంగ్రెస్
మిర్యాలగూడ	3,234	కాంగ్రెస్
నకిరేకల్	3,238	కాంగ్రెస్
నల్లగొండ	1,439	కాంగ్రెస్
మునుగోడు	2,351	కాంగ్రెస్
భువనగిరి	1,315	కాంగ్రెస్
హుజూర్‌నగర్	1,914	కాంగ్రెస్
కోదాడ	1,195	కాంగ్రెస్
జనగాం	1,765	బీఆర్ఎస్
భద్రాచలం	5,860	బీఆర్ఎస్
పటాన్‌చెరు	1,158	బీఆర్ఎస్
ముషీరాబాద్	835	బీఆర్ఎస్

సీఎల్పీ నేతను అధిష్టానం ప్రకటిస్తుంది: భట్టి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేతను అధిష్టానం ప్రకటిస్తుందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ఈ విషయంలో వస్తున్నవి ఊహాగానాలు మాత్రమేనని, వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. 'సోమవారం హైదరాబాద్‌లో సీఎల్పీ సమావేశం జరిగింది. సీఎల్పీ నాయకుడి ఎంపికను పార్టీ అధిష్టానానికి అప్పగిస్తూ ఈ సమావేశంలో ఏక వాక్య తీర్మానం చేసి పంపించాం. పార్టీ అధిష్టానం సీఎల్పీ నాయకుడిని ప్రకటిస్తుంది'అని భట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నా ఓటమికి బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర: జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును బీజేపీ చీల్చడంతోనే తాను ఓటమి పాలయ్యానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పన్నిన కుట్రతోనే రాష్ట్రంలోని 15 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారని తెలిపారు. సోమవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంపై హర్షం వ్యక్తంచేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్‌ను అస్థిర పరిచేందుకు మాజీ సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని, ఇందుకు కడియం శ్రీహరి వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ కుట్రలకు కేంద్రంలోని మోదీ మద్దతిస్తున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించినట్లుగానే కేంద్రంలో మోదీని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు నెలల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి లేదని పేర్కొందని, సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా ఫండింగ్ ఏజెన్సీలు రుణ సౌకర్యం ఎలా కల్పించాయో తెలియడం లేదని జీవన్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ కోటాలో మంత్రి పదవి రాబోతుందా? అన్న ప్రశ్నకు తానేనాడూ పదవుల కోసం పాకులాడలేదని, అదంతా అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, శంకర్, నందయ్య, దుర్గయ్య, రాజేందర్, అశోక్, రాజేందర్, రఘువీర్‌గౌడ్, నేహాల్, చాంద్‌పాషా ఉన్నారు.

కాంగ్రెస్‌కు 'కౌన్సిల్' కష్టాలు

- ప్రస్తుతం ఆ పార్టీ తరఫున ముగ్గురు ఎమ్మెల్సీలు
- కసిరెడ్డి అసెంబ్లీకి ఎన్నిక కావడంతో రెండుకు తగ్గనున్న బలం
- త్వరలో మూడు స్థానాలు మాత్రమే భర్తీ అయ్యే అవకాశం
- బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్‌పైనే భారం..



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభలో అధికారం చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ శాసన మండలిలో మాత్రం విచిత్రమైన స్థితిని ఎదుర్కోనుంది. 40 మంది సభ్యులున్న మండలిలో 37 మంది ప్రతిపక్షాలకు చెందిన వారు కాగా కేవలం ముగ్గురు (బీఆర్ఎస్‌ను వీడిన ఇద్దరితో కలిపి) మాత్రమే కాంగ్రెస్ సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉండగా, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు సభ్యులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. దీంతో ప్రస్తుతం కేవలం ఐదు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. అయితే మూడు ఖాళీలు మాత్రమే స్వల్ప సమయంలో భర్తీ అయ్యే అవకాశం ఉంది. 2025 మార్చి లోపు ఏ కోటాలోనూ రిటైర్ అయ్యే సభ్యులు ఎవరూ లేకపోవడంతో కాంగ్రెస్ తరఫున పెద్ద సంఖ్యలో సభ్యులు మండలిలో అడుగు పెట్టేందుకు ఏడాదిన్నర వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల కోటాలో 14 స్థానాలు ఉండగా 2028లో 18 మంది రిటైర్ అవుతారు. ప్రస్తుతం మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ సహా ఎక్కువ మంది బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉండటంతో శాసనసభ ఆమోదించే తీర్మానాలు, బిల్లులు మండలిలో నెగ్గడం బీఆర్ఎస్‌పైనే ఆధారపడి ఉంటుంది.

ముగ్గురు తోడయ్యే చాన్స్

శాసనమండలిలో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు ఈ ఏడాది ఆగస్టులో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను కేసీఆర్ ప్రభుత్వం సిఫారసు చేసింది. అయితే వీరు రాజకీయ పార్టీల సభ్యులుగా ఉన్నారనే కారణంతో గవర్నర్ తిరస్కరించారు. దీంతో ఈ రెండు ఖాళీల్లో ఇద్దరిని గవర్నర్ కోటాలో నామినేట్ చేసే అవకాశం కొత్త ప్రభుత్వానికి ఉంటుంది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా ఓటమి పాలు కావడంతో ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఆయన కుమారుడు రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్) కాంగ్రెస్ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను వీడారు. కసిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ప్రస్తుతం మండలిలో జీవన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి మాత్రమే కాంగ్రెస్ సభ్యులుగా కొనసాగనున్నారు. మరోవైపు కసిరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ), కడియం శ్రీహరి (స్టేషన్ ఘనపూర్) కూడా ప్రస్తుత ఎన్నికల్లో శాసనసభకు ఎన్నికవడంతో మండలిలో 3 సీట్లు ఖాళీ కానున్నాయి. వీరిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రాడ్యుయేట్స్, కసిరెడ్డి స్థానిక సంస్థల కోటా నుంచి ఎన్నికైన నేపథ్యంలో వీరి స్థానంలో కొత్తగా వచ్చే వారు ప్రత్యక్ష ఎన్నిక ద్వారానే మండలిలో అడుగు పెట్టాల్సి ఉంటుంది. కడియం శ్రీహరి ఎమ్మెల్యే కోటాలో ఎన్నిక కావడంతో కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం ప్రకారం పార్టీ ఎంపిక చేసిన వారికి ఎమ్మెల్సీగా అవకాశం దక్కుతుంది. అంటే ఇప్పటికిప్పుడు గవర్నర్ కోటాలో ఇద్దరు, ఎమ్మెల్యే కోటాలో ఒకరే కాంగ్రెస్ తరఫున మండలికి ఎన్నికయ్యేందుకు అవకాశం ఉందన్నమాట.

మండలిలో ప్రస్తుత బలాబలాలు

మొత్తం స్థానాలు	: 40
బీఆర్ఎస్	: 30
కాంగ్రెస్ (దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి సహా)	: 03
ఏఐఎంఐఎం	: 02
బీజేపీ	: 01
స్వతంత్ర	: 02
ఖాళీలు (గవర్నర్)	: 02

బీఆర్ఎస్ తరహాలో వలసలు?

తొలిసారి 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఇలాంటి పరిస్థితిని అధిగమించేందుకు కాంగ్రెస్, టీడీపీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుని మండలిలో బలోపేతమైంది. ఇప్పుడదే తరహా వ్యూహాన్ని కాంగ్రెస్ కూడా అనుసరిస్తుందా? అన్న అంశంపై చర్చ ప్రారంభమైంది.



ఏ వ్యక్తి ఒకే నదిలో రెండుసార్లు అడుగుపెట్టలేడు.
ఎందుకంటే ఎప్పటికీ అది ఒకే నది కాదు, ఎప్పటికీ అతడు ఒకే మనిషి కాదు.
- హెరాక్లిటస్

సాక్షి
మంగళవారం, 5 డిసెంబర్ 2023

జయాపజయాలు

మినీ జనరల్ ఎన్నికలుగా భావించిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటర్లు వెలువరించిన విస్పష్టమైన తీర్పు భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న 'ఇండియా' కూటమి, దాని ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ తలరాతలను తలకిందులు చేసింది. తెలంగాణలో దక్కిన బొటాబొటీ విజయం ఒక్కటే కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది. ప్రధాన రాష్ట్రాలైన రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లతోపాటు ఛత్తీస్‌గఢ్‌ను కూడా గెల్చుకుని మరో ఆర్నెల్లల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమే ముచ్చటగా మూడో సారి కూడా అధికారంలోకొస్తుందని బీజేపీ చాటింది. ఈ మూడుచోట్లనుంచీ 65 లోక్‌సభ స్థానాలున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో 36 యేళ్లుగా అధికారంలో కొనసాగుతున్న మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)– కాంగ్రెస్ కూటమి కొత్తగా ఆవిర్భవించిన జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జడ్‌పీఎం) చేతుల్లో మట్టికరిచింది. అక్కడ ముఖ్యమంత్రి – ఎంఎన్‌ఎఫ్ సారథి జోరంతంగాతో పాటు 11 మంది మంత్రులు చిత్తుగా ఓడిపోయారు. ఒకటి రెండు రోజుల్లో ఈ అయిదు రాష్ట్రాల్లోనూ కొత్త సారథులు కొలువుదీరబోతున్నారు. మూడు రాష్ట్రాలు గెలుచుకున్న బీజేపీ గానీ, తెలంగాణ గెల్చుకున్న కాంగ్రెస్ గానీ తమ సీఎం అభ్యర్థులను ప్రకటించాల్సివుంది. ఈలోగా ఊహాగానాలే షికారు చేస్తాయి. ఒక్క మిజోరంలో మాత్రం జడ్‌పీఎం చీఫ్ లాల్దుహోమా ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ ముందే ప్రకటించింది. ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగానే 'ఇండియా' కూటమిలో రుసరుసలు వినిపించాయి. హిందీ బెల్ట్‌లో బీజేపీ ప్రభంజనానికి కాంగ్రెస్ చేతగానితనమే కారణమని తృణమూల్ కాంగ్రెస్ అనటం, తమ పార్టీ అధినేత మమతాబెనర్జీని, కూటమిలోని ఇతర నేతలనూ కలుపుకొని వెళ్లటంలో ఆ పార్టీ విఫలమైందని ఆరోపించటం... జేడీ(యూ), ఆర్జేడీలు సైతం అదే తరహాలో మాట్లాడటం త్వరలో జరగబోయే కూటమి సమావేశం ఎలా ఉంటుందో చెబుతున్నాయి. మొన్న మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుంచీ ఊహలపల్లకీలో ఊరేగుతున్న కాంగ్రెస్‌ను తాజా ఫలితాలు కిందకు దించాయి. ఈ పంచతంత్రం గట్టెక్కటం ఎలాగోనని సంశయిస్తూ బరిలోకి దిగిన బీజేపీ... తమ నేతలంతా ఒక్కతాటిపై నిలిచారన్న అభిప్రాయాన్ని కలిగించటంలో విజయం సాధించింది.

రణరంగానికి తరలే శ్రేణులపై సైన్యాధిపతికి పట్టుండాలి. అతని ఆదేశాలకు అనుగుణంగా ముందుకురికేందుకు చతురంగ బలాలు సర్వసన్నద్ధంగా వుండాలి. విజయమో, వీరస్వర్గమో అన్నంతగా చెలరేగిపోవాలి. కాంగ్రెస్‌కు సంబంధించి జరిగిందంతా అందుకు విరుద్ధం. అధిష్ఠానం సూచనలు పాటించటానికి రాజస్తాన్‌లో గహ్లోత్, మధ్యప్రదేశ్‌లో కమలనాథ్ ససేమిరా అన్నారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లో ఈడీ దాడులతో ఎజెండాలోకొచ్చిన మహదేవ్ యాప్ కొంపముంచింది. కనుకనే ఈ మూడుచోట్లా పార్టీ ఆశలు ఆడియాసలయ్యాయి. 'ఇండియా' కూటమిలో దాని స్థానాన్ని మరింత బలహీనపరిచాయి. అధికారంలో ఉన్నవారిని సాగనంపే సంప్రదాయం వున్న రాజస్తాన్‌పై కాంగ్రెస్‌కు ఎటూ పెద్దగా ఆశలు లేవు. అయినా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ గత ఏడాదిగా ప్రకటిస్తున్న జనాకర్షక పథకాలు ఈ సరళిని మారుస్తాయేమోనన్న భయం బీజేపీలో లేకపోలేదు. కానీ మధ్యప్రదేశ్‌లో అలా కాదు. అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నంతగా ప్రచారం జరిగింది. ఎందుకంటే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా అవతరించి అత్తెసరు మెజారిటీతో పాలన ప్రారంభించిన కాంగ్రెస్‌కు రెండేళ్లు తిరగకుండానే పొగబెట్టి బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. సగటు ఓటరుకు ఆ విషయంలో సానుభూతి ఉన్నదని అందరూ అంటూ వచ్చారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సంక్షేమ పథకాల జోరు కనబడుతున్నా బీజేపీ సంశయిస్తూనే అడుగులు వేసింది. జాగ్రత్తగా పావులు కదిపింది. సునాయాసంగా అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇక కాంగ్రెసే మళ్లీ అధికారంలోకి రావటం ఖాయమని అందరూ అనుకున్న ఛత్తీస్‌గఢ్‌లో సైతం ఆ పార్టీకి పరాజయం తప్పలేదు.

రాజస్తాన్‌లో గహ్లోత్, యువ నాయకుడు సచిన్ పైలెట్‌ల మధ్య నాలుగేళ్లుగా హోరాహోరీ పోరు సాగుతోంది. వారిద్దరిలో ఎవరు నిష్క్రమిస్తే పార్టీకి ఎక్కువ నష్టమో అధిష్ఠానం తేల్చుకోలేక, ఇద్దరి మధ్యా సంధి కుదిర్చేందుకు తంటాలూ పడింది. ఈ అంతర్గత పోరు ఎంత నష్టపరిచిందంటే స్వతంత్రంగా ఉంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే గిగ్ వర్కర్స్ సంక్షేమానికి దేశంలోనే తొలిసారి చట్టం తెచ్చిన ఘనతను సైతం ప్రచారం చేసుకోలేకపోయింది. ఇతర సంక్షేమ పథకాలు సరేసరి. ఇక మధ్యప్రదేశ్‌లో దాదాపు 30 స్థానాల్లో అభ్యర్థులను మార్చాలని ఎందరు మొత్తుకున్నా కమలనాథ్ ససేమిరా అన్నారు. పైగా తాను ఓ వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతిని మరిచి 'జై జై కమలనాథ్' నినాదాన్ని రుద్దారు. ఛత్తీస్‌గఢ్‌లో మహదేవ్ యాప్ కుంభకోణం తర్వాత సీఎం బఘేల్‌తో వేదిక పంచుకోవటానికి రాహుల్, ప్రియాంక సిద్ధపడలేదు. సంక్షేమ పథకాలతో ఊదరగొడితే చాలదు... నాయకత్వ పటిమపై విశ్వసనీయత కలిగించాలి. ఆ విషయంలో వైఫల్యమే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ముంచింది. అటు బీజేపీలో మూడు రాష్ట్రాల్లోనూ స్థానిక నేతలనూ పక్కనబెట్టి అభ్యర్థుల నిర్ణయంలోనూ, ప్రచారవ్యూహంలోనూ అగ్ర నాయకత్వం తనదే పైచేయి అన్నట్టు వ్యవహరించింది. మోదీ సర్వం తానైనట్టు వ్యవహరించారు. అది విజయానికి దోహదపడింది. దాంతోపాటు కాంగ్రెస్ వైఫల్యాలు కూడా బీజేపీకి కలిసొచ్చాయి. జనం భావోద్వేగాలపైకాక సంక్షేమం, అభివృద్ధి అంశాలపై దృష్టి సారించటం కూడా ఆ పార్టీకి పనికొచ్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే తోడ్పడుతుందని భావిస్తే అది బీజేపీకే మేలు.

అస్తమించని మేధా సూర్యుడు

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావుల్లో అగ్రగణ్యులు. భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన చెక్కిన రాజ్యాంగ శిల్పంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. లౌకిక భావన, ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారత ప్రజలకు లభించడానికి తీవ్రంగా కృషి చేశారు. ఆయన విశుద్ధంగా, వినిర్మలంగా, ద్వేష రహితంగా జీవించారు. అదే జీవన విధానం అందరికీ ఆచరణీయం. ఆయన సిద్ధాంతాలైన కుల నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, ఆర్థిక సమత, మానవ హక్కులు, బహుజన సాధికారతలను సాధించడానికి మనందరం ముందుకెళ్ళాల్సిన చారిత్రక సందర్భమిది.

అంబేడ్కర్‌కి పూర్వం, అంబేడ్కర్ తర్వాత అని భారతదేశ చరిత్రను మనం లిఖించాల్సి ఉంటుంది. అంబేడ్కర్‌కి పూర్వం భారతదేశం మనుస్మృతి రాజ్యం, వర్ణ వ్యవస్థ రాజ్యం, బ్రాహ్మణాధిపత్య రాజ్యం, లౌకికేతర రాజ్యం, అప్రజాస్వామిక రాజ్యం, నియంతృత్వ రాజ్యం. అంబేడ్కర్ భారత దేశం రూపురేఖలను మార్చారు. లౌకిక ప్రజాస్వామిక దేశంగా చేశారు. ఆయన భారత రాజ్యాంగ శిల్పంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. లౌకిక భావన ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను భారత రాజ్యాంగం ద్వారా భారత ప్రజలకు లభించడానికి కారకులయ్యారు. కులాతీత, మతాతీత రాజ్యాంగాన్ని రూపొందించి భారతదేశానికి కానుకగా సమర్పించారు. భారత దేశ భవిష్యత్తుకు ఆ రాజ్యాంగమే దిక్సూచి.

అంబేడ్కర్ ప్రపంచంలోనే పేరెన్నిక గన్న మేధావి. తత్వవేత్త, దార్శనికుడు అని ఎవరిని అంటారు? ప్రపంచ గమన సూత్రాలను మార్చ గలిగిన వారినే అంటారు. అంబేడ్కర్‌కు ముందు ఒక బుద్ధుణ్ణి, ఒక మార్క్స్‌ను ప్రజలు తత్వవేత్తగా కొనియాడారు. ఆయన బుద్ధుని కంటే, మార్క్స్ కంటే కూడా విశిష్ట లక్షణాలు ఉన్న మేధావి. భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యకు, అస్పృశ్యతా నిర్మూలనకు నిర్మాణాత్మకమైన సిద్ధాంతాలు, సూత్రాలు అందించారు.

అణగారిన ప్రజల హక్కుల సిద్ధాంతానికి కర్త అయ్యారు. అంతే కాక, దానికి చట్ట రూపాన్ని తీసుకొచ్చిన నిర్మాణ కర్త ఆయన. అంబేడ్కర్ పరినిర్వాణం 67వ ఏట అడుగు పెడుతున్నా ఆయన కీర్తి తరగ లేదు. ఆయన సిద్ధాంతాలు విశ్వవ్యాప్తమవ్వడానికి కారణం, ఆయన జీవితం అంతా అనంత పరిశోధన చేసి, కుల నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలనం, ఆర్థిక అసమానతల నిర్మూలనకు బాటలు వేయడమే. ఆయనలా విశుద్ధంగా, నిర్మలంగా, ద్వేష రహితంగా జీవించిన మేధావులు అరుదు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణాన్ని భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రూపొందించారు. అందుకు ఆయన తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టారు.

ఆయన విద్యార్జన గమ్యం అస్పృశ్యుల ఉద్ధరణ. అదీ దళిత విద్యావంతులలో ఉండాల్సిన ఆదర్శం. దళిత విద్యార్థులు ఆ నిర్దేశకత్వం నుండి తప్పితే అంబేడ్కర్ మార్గాన్ని నిరోధించిన వారే అవుతారు. ఈ సత్యాన్ని ప్రతి అంబేడ్కర్‌వాది గుర్తుంచుకోవాలి. ఆయన లండన్‌లో ఉన్నప్పుడు కూడా తన మనస్సు మాత్రం భారతదేశ అస్పృశ్య సమాజం మీదే ఉండేది. భారతదేశంలో అస్పృశ్యుల కోసం పని చేస్తున్న సంఘాలు ఏమి చేస్తున్నాయా అని ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ ఉండేవారు.

అంబేడ్కర్ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను సంతరించుకున్నారు. నాయకుడు కేవలం తన వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించడు. తన జాతి గురించే ఆలోచిస్తాడు. త్యాగపూరితంగా



పనిచేయడం ద్వారా తన జాతీయుల మనసులను చూరగొంటాడు. నాయకుడు తన భావజాలాన్ని జాతికి అందించడానికి వాహికను రూపొందించుకుంటాడు. అది ఉత్తరాల ద్వారా కావచ్చు, పత్రికల ద్వారా గావచ్చు, సభలు, సమావేశాల ద్వారా గావచ్చు. ఆయన చేసిందీ అదే! ఆయన అనేక పత్రికల్లో రాయడమే కాక స్వయంగా 'మూక్ నాయక్', 'బహిష్కృత్ భారత్', 'జనత', ప్రబుద్ధ భారత్' వంటి పత్రికలు స్థాపించి వాటి ద్వారా తాను చెప్పాలనుకున్నది నిర్భయంగా, కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఎన్నో సభల్లో ఉపన్యసించి అణగారిన వర్గాలను ఉత్తేజితులను చేశారు. నాటి ప్రభుత్వ పెద్దలకూ, రాజకీయ నాయకులకూ ఆయన రాసిన ఉత్తరాలు ఇప్పటికీ చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉన్నాయి.

అంబేడ్కర్ నిశిత పరిశీలకుడు. ముఖ్యంగా ఆయన పోరాటానికి పునాది పూర్తి కుల త్యాగ నిరతి. అందుకే పూర్వీకుల వీరోచిత గాథలను వర్ణించారు. ఆయన క్రమశిక్షణతో కూడిన నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూ వీరోచితమైన సాహసాన్నీ, మొక్కవోని నిబ్బరాన్నీ, ధైర్యాన్నీ కొనియాడదగిన నిశ్చితత్వాన్నీ ప్రదర్శించిన మహర్ సైనికులకు శాశ్వతమైన గుర్తింపును తెచ్చారు. 'ఇద్దరిలో ఎవరి కీర్తి గొప్పదో చెప్పడం కష్టం. అది భారతీయ సైనికులదో లేక అంతటి విధేయతను, విశ్వాసాన్ని పొందేలా వ్యవహరించిన బ్రిటిష్ ఆఫీసర్లదా?' (భారతీయ సైనికులలో అధికులు మహర్లు) అంటూ మేజర్ జె.టి. గోర్మన్ తన 'హిస్టారికల్ రికార్డ్ ఆఫ్ ది సెకండ్ బెటాలియన్ ఫోర్త్ బాంబే గ్రెనెడీర్స్, 1796–1933'లో పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం. అనతికాలంలోనే కోరెగాంవ్ చర్యకున్న ప్రాముఖ్యతను గుర్తించారు. కోరెగాంవ్‌లో మొదటి తూటా పేలిన స్థలంలో 65 అడుగుల ఎత్తు, 32 చదరపు అడుగుల వెడల్పు ఉన్న స్మృతి చిహ్నాన్ని నిర్మించాలని తలపెట్టారు. దీనికి 1821 మార్చి 26న పునాది రాయి వేశారు. ఈ దళం సాహసానికి స్మృతిగా ఈ స్తూపాన్ని నిర్మించారు. ఈ సాహసాన్ని కొనసాగించే ఉద్దేశంతో దీనిని నెలకొల్పారు.

అస్పృశ్యులు అనబడినవారు వీరోచితమైన జాతులు అని అంబేడ్కర్ తన అస్పృశ్యుల వాడలో నిరూపించారు. పల్నాటి యుద్ధంలో తెలుగు నేలలో దళితులే పాల్గొన్నారు. కృష్ణదేవరాయల సైన్యంలో ఏనుగులను, గుర్రాలను నడిపింది దళితులే. ముఖ్యంగా పల్నాటి వీర చరిత్రలో కన్నమదాసు సైన్యాధ్యక్షుడు. ఆయన ఉపయోగించిన కత్తి ఇప్పటికీ కారంపూడిలో ఉంది. డా॥ అంబేడ్కర్ కృషి వలన అస్పృశ్యత ఒక నేరంగా రాజ్యాంగం పరిగణిస్తూ ఉంది. కాని భారతదేశంలో లక్షలాది గ్రామాలలో ఇంకా అస్పృశ్యత వెన్నాడుతోంది. ఎన్నో హోటళ్ళలో గ్లాసులు అస్పృశ్యులకు వేరుగా ఉంచుతున్నారు. కొన్ని ప్రభుత్వాలు ఊరికి దూరంగా ఇళ్ళు కట్టిస్తున్న సందర్భాలూ ఉన్నాయి.

భారత రాజ్యాంగంలో 21వ ఆర్టికల్‌ను వివరిస్తూ డా॥ అంబేడ్కర్ 'ప్రభుత్వ సొమ్మును మత బోధకులకు, మత కార్యకలాపాలకు ఉపయోగించరాదు. మత బోధలకు సంబంధించి స్వయంగా లేక ప్రయివేటు సంస్థల ద్వారా ప్రభుత్వం ఖజానా డబ్బును ఖర్చు చేయడానికి వీలులేదు' అని స్పష్టం చేశారు. దీనికి పూర్తిగా, భిన్నంగా ఈనాడు జరుగుతూ ఉంది. ప్రభుత్వ ప్రచార సాధనాలయిన రేడియో, టీవీ వంటివాటిలో మత ప్రచారం చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆనాడు అంబేడ్కర్ వివరించిన దానికి పూర్తి భిన్నంగా జరుగుతూ ఉంది. సెక్యులరిజం అంటే 'మత ప్రమేయం లేని రాజ్యం' అని అర్థం. ఈనాడు ప్రభుత్వం పూర్తిగా మతపరంగా వ్యవహరిస్తూ వుంది. ఇది భారత రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్‌కూ, ఆయన ఆలోచనలకూ పూర్తిగా వ్యతిరేకమయిన విషయం. అందుకే రానురానూ అంబేడ్కర్ అవసరం పెరిగింది.

ప్రపంచ వ్యాప్తంగా అంబేడ్కర్ మేధావిగా గుర్తింపు పొందారు. లండన్‌లోని 'ఇండియా హౌస్'లో ఆయన బంగారు విగ్రహం ఉంది. బ్రిటిష్ పార్లమెంట్ ఎదురుగా ఆయన నిలువెత్తు విగ్రహం ఉంది. ఇక భారత్‌లో సరేసరి. ఇండియన్ పార్లమెంట్ ఎదురుగా ఆయన సమున్నత విగ్రహం వుంది. ఇవాళ హైద్రాబాద్ నడిబొడ్డులో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వెలుగులీనుతోంది. విజయవాడలో 125 అడుగుల విగ్రహం జనవరిలో ఆవిష్కరించబడుతుంది. ఆయన రాజ్యాంగ నిర్మాణ దక్షత, ప్రతిభా సామర్థ్యాలను గుర్తిస్తూ కశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఆయన విగ్రహాలు నిరంతరం వెలుస్తూనే ఉన్నాయి. ఈనాడు ఆయన భావజాల అవసరం చాలా ఉంది. మనమందరం ఆయన వర్ధంతికి నివాళిగా ఆయన సిద్ధాంతా లైన కుల నిర్మూలన, అస్పృశ్యతా నివారణ ఆర్థిక సమత, మానవ హక్కుల పోరాట దీక్షలతో బహుజన సాధికారిత రాజ్యాధికార భావనలతో ముందుకెళ్ళాల్సిన చారిత్రక సందర్భమిది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695
(రేపు డా॥ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతి)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బతకనివ్వరా?!



బిహార్‌లో చాలామంది కేరళ టీచర్‌లు ఉన్నారు. వారు తమ కుటుంబాలను పోషించుకోడానికి అక్కడికి వెళ్లారు. బెంగాలీలు హైదరాబాద్‌లో టీచర్లుగా, పంజాబ్‌లో కూలీలుగా మనుగడ సాగిస్తున్నారు. పని చేయడానికి, సంపాదించడానికి దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లే హక్కు భారతీయులందరికీ ఉంది. విభజించడం, వేరుగా చూడటం ఆపండి.

– కనిష్క దధీచ్, జియో–పొలిటికల్ ఎనలిస్ట్


నరకప్రాయం



మిచువాంగ్ తుపాన్ ఈ ఉదయం నా జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది. చెన్నైలోని మా అపార్ట్‌మెంట్ నుంచి నేను ఎయిర్‌పోర్ట్‌కి చేరుకునే లోపే ముంబై వెళ్లే ఫ్లయిట్ తప్పిపోయింది. ఉసూరుమంటూ అపార్ట్‌మెంట్‌కి తిరిగి వచ్చాక పవర్ కట్ కావడంతో అరగంట పాటు ఎలివేటర్‌లోనే ఇరుక్కుపోయాను. సొసైటీ వాళ్లు వచ్చి నన్ను కాపాడే వరకు లోపలే ఉండిపోవలసి వచ్చింది.

– సూర్యనారాయణ్ గణేశ్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

సాంస్కృతిక ఓటు



సంస్కృతి, ఆలయారాధన, యోగ, ఆయుర్వేదం, వేదాంతాల (శంకర, రామానుజ, మధ్వ) పరంగా అయితే దక్షిణాది రాష్ట్రాలను దేశంలోని హైందవ భూభాగంగా పరిగణించవచ్చు. దక్షిణ భారతీయులు ఆ సంస్కృతిని సమర్థించేవారికి ఓటు వేస్తారు తప్ప నాశనం చేసేవారికి కాదు. సనాతన ధర్మంలో ఉత్తరాది, దక్షిణాది అనే విభజన లేదు.

– డాక్టర్ డేవిడ్ ఫ్రాలీ, పద్మభూషణ్

ఇష్టారాజ్యం!



వి.ఐ.పి. కల్చర్‌ని అంతం చేస్తామని చెప్పినవారు ఇప్పుడు బస్టాండ్ మధ్యలో హెలికాప్టర్‌ని దింపుతున్నారు! పంజాబ్ ప్రజలకు క్రమంగా కేజ్రీవాల్, భగవంత్ మన్‌ల అసలు స్వరూపం కనిపిస్తోంది. వారిద్దరూ నటులు, దొంగలు తప్ప మరొకటి కారు. వారి ఏకైక ధ్యేయం పంజాబ్‌ను దోచుకోవడం, తమ ఖజానాను నింపుకోవడం మాత్రమే!

– మన్జీందర్ సింగ్ సిర్సా
బీజేపీ జాతీయ కార్యదర్శి

ఇన్ బాక్స్

నిరుద్యోగుల విజయం!

నీళ్లు, నిధులు, నియామకాలు... ఈ మూడు లక్ష్యాలతో తెలంగాణ ఏర్పాటైంది. రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత పాత్ర మరువలేనిది. 'స్వరాష్ట్రంలో మన ఉద్యోగాలు మనకే వస్తా'యని అప్పటి ఉద్యమ నేతగా ఉన్న కేసీఆర్ విద్యార్థులు, యువతలో భారీగా ఆశలు రేకెత్తించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. సమయానికి ఉద్యోగ ప్రకటనలు రాకపోవడం, నియా మకాలు తరచూ కోర్టు కేసులతో ఆగిపోవడం, టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లు లీక్ కావడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ప్రభుత్వంలోని అగ్రశ్రేణి మంత్రులు, ఎమ్మెల్యేలు నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం, చులకనగా మాట్లాడడం జరిగింది. దీంతో నిరుద్యోగులకూ, ప్రభుత్వానికీ మధ్య అంతరాలు పెరిగాయి. ప్రభుత్వ ఉద్యోగం కోసం యువత గత పదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతూ చదివారు. అయినా ఫలితం లేకపోవడంతో వారు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారనేది విశ్లేషకుల మాట.

నిరాశలో ఉన్న నిరుద్యోగులను ఆకర్షించడానికి ప్రతిపక్షాలు, ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో తెలంగాణ వ్యాప్తంగా 'నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర' చేపట్టి యువతను మరింత ఆలోచింపజేసింది కాంగ్రెస్ పార్టీ. బీఆర్‌ఎస్‌కు చెందిన కేటీఆర్ లాంటి ప్రధానమైన నాయకుడు నిరుద్యోగులతో ప్రత్యక్షంగా మాట్లాడినా వారు ఆయన మాటలు నమ్మలేదు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ 'జాబ్ కేలండర్'తో తమ మేనిఫెస్టో విడుదల చేసింది. ఇలాంటి అనుకూల ప్రకటనలు ఉద్యోగార్థుల్లో నూతన ఆశలు రేకెత్తించాయి. ఫలితంగా వారందరూ కాంగ్రెస్‌కు అండగా నిలిచారనేది నిపుణుల విశ్లేషణ.

– సంపతి రమేష్ మహారాజ్
వెంకట్రావుపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

ఒక జ్ఞాపకం... ఒక సంస్మరణ!

నివాళి




లంకా పాపిరెడ్డి

విప్లవ రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన ముక్కు సుబ్బారెడ్డి మరణంతో తొలితరం విప్లవ నాయకుల్లో మరో ముఖ్యుడు కాలగతిలో కలిసిపోయినట్లయింది. ఒకానొక క్లిష్ట దశలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీపుల్స్‌వార్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి ఉద్యమాన్ని బతికించారు. నాలాంటి వారికి ఆయన చేసిన పనులు సాహస గాథలుగా స్ఫూర్తినిచ్చాయి.

1960వ దశాబ్దం ప్రపంచంలోని చాలా భాగాలు ఆందోళనలతో అతలాకుతలం అవుతున్న కాలం. భారతదేశం కూడా ఉద్యమాలతో అట్టుడికిపోతున్న కాలం. కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయి నక్సలైట్ ఉద్యమం తలెత్తిన కాలం. సరిగ్గా ఈ కాలంలోనే మొన్న డిసెంబర్ 1న తుది శ్వాస విడిచిన ముక్కు సుబ్బారెడ్డి వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ–ఆర్‌ఈసీ (ఇప్పుడు నిట్)లో చదువుకుంటుండేవారు. నక్సలైట్ ఉద్యమ నాయకుడు కొండపల్లి సీతారామయ్య కొడుకు చందు పరిచయంతో సుబ్బారెడ్డి విప్లవ రాజకీయాల్లోకి ప్రవేశించారు.

ముక్కు సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా కనిగిరి మండలం గణేశుని కండ్రిగ గ్రామం. చాలా పేదరికంలో పెరిగిన నేపథ్యం. వారాల అబ్బాయిగా కష్టపడి చదివి మెరిట్ సాధించి వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సంపాదించారు. పేదరికం అనుభవించిన వాడిగా, అప్పటికే కమ్యూనిస్టు రాజకీయాల పరిచయం ఉన్నవాడిగా విప్లవ రాజకీయాలను చాలా త్వరగా సొంతం చేసుకున్నారు.

1976లో నాగ్‌పూర్‌లో కొండపల్లి సీతారామయ్య అరెస్టయ్యారు. అప్పటికే కేజీ సత్యమూర్తితో సహా అనేకమంది పార్టీ నాయకులు జైల్లో ఉన్నారు. అవి ఎమర్జెన్సీ రోజులు. కొద్దిమందే బయట ఉన్నారు. తర్వాత ఆ క్లిష్ట పరిస్థితులలో ముక్కు సుబ్బారెడ్డి పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి విజయవంతంగా పార్టీ కార్యకలాపాలు కొనసాగించారు. 1980 వరకు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా పని చేశారు. 1977లో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు పార్టీ తీర్మానం చేసింది. 'ఆగస్టు తీర్మానం'గా ప్రసిద్ధి చెందిన తీర్మానం అది. అప్పుడు పార్టీలో ఒక్కసారిగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రవూఫ్ ఈ కారణంతోనే పార్టీ నుండి వెళ్ళిపోయారు. ముక్కు సుబ్బారెడ్డి రాష్ట్రమంతా తిరిగి క్యాడర్‌నంతా కన్విన్స్ చేయగలిగారు. 1978 మొదట్లో కావచ్చు. ర్యాడికల్ విద్యార్థి సంఘం మహాసభల సందర్భంగా వరంగల్‌కు వచ్చారు సుబ్బారెడ్డి. మేము నలుగురం. అంతా 18–19 సంవత్సరాల వయసు వాళ్ళం. చైనా గురించి ప్రశ్నల వర్షం కురిపించాము. 1976లో మావో చనిపోయిన తరువాత చైనా కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు మార్గంలో పోతున్నది. అందుకు 'మన పార్టీ దానిని రివిజనిస్టు పార్టీగా ప్రకటించాల'ని మా



ముక్కు సుబ్బారెడ్డి

వాదన. దానికి ఆయన 'చూడండి ఆ లక్షణాలు కనిపిస్తున్నాయి నిజమే కానీ పూర్తిగా తేలకముందే ప్రకటించడం తప్పవుతుంది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలో రివిజనిస్టు లక్షణాలు 1956లో 20వ మహాసభలలోనే బయటపడినాయి. అయినా మిగతా దేశాల కమ్యూనిస్టులు తమ పార్టీల్లో అంతర్గత పోరాటం చేశారే కానీ వెంటనే రివిజనిస్టుగా ప్రకటించలేదు. 1967లో సోవియట్ యూనియన్ చెకోస్లోవేకియా మీద దాడి చేసిన తరువాతనే దానిని రివిజనిస్టు పార్టీగా ప్రకటించడం జరిగింది. మనం అలాగే వ్యవహరించాల'ని ఎంతో ఓపికగా చెప్పారు.

మేము జూనియర్‌లుగా 'రంగన్న' (ముక్కు సుబ్బారెడ్డి) జీవితం గురించి కథలుగా వినేవాళ్ళం. ఆయనను ఆదర్శంగా చూసేవాళ్ళం. 1973–74లో రాజమండ్రి జైలులో ఉన్న కేజీ సత్యమూర్తి లాంటి నాయకులను జైలు నుండి విడుదల చేయడానికి కొండపల్లి సీతారామయ్య ప్లాన్ రచించారు. దాన్ని సుబ్బారెడ్డి అమలు చేయడానికి తీవ్రమైన కృషి చేశారు. చివరిలో అనుకోకుండా అరెస్టయి ఆయనే జైలుపాలయ్యారు. తీవ్ర చిత్రహింసలకు గురయ్యారు. ఆయన ఎన్నో ప్రమాదాలను కూడా ఎదుర్కొన్నారు. భూస్వాముల దాడులను ఎదుర్కోవడానికి బాంబులు తయారు చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తుగా అవి పేలిపోయి, ఆయన ఒళ్ళంతా కాలిపోయింది. జీవితమంతా ఆ కాలిపోయిన మచ్చలే ఉద్యమ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. వరంగల్‌లో వాళ్ళ కాలేజీ దగ్గరలో ఉన్న బట్టుపల్లి, వడ్డేపల్లి లాంటి గ్రామాలకు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తిలతో కలిసి సుబ్బారెడ్డి కూడా వెళ్తుండేవారు. ఈ క్రమంలో 1968లో ఒకసారి వడ్డేపల్లి వెళ్లి వస్తుండగా ఒక స్కూటర్ ఆయన్ని గుద్దేసింది. ఈ యాక్సిడెంట్‌లో సుబ్బారెడ్డి తలకు బలమైన గాయం తగిలి జ్ఞాపకశక్తి పోయింది. దానితో కొండపల్లి సీతారామయ్య సుబ్బారెడ్డిని ఇంటికి పంపించారు. కానీ త్వరలోనే కోలుకుని మళ్లీ వచ్చి సీతారామయ్యతో కలిసి పనిచేశారు. బహుశా ఈ యాక్సిడెంట్ ప్రభావం సుబ్బారెడ్డి వయసు పెరుగుతున్నకొలది ఆయన చురుకుదనాన్ని తగ్గించి ఉండవచ్చు. మానసిక స్థితిని కూడా దెబ్బతీసి ఉండవచ్చు అనిపిస్తుంది.

ముక్కు సుబ్బారెడ్డి 1989లో ఉద్యమంలో నుండి వెళ్లిపోవడానికి తీవ్రమైన సిద్ధాంత రాజకీయ విభేదాలు ఏమీ లేవు. కారణాలు ఏమైనా మొత్తానికి ఉద్యమం పట్ల ఆయనకు ఆసక్తి తగ్గింది. క్రమంగా ఇనాక్టివ్ అయ్యి వెళ్ళిపోయారు. ఉద్యమం నుండి బయటికి వచ్చిన తర్వాత కూడా సుబ్బారెడ్డి వ్యక్తిగత జీవితం ఒడుదొడుకులతోనే సాగింది. కొన్ని వ్యాపారాలు చేసినా నష్టపోయారంటారు. మతి స్థిమితం కోల్పోయిన జీవిత సహచరి ఎటో వెళ్ళిపోయింది.


తను కూడా అటువంటి పరిస్థితే ఎదుర్కొన్నారు. కొన్ని రోజులు మాత్రమే అమెరికాలో కొడుకు వద్ద ఉండి, అక్కడ ఇమడలేక తిరిగి వచ్చేశారు. చివరికి వృద్ధాశ్రమానికి చేరుకున్నారు. చివరి రోజుల్లోనూ ఉద్యమాన్నే పలవరిస్తూ వెళ్ళిపోయారు. సుబ్బారెడ్డికి జోహార్లు.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు

మనోరక్ష

'రక్షలు రక్షలు పాదరక్షలు... నాట్య శిక్షలో బాల శిక్షలు' అంటూ పాదరక్షల గొప్పతనాన్ని ప్రశంసించే పాత సినిమా పాట ఒకటున్నది. మాయా బజారుల్లో విహరించే వారు మాయా పాదరక్షలు తొడుక్కోగానే అవి 'తోధిమ్మి, తోధిమ్మి' అని నాట్యం చేయిస్తాయట. అడుగేయగానే, 'తైతక్క, తైతక్క ' అని గెంతులు వేయిస్తాయట.

మనం మామూలుగా వాడే పాదరక్షలకు అంతటి మహిమ ఉండకపోయినా, వాటి ఉపయోగం కూడా తక్కువేమీ కాదు. పాదరక్షలు లేక పోతే పాదాల శక్తి సగంలో సగమయినట్టే!



జ్యోతిర్మయం

అడవుల్లో, కొండల్లో, చేలల్లో, గుట్టల్లో పాదరక్షలు లేకుండా నడవడం ప్రమాదకరం. మన నగరాలలో మరింత ప్రమాదకరం.

భాగవత పురాణంలో పాదరక్షలను ప్రస్తావిస్తూ ఒక చక్కని నీతిని చెప్పే శ్లోకం కనిపిస్తుంది. సప్తమ స్కంధంలో నారదుడు యుధిష్ఠిరుడికి చేసే బోధలో భాగంగా వస్తుంది. 'సదా సంతుష్ట మనసః, / సర్వాః సుఖమయాః దిశః / శర్కరా కంటకాదిభ్యః / యథా ఉపానత్ పదః శివం' (భాగవతం 7- 15- 17). చెప్పులతో సురక్షితమైన పాదం రాళ్ళు రప్పలూ, ముళ్లూ వగైరా బెడదల వల్ల నష్టం లేకుండా ఎలాగయితే క్షేమంగా ఉంటుందో, అలాగే ఎప్పుడూ మనసులో సంతుష్టి కలిగి ఉన్నవాడికి, ఏ దిక్కుగా వెళ్ళినా అన్నీ సుఖమయమైన ప్రదేశాలుగానే ఉంటాయి. సంతుష్టిని మనోరక్షగా ఏర్పరచుకొన్న వాడికి తన చుట్టూ ఉన్న ప్రపంచంలో విషయాలు కామ, క్రోధ, లోభాది వికారాలను కలిగించలేవు. అలాంటివాడు ఎక్కడైనా ఆనందంగానే ఉంటాడు. పాదానికి చెప్పు రక్ష, మనసుకు సంతుష్టి రక్ష.

సంతృప్తి కలవాడి మనసును ఇంద్రియాలు వేధించలేవు. అతగాడు వట్టి నీళ్ళు తాగి కూడా తృప్తిగానే ఉంటాడు. తృప్తి లేనివాడు, 'ఔపస్థ్య, జైహ్వ్య కార్పణ్యాల వల్ల, గృహపాలం లాగా సంచరిస్తుంటాడు' (7–15–17). అంటే లైంగిక వాంఛలూ, తిండిరంధీ మొదలైన ఇంద్రియ చాపల్యాలవల్ల పశుప్రాయంగా ('గృహపాలం' అంటే కావలి కుక్క) తిరుగుతుంటాడు అన్నారు వేద వ్యాసుడు.

పై శ్లోకంలో 'పాదరక్ష' అన్న మాట ఎక్కడుంది? 'ఉపానత్' అంటే చెప్పు. యథా, ఉపానత్–పదః శివం (ఎలాగయితే చెప్పు ఉన్న పాదం భద్రంగా ఉంటుందో) అన్నారు కదా!

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.అష్టమి రా.10.40 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పుబ్బ రా.2.36 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.8.51 నుండి 10.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.30 నుండి 9.18 వరకు తదుపరి రా.10.34 నుండి 11.22 వరకు, **అమృతఘడియలు:** రా.7.27 నుండి 9.15 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.19, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

పెళ్లికి ఒప్పుకోలేదని...

ప్రేమజంట ఆత్మహత్య

బొంరాస్‌పేట(వికారాబాద్): ప్రేమవివాహానికి కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... లగచర్ల గ్రామానికి చెందిన మీనాక్షి(14) తొమ్మిదోతరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మిస్కిన్(21), మీనాక్షి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల సభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన మీనాక్షి, మిస్కిన్ ఆదివారం అర్ధరాత్రి గ్రామసమీపంలోని ఓ పొలంలో చెట్టుకు ఉరేసుకొని చనిపోయారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పరిగి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక...

- రైలు కింద పడి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



రామన్నపేట: హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక ఓ ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో ఈ ఘటన జరిగింది. బోగారం గ్రామానికి చెందిన చిల్లర నరసింహ చిన్న కుమారుడు వెంకటరమణ (17) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఉన్న శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే కళాశాల హాస్టల్‌లో ఉంటున్న వెంకటరమణ ఆరోగ్యం బాగోలేక వారం క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం తిరిగి వెళ్లమని కుటుంబ సభ్యులు చెప్పారు. అయితే కాలేజీకి వెళ్లడం ఇష్టంలేని వెంకటరమణ సాయంత్రం బయటకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయినా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రామన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం రామన్నపేట శివారులో రైలు పట్టాల పక్కన బైక్‌ను గమనించి వెళ్లి చూడగా పట్టాలపై వెంకటరమణ మృతదేహం ఉంది. కాలేజీకి వెళ్లి హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక రైలు కింద పడి వెంకటరమణ బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడి సోదరుడు మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరి, పత్తి ఖరీదుదారుల మోసాన్ని వ్యతిరేకించాలి

మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

కాటారం (జయశంకర్ భూపాలపల్లి): రాష్ట్రంలో వరి, పత్తి కొనుగోలు చేస్తున్న ఖరీదుదారుల మోసాన్ని రైతులు వ్యతిరేకించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విత్తన పంటలకు అనువైన భూములున్నాయని, తెలంగాణను విత్తనాల హబ్‌గా చేస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ సర్కారు మాట తప్పిందని విమర్శించారు. కేసీఆర్ బహుళజాతి కంపెనీలతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం చెప్పిన పంటలు మాత్రమే రైతులు వేస్తే సబ్సిడీ ఇవ్వలేదని ఆరోపించారు. సహకార బ్యాంకుల్లో రుణాలు ఇవ్వకుంటే రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 నుంచి రూ.5 వడ్డీకి తీసుకుని పంటలకు పెట్టుబడి పెట్టుకున్నారని వెంకటేశ్ తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. బహుళ జాతి కంపెనీల సీడ్ ఏజెంట్లు కంపెనీ చెప్పిన రేటు కంటే ఎక్కువ ధరకు ఇచ్చి రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారని వెంకటేశ్ మండిపడ్డారు. జమ్మికుంటకు చెందిన ఖరీదుదారులు మల్లారెడ్డి, బాబయ్య మిగతా ఖరీదుదారులు పత్తి క్వింటాకు రూ.20 హమాలీ ఖర్చులు రైతుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. జమ్మికుంట రైస్‌మిల్లు బడా యజమానులు రైతులను బెదిరించి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, వారు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కొత్త గనులు రాకపోతే కష్టమే

ఇరవై ఏళ్ల తర్వాత సింగరేణి పరిస్థితి ఏమిటి?



కొత్తగూడెంలో ఓపెన్‌కాస్ట్ (ఓసీ)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త బొగ్గు గనుల ప్రస్తావన లేకపోవడంతో మరో ఇరవై ఏళ్ల తర్వాత పరిస్థితి ఏమిటని సింగరేణి కార్మికులు ఆందోళన చెందుతున్నారు. విలియమ్ కింగ్ అనే శాస్త్రవేత్త 1870 సంవత్సరంలో బొగ్గు నిక్షేపాలు కనుగొన్నారు. ఆనాటి లెక్కల ప్రకారం సుమారు 11వేల మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు తేలింది. ఇందులో ఏ సమస్య ఎదురుకాకుండా తీసే బొగ్గు 3వేల మిలియన్ టన్నులు మాత్రమేనని తేల్చారు. ఇప్పటివరకు సింగరేణి సుమారు 1,600 మిలియన్ టన్నులు వెలికి తీయగలిగింది. ప్రస్తుతానికి సింగరేణి సంస్థ జియాలజికల్ విభాగ లెక్కల ప్రకారం మరో 1,400 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలే ఉన్నాయి. ఈ బొగ్గు తీసేందుకు ఇంకో ఇరవై ఏళ్ల సమయం పడుతుంది. ఎప్పటికప్పుడు కొత్త గనులు ప్రారంభిస్తూ వెళితే ఈ కాలపరిమితి పెరుగుతుంది. అయితే కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తున్నా, రకరకాల కారణాలతో ఈ వేలంలో సింగరేణి యాజమాన్యం పాల్గొనడం లేదు. దీంతో ఇరవై ఏళ్ల తర్వాత సింగరేణి పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు.

వేలంలో పాల్గొంటే మరో 300 మిలియన్ టన్నులు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ విధానంలో భాగంగా ఎవరైనా సరే వేలంలో పాల్గొంటేనే బొగ్గు గనులు దక్కుతాయి. అయితే సింగరేణి యాజమాన్యం రూ.25 లక్షలు వెచ్చించి టెండర్ ఫారాలు ఖరీదు చేసినా వేలంలో పాల్గొనలేదు. దీంతో కోయగూడెం ఓసీ–3, శ్రావణపల్లి ఓసీతో పాటు సత్తుపల్లి ఓసీలు దూరమయ్యాయి. ఒకవేళ ఇవి దక్కించుకుంటే సుమారు 300 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు సింగరేణికి అందుబాటులోకి ఉండేవి. ఈ మూడు గనుల్లో బొగ్గు నిల్వల గుర్తింపు, ఇతర పనులకు సింగరేణి యాజమాన్యం రూ.60 కోట్లు ఖర్చు చేసినా, వేలంలో మాత్రం పాల్గొనలేదు.

భూగర్భగనులతో నష్టం వస్తుందని..

భూగర్భ గనుల ఏర్పాటుతో బొగ్గు ఉత్పత్తికి ఎక్కువ ఖర్చవుతుందని చెబుతున్న యాజమాన్యం ఓసీల ఏర్పాటుకు మొగ్గుచూపుతోంది. ఓసీల ద్వారా అత్యధిక ఉత్పత్తి సాధ్యమవుతుందని, భూగర్భగనుల్లో అలా సాధ్యం కాకపోవడంతో అటువైపు దృష్టి సారించడం లేదని చెబుతున్నారు. కొత్తగూడెం ఏరియాలో 8, 9, 10, 11వ గనుల్లో మిగిలిన సుమారు 60 మిలియన్ టన్నుల బొగ్గును జీకే ఓసీ ద్వారా 1994 నుంచి 30 ఏళ్ల కాలంలో వెలికి తీయడం పూర్తిచేశారు. ఓసీల ద్వారా ఇంత వేగంగా బొగ్గు తీయడం సాధ్యమవుతున్నా, ఓసీల ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిసి కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పదేళ్లలో ఒక్క గనీ లేదు..

రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినా, కొత్తగా ఒక్క గనిని కూడా ప్రారంభించలేదు. గతంలో బొగ్గు తీసిన భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్(ఓసీ)లుగా మార్చా రే తప్ప కొత్త ఓసీలు, భూగర్భ గనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. రూ.60 కోట్లు వెచ్చించి సర్వే లు, డ్రిల్లింగ్‌లు వేయించడంతో అధికారులు, కార్మికులు శ్రమదోపిడీకి గురయ్యారే తప్ప ఫలితం రాలేదు. తెలంగాణ వస్తే ఓసీలు ఉండవు..భూగర్భగనులే ఉంటాయని తొలినాళ్లలో చెప్పినా, 2018లో వర్చువల్‌గా ప్రారంభించిన రాంపురం గనిలోనూ ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి మొదలుకాలేదు.

27న సింగరేణి ఎన్నికలు

మొత్తం ఓటర్లు 39,748మంది

- జాబితా విడుదల
- రిటర్నింగ్ అధికారితో నేతల సమావేశం
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం



రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌తో సమావేశమైన కార్మిక సంఘాల నేతలు

శ్రీరాంపూర్ (మంచిర్యాల), గోదావరిఖని, సింగరేణి (కొత్తగూడెం): హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్‌సీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. మొత్తం 13 కార్మిక సంఘాల నాయకులు, కంపెనీ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల పర్వం, స్క్రూటినీ పూర్తయిన విషయం తెలిసిందే. కోర్టుకు వెళ్లిన కారణంగా విడుదల చేయని ఓటరు జాబితాను కంపెనీ విడుదల చేసింది. జాబితా ప్రతుల ను రిటరి్నంగ్ అధికారి కార్మిక సంఘాలకు అందజేశారు.

8న తుదిజాబితా

ఈనెల 6లోగా అభ్యంతరాలు స్వీకరిస్తారు. 8న తుదిజాబితా ప్రచురించనున్నారు. బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్‌తోపాటు ఐదు జాతీయ కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ సహా 13 సంఘాలు బరిలో ఉంటున్నాయి. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం కోసం ఒకే ఓటు పద్ధతి అమలు చేస్తారు. ఎన్నికల నిర్వహణకు ఆరు జిల్లాల కలెక్టర్ల ద్వారా రెవెన్యూ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని కోరారు. గుర్తులను రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఇప్పటికే కేటాయించారు. ఈ ఎన్నికల్లో 39748 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. శాశ్వత ఉద్యోగులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన ఈనెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి 7గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్‌ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ కార్యదర్శి మంద నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాల వారీగా ఓటర్లు

బెల్లంపల్లి ఏరియాలో 985 మంది ఓటర్లు, మందమర్రిలో 4876, శ్రీరాంపూర్‌లో 9124, కార్పొరేట్‌లో 1192, కొత్తగూడెంలో 2370, మణుగూరులో 2414, ఎల్లందులో 603, నైనీబ్లాక్‌లో 2, భూపాలపల్లిలో 5350, ఆర్జీ 1లో 5430, ఆర్జీ 2లో 3479, అడ్రియాలాలో 944, ఆర్జీ 3లో 3063 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల ఒకటి నాటికి రిటైర్డ్ అయిన వారు పోనూ మొత్తం 39748మంది ఉన్నారు.

పరిహారం.. ప్యాకేజీ రాదేమోనని..

గుండెపోటుతో భూ నిర్వాసితుడు మృతి... సిద్దిపేట జిల్లాలో ఘటన



రాచకొండ సత్తయ్య(ఫైల్)

ములుగు(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి చెందటంతో తమకు రావాల్సిన పరిహారం, ప్యాకేజీ రాదేమోననే బెంగతో భూ నిర్వాసితుడు గుండెపోటుతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాలలో ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొండపోచమ్మసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన మామిడ్యాలకు చెందిన భూ నిర్వాసితుడు రాచకొండ సత్తయ్య (50) కుటుంబం ములుగులో తాత్కాలికంగా కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిలో నివాసం ఉంటోంది. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీకి సరిపడా సీట్లు రాకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్న విషయాన్ని తెలుసుకున్న సత్తయ్య తన మేనల్లుడు నవీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందని కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్యాకేజీలన్నింటినీ అందిస్తామని ఓ సమావేశంలో కేసీఆర్ ప్రకటించారని, తీరా ఇప్పుడు హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వమే లేనప్పుడు తమకు ప్యాకేజీ ఇచ్చేది ఎవరంటూ భావోద్వేగానికి లోనై ఛాతీలో నొప్పి వస్తుందంటూ సత్తయ్య స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సత్తయ్యకు ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుండెపోటుతో జనగామ జెడ్పీ చైర్మన్ మృతి

మాజీ సీఎం కేసీఆర్ సంతాపం



సంపత్‌రెడ్డి (ఫైల్)

జనగామ: జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి (59) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి.. హనుమకొండ జిల్లా కాజీపేట చైతన్యపురిలో నివాసముంటున్నారు. ఉదయం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, ఆ తర్వాత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. అనంతరం హనుమకొండకు వెళ్లి పోయారు. ఇంట్లో టీ తాగుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోగా కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక రోహిణి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ గంటన్నర పాటు వైద్యులు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. సంపత్‌రెడ్డికి భార్య సుజాత, కూతురు సంజనారెడ్డి ఉన్నారు. కుమారుడు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయన మరణవార్త తెలియడంతో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం తదితరులు ఆస్పత్రికి వెళ్లారు.

మాజీ సీఎం సంతాపం: సంపత్‌రెడ్డి హఠాన్మరణంపై బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

24 మందికి ఆస్పత్రిలో చికిత్స



అస్వస్థతకు గురైన విద్యార్థినులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఊరెళ్ల సమీపంలోని బీసీ గురుకుల విద్యాలయంలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనం చేసి పడుకున్న తరువాత అర్ధరాత్రి నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. అక్కడే ప్రథమ చికిత్స అందించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిగి నియోజకవర్గంలోని బొంరాస్‌పేటకు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల గ్రామ శివారులో ఉన్న సాగర్ కళాశాలలో కొన్నేళ్లుగా కొనసాగుతుంది. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి విద్యార్థినులు భోజనం చేశారు. అర్ధరాత్రి సమయంలో 16 మందికి కడుపునొప్పి, విరేచనాలు మొదలయ్యాయి. గురుకులంలో ఉండే వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం మరో ఎనిమిది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిని కూడా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. కాగా, బీసీ గురుకులాన్ని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఫుడ్ సెక్యూరిటీ అధికారి ఉదయ్‌కిరణ్ సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు ఫుడ్ పాయిజన్ కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఆహారం, నీటి నమూనాలను సేకరించారు. 16 మంది విద్యార్థినులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి గురుకులంలోని ఓ ప్రత్యేక గదిలో ఉంచారు. పాఠశాలలో ఓ వైద్యుడితోపాటు నలుగురు నర్సులను అందుబాటులో ఉంచి పర్యవేక్షిస్తున్నారు.

నామినేటెడ్ పదవులకు రాజీనామా

సమర్పించిన బీఆర్‌ఎస్ నేతలు



బోయినపల్లి వినోద్‌కుమార్



రమణాచారి



జూలూరి గౌరీశంకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో నియమితులైన బీఆర్‌ఎస్ నేతలు రాజీనామా బాట పట్టారు. తమ పదవులనుంచి వైదొలగుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులకు రాజీనామా లేఖలు పంపిస్తున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ పదవికి బోయినపల్లి వినోద్ కుమార్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పదవికి జ్వాల నరసింహారావు వనం సోమవారం రాజీనామా చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు పదవికి రిటైర్డు ఐఏఎస్ అధికారి రమణాచారి, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తమ పదవులకు రాజీనామా చేశారు. వీరితో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పలు ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లుగా నామినేటైన నేతలు కూడా వైదొలగుతున్నారు. డాక్టర్ ఆంజనేయగౌడ్ (స్పోర్ట్స్ అథారిటీ), సోమ భరత్‌కుమార్ (డెయిరీ డెవలప్‌మెంట్), జూలూరి గౌరీశంకర్ (తెలంగాణ సాహిత్య అకాడమీ), పల్లె రవికుమార్‌గౌడ్ (కల్లుగీత కార్పొరేషన్), మేడె రాజీవ్‌సాగర్ (టీఎస్ ఫుడ్స్), డాక్టర్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ (గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ), గూడూరు ప్రవీణ్ (టెక్స్‌టైల్), గజ్జెల నగేష్ (బేవరేజెస్), అనిల్ కూర్మాచలం (ఫిలిం డెవలప్‌మెంట్), రామచంద్ర నాయక్ (ట్రైకార్), వలియా నాయక్ (గిరిజన ఆర్థిక సహకార సంస్థ), వై.సతీష్‌రెడ్డి (రెడ్‌కో), డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ (రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ), సర్దార్ రవీందర్‌సింగ్ (పౌర సరఫరాలు), జగన్మోహన్‌రావు (టెక్నాలజికల్ సర్వీసెస్), మన్నె క్రిశాంక్ (మినరల్ డెవలప్‌మెంట్) రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

వైదొలిగిన ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ రాధాకిషన్‌రావు

మావోయిస్టు ఆపరేషన్స్‌లో కీలకమైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌ఐబీ) చీఫ్‌గా పనిచేస్తున్న ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు సోమవారం తన పోస్టుకు రాజీనామా చేశారు. అలాగే, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా పనిచేసిన రాధాకిషన్‌రావు సైతం తన పోస్టుకు రాజీనామా చేశారు.

ఏఏజీ రామచంద్రరావు రాజీనామా

రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తన పదవికి రాజీనామా చేశారు. శాసనసభ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన తన రాజీనామాను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. తొలిసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఆయన అదనపు ఏజీగా పనిచేశారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కూడా రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ కూడా..



తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు రాజీనామా చేస్తున్నట్టు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిన లేఖలో తెలిపారు. కొత్త సీఎండీలను నియమించే వరకు..జెన్‌కో సీఎండీగా ఆ సంస్థ డైరెక్టర్ ఎ.అజయ్‌కు, ట్రాన్స్‌కో సీఎండీగా సంస్థ జేఎండీ సి.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించాలని ఆయన సిఫారసు చేశారు. అయితే ప్రభాకర్ రావు రాజీనామాను ఇంకా ఇంధన శాఖ ఆమోదించలేదని తెలిసింది. కాగా, ఏపీ నుంచి వచ్చిన విద్యుత్ ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వాల్సి రావడంతో ఏడాది కింద రివర్షన్లు పొందిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ఎన్నికలైన వెంటనే పదోన్నతులు కల్పిస్తామని ప్రభాకర్‌రావు హామీనిచ్చారనీ, ఇప్పుడు ఆయన రాజీనామాతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని బాధిత ఉద్యోగులు ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అయినా తమకు న్యాయం చేయాలంటూ సోమవారం ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

లెక్క ఎక్కడ తప్పింది?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే, 2023లో 8 సీట్లలో గెలుపు, ఓటింగ్ శాతం 14కి పెంచుకోవడం ద్వారా మరీ తీసికట్టుగా కాకుండా గౌరవప్రదమైన ఫలితాలనే సాధించినా పెద్ద సంఖ్యలో సీట్లు గెలుచుకోలేక పోయేందుకు ప్రభావం చూపిన అంశాలేమిటా అన్న లోతైన చర్చ సాగుతోంది.

గతం కంటే మెరుగే కానీ.. ఎక్కడి నుంచి ఎక్కడికి పడ్డాం..

ఈ ఎన్నికల్లో 111 స్థానాల్లో పోటీచేసి 46 చోట్ల డిపాజిట్లు దక్కించుకోవడం (2018లో 118 సీట్లలో పోటీచేస్తే 104 చోట్ల డిపాజిట్లు గల్లంతు), పలు సీట్లలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడంతో పాటు గణనీయమైన సంఖ్యలో ఓట్లను సాధించడం వంటివి పార్టీకి కలిసొచ్చే అంశాలేనని అంచనా వేస్తున్నారు. గత రెండు, మూడేళ్లుగా కేసీఆర్ సర్కార్‌పై, అధికార బీఆర్‌ఎస్‌పై హోరాహోరీగా పోరాడినా.. వివిధ వర్గాల ప్రజల సమస్యలపై ఉద్యమించినా.. ఆ మేరకు గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలవకపోవడానికి కారణాలు ఏమిటనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. శాసనసభ ఎన్నికలపై దృష్టితో బీజేపీ సాగించిన కృషితో అధికార బీఆర్‌ఎస్‌కు బీజేపీనే తగిన ప్రత్యామ్నాయం అన్న స్థాయికి వెళ్లి అక్కడి నుంచి పరిస్థితి దిగజారడానికి దారితీసిన పరిణామాలను విశ్లేషిస్తున్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనన్న దుష్ప్రచార ప్రభావమే

బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనంటూ కాంగ్రెస్ క్రమం తప్పకుండా సాగించిన దుష్ప్రచారం ప్రభావం చూపిందని భావిస్తున్నారు. ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు రాష్ట్రనేతలు గట్టిగా తిప్పికొట్టలేకపోవడం, ఎన్నికల సమయంలో పార్టీని వీడిన కొందరు నేతలు అదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించడం వంటివి నష్టాన్ని కలగజేశాయని అంచనా వేస్తున్నారు. లోపాయికారిగా మిలాఖత్ కారణంగానే బీఆర్‌ఎస్ సర్కార్ అవినీతి, అక్రమాలపై కేంద్రప్రభుత్వం, వివిధ దర్యాప్తు సంస్థలు, ఏజెన్సీలు తగిన చర్యలు తీసుకోలేదనే పద్ధతుల్లో కాంగ్రెస్ సహా కొన్ని పక్షాలు చేసిన ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. దీంతో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ కాదంటూ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపేలా చేసిందనే చర్చ కూడా పార్టీలో వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరలో క్షేత్రస్థాయి సమీక్షలు ముగించుకుని వాస్తవ పరిస్థితుల ను అంచనా వేయాలని భావిస్తోంది. నిర్దేశిత గడువు ప్రకారమైతే మరో నాలుగు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మెజారిటీ ఎంపీ సీట్లు గెలవడం ద్వారా మళ్లీ బీజేపీ సత్తాను చాటాలనే భావన ముఖ్యనేతల్లో వ్యక్తమవుతోంది.

టీచర్ మందలించిందని.. టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: టీచర్ మందలించిందని పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.శంషీర్‌గంజ్‌కు చెందిన సురేందర్ గౌడ్, సరళ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి పెద్ద కుమారుడు (15) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం అతడి స్కూల్ బ్యాగ్‌లో సెల్‌ఫోన్‌ను గుర్తించిన టీచర్ అతడిని మందలించి ఇంటికి పంపింది. దీంతో మనస్తాపానికిలోనైన అతను ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అత్యధిక ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యం

- వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నాం
- బీఆర్‌ఎస్‌పై మా పోరాటం కాంగ్రెస్‌కు లాభం చేకూర్చింది
- మీడియాతో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా ముందుకెళతామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కలిసికట్టుగా ముందుకుసాగుతూ తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగేలా పోరాడుతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశ పరిచినా మరింత గట్టిగా పోరాడి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 80 సీట్లు సాధించేలా ఇప్పటి నుంచే పట్టుదలతో కృషి ప్రారంభిస్తామని చెప్పారు. ఎంతో కష్టపడినా అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదని, ఈ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించిందని, 7 నుంచి 14 శాతానికి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే 100 శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పారు. పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లుయాదవ్, ప్రేంసింగ్‌రాథోడ్, చింతా సాంబమూర్తి, ప్రకాశ్‌రెడ్డి తదితరులతో కలిసి కిషన్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. ఓడిన స్థానాలపై జాతీయస్థాయి నుంచి జిల్లా, మండల, బూత్ స్థాయి వరకు సమీక్ష జరిపి వచ్చే లోక్‌సభ ఎన్నికలకల్లా లోటుపాట్లను సరిదిద్దుకుంటామని చెప్పారు.

లోక్‌సభకు ఓటేస్తామన్నారు : అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బీజేపీ నేతలు వెళ్లినప్పుడు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు మద్దతు తెలిపే ఓటర్లు తాము అసెంబ్లీకి ఎవరికి ఓటేసినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి వేస్తామని చెప్పారన్నారు. తాము గెలిచింది 8 స్థానాలే అయినా, 80 మంది ఎమ్మెల్యేల బలాన్ని ప్రజలు ఇచ్చారని చెప్పారు. క్రియాశీల ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తామని, ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని తెలి పారు. అధికార బీఆర్‌ఎస్‌పై ఐదేళ్లుగా బీజేపీ సాగించిన పోరు వల్ల కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో లాభం పొందిందన్నా రు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై గట్టిగా పోరాడుతూ రాష్ట్రంలో ఆ పార్టీకి ప్రత్యామ్నాయంగా మారేందుకు కృషి చేస్తామన్నారు. బీజేపీపై పడి ఏడ్చి బురదచల్లిన వారు ఈ రోజు ఫామ్‌హౌస్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి) వ్యాఖ్యానించారు.

అక్కడ కాంగ్రెస్‌కు ఆ పరిస్థితి లేదు

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఉన్న పరిస్థితి ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో లేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని బీజేపీ చేజిక్కించుకుందని, మధ్యప్రదేశ్‌లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధించిందని చెప్పారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, సీఎం అభ్యర్థి అని చెబుతున్న రేవంత్‌రెడ్డిని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించి రికార్డు సృష్టించారన్నారు. ఇలాంటి రికార్డు దేశంలో మరే రాష్ట్రంలోనూ సాధ్యం కాలేదన్నారు. పార్టీ పోటీచేసిన స్థానాల్లో ఓటమికి దారి తీసిన కారణాలను విశ్లేషించుకుంటామని, ఢిల్లీ వెళ్లి జాతీయ నాయకత్వంతో సమావేశమై రాష్ట్రంలో ఎన్నికల సరళి, ప్రభావం చూపిన అంశాలు, తదితర విషయాలపై చర్చిస్తామని చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు, రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావడం, తెలంగాణ ఎన్నికల తీరుతెన్నులపై సవివరంగా తెలియజేస్తామన్నారు. తమ పార్టీ వారే తనను ఓడించారని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఒక విలేకరి ప్రస్తావించగా, ఆ వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

బీఆర్‌ఎస్, మజ్లిస్ కుట్రలను తిప్పికొట్టారు: కిషన్‌రెడ్డి

రాజాసింగ్ నివాసానికి వెళ్లి అభినందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు


సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీల అధినేతలు కేసీఆర్, అసదుద్దీన్ ఎన్ని కుట్రలు చేసినా ఎమ్మెల్యే రాజాసింగ్ బలమైన విశ్వాసం, ధైర్యంతో తిప్పికొట్టారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశంసించారు. ముఖ్యంగా మజ్లిస్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం కొనసాగిస్తూ, ప్రజల ఆశీస్సులతో రాజాసింగ్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారని అన్నారు. అధికార దుర్వినియోగం, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టినా గోషామహల్‌లో ధర్మం, జాతీయ భావజాలమే గెలిచిందని పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌లో రాజాసింగ్ నివాసానికి వెళ్లిన కిషన్‌రెడ్డి ఆయనను అభినందించారు. తప్పుడు ప్రచారాలతో అనేక శక్తులు పన్నిన కుట్రలను ఎదుర్కొని బీజేపీ ఎమ్మెల్యేగా రాజాసింగ్‌ను గెలిపించిన గోషామహల్ ప్రజలకు, ఆయన విజయం కోసం పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్నరోజుల్లో పార్టీ మరింత విస్తరణకు రాజాసింగ్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకుంటామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ విజయం కోసం కృషి చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

మిజోరంలో జెడ్‌పీఎం

27 స్థానాలు కైవసం చేసుకున్న జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్

- అధికార మిజో నేషనల్ ఫ్రంట్‌కు 10 సీట్లు
- బీజేపీకి రెండు.. కాంగ్రెస్‌కు ఒక స్థానం
- ముఖ్యమంత్రి జోరామ్‌తాంగ పరాజయం
- నూతన ముఖ్యమంత్రిగా జెడ్‌పీఎం అధినేత లాలుహోమా త్వరలో ప్రమాణ స్వీకారం

ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరం శాసనసభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) సంచలన విజయం సాధించింది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్)ను మట్టికరిపించింది. మొత్తం 40 అసెంబ్లీ స్థానాలకు గాను 27 స్థానాల్లో గెలిచింది. మెజారిటీ మార్కును సులువుగా దాటేసింది. మిజోరం ఎన్నికల్లో సోమవారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధికార ఎంఎన్‌ఎఫ్ కేవలం 10 స్థానాల్లో నెగ్గింది. బీజేపీకి రెండు స్థానాలు లభించాయి. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంలో గట్టెక్కింది. ఈ ఎన్నికల్లో అధికార ఎంఎన్‌ఎఫ్‌కు దారుణ పరాభవం ఎదురైంది. ఎంఎన్‌ఎఫ్ అధినేత, ముఖ్యమంత్రి జోరామ్‌తాంగ ఓటమిపాలయ్యారు. ఐజ్వాల్ ఈస్ట్–1 స్థానంలో ఆయనపై జెడ్‌పీఎం అభ్యర్థి లాల్‌థాన్‌సాంగ 2,101 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జెడ్‌పీఎం నేత, ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్దుహోమా.. సెర్చిప్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థి జె.వాంచ్‌వాంగ్‌పై 2,982 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో పోటీ చేసిన 11 మంది మంత్రుల్లో ఏకంగా 9 మంది పరాజయం పాలయ్యారు. ఉప ముఖ్యమంత్రి తాన్‌లూయా, ఆరోగ్య శాఖ మంత్రి ఆర్.లాల్‌థాంగ్‌లియానా, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి లాలౌత్‌కిమా, విద్యుత్ శాఖ మంత్రి ఆర్.లాల్‌జిర్లియానా, వ్యవసాయం, నీటిపారుదల శాఖ మంత్రి సి.లాల్‌రిన్‌సంగా, ఆహారం, పౌర సరఫరాల శాఖ మంత్రి కె.లాల్‌రిన్‌లియానా, ఎక్సైజ్ శాఖ మంత్రి లాల్‌రినామా తదితరులు ఓడిపోయారు. పాఠశాల విద్యా శాఖ మంత్రి లాల్‌చాందామా రాల్టే, పర్యాటక శాఖ సహాయ మంత్రి రాబర్ట్ రొమావియా రాయ్‌టే విజయం సాధించారు. మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జెడ్‌పీఎం అధ్యక్షుడు లాల్దుహోమా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నవంబర్ 7వ తేదీన జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎం, కాంగ్రెస్ పార్టీలు మొత్తం 40 స్థానాల్లో పోటీ చేశాయి. బీజేపీ 23 సీట్లలో తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. రాష్ట్రంలో తొలిసారిగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సైతం పోటీ చేసింది. నాలుగు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీపడ్డారు. అలాగే 17 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల్లో 'ఆప్' ఖాతా తెరవలేకపోయింది. స్వతంత్రులెవరూ నెగ్గలేదు.



ఇందిరాగాంధీ అంగరక్షకుడు కాబోయే ముఖ్యమంత్రి



పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైన మొట్టమొదటి ఎంపీగా అప్రతిష్ట మూటగట్టుకున్న 73 ఏళ్ల లాల్దుహోమా మిజోరం ముఖ్యమంత్రి కాబోతున్నారు. ఆయన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. అన్నింటినీ తట్టుకొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. లాల్దుహోమా ఐపీఎస్ అధికారిగా పనిచేశారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భద్రతా సిబ్బందికి ఇన్‌చార్జిగా సేవలందించారు. ఆయన నాయకత్వంలో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) 2019లో రాజకీయ పార్టీగా ఎన్నికల సంఘం వద్ద నమోదైంది. కేవలం నాలుగేళ్లలో మిజోరం ఎన్నికల్లో అతిపెద్దగా పార్టీగా అవతరించి, అధికారం చేపడుతుండడం విశేషం. లాల్దుహోమా తొలిసారిగా 1984లో కాంగ్రెస్ టికెట్‌పై మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. కేవలం 846 ఓట్ల తేడాతో పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అదే సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత మిజోరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1986లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి ముఖ్యమంత్రి లాల్ థాన్హాలాకు, కేబినెట్ మంత్రులకు వ్యతిరేకంగా కుట్ర పన్నినట్లు లాల్దుహోమాపై ఆరోపణలు వచ్చాయి. 1988లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడింది. అలాగే 2020లో ఎంఎన్‌ఎఫ్ ఎమ్మెల్యేగా ఉన్న లాల్దుహోమాపై మిజోరం అసెంబ్లీ స్పీకర్ లాల్‌రిన్‌లియానా సాయ్‌లో అనర్హత వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్నారంటూ లాల్దుహోమాపై ఎంన్‌ఎఫ్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. మిజోరంలో ఈ చట్టం కింద అనర్హతకు గురైన మొదటి ఎమ్మెల్యే లాల్దుహోమా కావడం గమనార్హం. జెడ్ఎన్‌పీ అభ్యర్థిగా 2003లో, 2008లో, 2018లో, 2021లోఎమ్మెల్యేగా ఆయన విజయం దక్కించుకున్నారు.

రాజకీయ యోధుడిని ఓడించిన మూకదాడి బాధితుడు



రాయ్‌పూర్: మత ఘర్షణల్లో కుమారుడిని కోల్పోయి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ తండ్రి చూపిన ధర్మాగ్రహం.. అక్కడి స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేను ఎన్నికల్లో మట్టికరిపించింది. ఆదివారం వెల్లడైన ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలు ఈ ఘటనకు సాక్ష్యంగా నిలిచాయి. అసలేం జరిగిందనేది ఓ సారి గమనిస్తే.. బేమేతరా జిల్లా బిరాన్‌పూర్ గ్రామంలో ఈశ్వర్ సాహూ అనే కార్మికుడికి 23 ఏళ్ల భువనేశ్వర్ సాహూ అనే కుమారుడు ఉన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ గ్రామంలో జరిగిన మత ఘర్షణల్లో వేరే మతానికి చెందిన అల్లరిమూక భువనేశ్వర్ సాహూను హతమార్చింది. కొడుకును కోల్పోయిన తనకు న్యాయం చేయాలంటూ తమ సాజా నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రవీంద్ర చౌబేను తండ్రి వేడుకున్నాడు. భూపేశ్ బఘేల్ సర్కార్ తనకు ఎలాంటి న్యాయం చేయలేదంటూ ఈశ్వర్ సాహూ కన్నీరుమున్నీరవడం, ఆయన ఆక్రందన నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హత్య ఘటన తర్వాత హతుడి తల్లినీ అల్లరిమూక బెదిరించింది. హత్యకు నిరసనగా నాడు విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. పట్టించుకోని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే సంకల్పంతో ఇతనికి బీజేపీ టికెట్ ఇచ్చింది. ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాజా నియోజకవర్గంలో రాజకీయ యోధుడిగా పేరొందిన రవీంద్ర చౌబేకు పోటీగా బరిలో నిలిపింది. ఈశ్వర్ సాహూకు జరిగిన అన్యాయంపై ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహావేశాలు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపించాయి. రవీంద్ర చౌబే కంటే ఎక్కువ ఓట్లు సాధించి ఈశ్వర్ ఘన విజయం సాధించారు. ' ఈశ్వర్ సాహూ ఒకప్పుడు కార్మికుడు. కానీ ఇప్పుడు ఎమ్మెల్యే. హంతకులకు మద్దతు పలికిన కాంగ్రెస్‌కు ఈశ్వర్ తగిన గుణపాఠం చెప్పారు' అని బీజేపీ ఐటీ విభాగ జాతీయ సమన్వయ కర్త అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు.

మూడు రాష్ట్రాల్లో సీఎంల ఎంపికపై బీజేపీ కసరత్తు!

న్యూఢిల్లీ: రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ మూడు రాష్ట్రాల్లో నూతన ముఖ్యమంత్రుల ఎంపికపై దృష్టి పెట్టింది. పార్టీ సీనియర్ నేతలు సోమవారం సమాలోచనల్లో మునిగిపోయారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రుల ఎంపికపై అభిప్రాయాలు పంచుకున్నారు. మూడు రాష్ట్రాల్లో పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత బీజేపీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం అతిత్వరలో మూడు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించాలని బీజేపీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. కొత్త సీఎంలు ద ఇప్పటివరకైతే అధికారికంగా ఎవరూ నోరు విప్పలేదు. బీజేపీ అధిష్టానం గుంభనంగా వ్యవహరిస్తోంది. మూడు రాష్ట్రాల్లోనూ ఆశావహులు చాలామందే ఉన్నారు. సీఎం పదవే లక్ష్యంగా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో మరోసారి ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలని శివరాజ్ సింగ్ చౌహాన్ భావిస్తున్నారు. ఇక్కడ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్రసింగ్ తోమర్‌తోపాటు సీనియర్ నేత విజయ్‌వర్గియా కూడా రేసులో ఉన్నారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో సీనియర్లను పక్కనపెట్టి అనూహ్యంగా కొత్త ముఖాలను తెరపైకి తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాజస్తాన్‌లో మాజీ సీఎం వసుంధర రాజే, ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ తమ ప్రయత్నాలు ఆపడం లేదు. రాజస్తాన్‌లో మహంత్ బాలక్‌నాథ్ యోగి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో అరుణ్ కుమార్ సావో, ధర్మలాల్ కౌశిక్, మాజీ ఏఐఎస్ అధికారి ఓ.పి.చౌదరి సీఎం పోస్టు కోసం పోటీపడుతున్నారు. వీరంతా ఓబీసీ వర్గానికి చెందిన నాయకులే.

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య చికిత్స విధానాన్ని అందుబాటులోకి తేవాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ యోచిస్తోంది. ఈ విధానం వచ్చే మూడు, నాలుగు నెలల్లో దేశవ్యాప్తంగా అమలు కానుంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ సోమవారం ఓ కార్యక్రమంలో ఈ విషయం తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని చెప్పారు. మోటారు వాహన చట్టం–2019 ప్రకారం రోడ్డు ప్రమాద బాధితులకు సమీపంలోని ట్రామా కేర్ సెంటర్‌లో ఉచిత, నగదు రహిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు కూడా ఆదేశించిందని ఆయన వివరించారు.

అమెరికాలో కాల్పులు.. అయిదుగురు మృతి

ఆర్బర్న్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం ఆర్బర్న్‌లోని ఓ ఇంట్లో చోటుచేసుకున్న కాల్పుల్లో అనుమానిత షూటర్ సహా అయిదుగురు చనిపోయారు. ఆదివారం మధ్యాహ్నం మృతుల కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు ఓ అపరిచితుడి నుంచి మెసేజీ అందింది. అతడి కుటుంబసభ్యులకు హాని తలపెట్టినట్లు దాని సారాంశం. దీంతో, ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కాల్పులు జరిగిన ఇంట్లో సాయుధులెవరైనా ఉండి ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు డ్రోన్‌ను పంపించి పరిశీలించగా అయిదు మృతదేహాలు కనిపించాయి. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఓ వ్యక్తి ఇంట్లోని నలుగురిని కాల్చి చంపి, అనంతరం కాల్చుకుని చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

గాజాపై దాడుల తీవ్రత పెంచిన ఇజ్రాయెల్


గాజా స్ట్రిప్: హమాస్‌తో కాల్పుల విరమణ గడువు ముగిసిన అనంతరం శుక్రవారం నుంచి దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. హమాస్ నాయకులు, కీలక టన్నెళ్లు, కమాండ్ సెంటర్లు, ఆయుధ డిపోలు తదితర 200 నిర్దేశిత లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఖాన్‌యూనిస్‌లోని మరో డజను వరకు ప్రాంతాల ప్రజలను వేరే ప్రాంతాలకు వెళ్లిపోవాలంటూ సోమవారం ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఖాన్ యూనిస్– డెయిర్ అల్ బలాహ్ హైవేపైకి రావొద్దని ప్రజలను కోరింది. అది యుద్ధక్షేత్రం మాదిరిగా, అత్యంత ప్రమాదకరంగా ఉందని పేర్కొంది.

ఇందుగలదందులేదని...

- మధ్యప్రదేశ్‌లో బీజేపీ హవా
- అన్ని ప్రాంతాల్లోనూ ఆధిపత్యమే
- ఒక్కచోట కూడా సత్తా చాటని కాంగ్రెస్

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకున్న బీజేపీ, ఆ క్రమంలో రాష్ట్రంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించింది. మొత్తం ఏడు ప్రాంతాలకు గాను ఒక్క గ్వాలియర్–చంబల్‌లోనే కాంగ్రెస్ కాస్తో కూస్తో పోటీ ఇవ్వగలిగింది. ఆ ప్రాంతాన్ని రెండు పార్టీలు చెరో సగం అన్నట్టుగా పంచుకున్నాయి. మిగతా ప్రాంతాలంతటా కమల సునామీయే అన్నట్టుగా సాగింది. మూడింట రెండొంతుల మెజారిటీతో విజయఢంకా మోగించింది. దాంతో అధికారంపై కాంగ్రెస్ పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలే అయ్యాయి.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతాలవారీ ఫలితాలు



8 శాతం పెరిగిన బీజేపీ ఓట్లు

2018ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి పోలైన ఓట్లలో ఏకంగా 8 శాతం పెరుగుదల నమోదైంది! అప్పుడు పార్టీ 41.02 శాతం ఓట్లు సాధించగా ఈసారి దాన్ని 48.55కు పెంచుకుంది. దాంతో మూడింట రెండొంతుల విజయం సాధ్యపడింది. కాంగ్రెస్ ఓటు బ్యాంకులో పెద్దగా మార్పు లేదు. దానికి 2018లో 40.89 శాతం రాగా ఈసారి 40.4 శాతం పోలయ్యాయి. 2018లో కాంగ్రెస్‌కు బీజేపీ కంటే 0.8 శాతం ఓట్లు తక్కువే వచ్చాయి.అయినా బీజేపీకి 109 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 114 దక్కాయి!

మాల్వా-నిమార్

ఈ ప్రాంతం 16 జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. మొత్తం 73 స్థానాలు అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 57 సీట్లు నెగ్గిన బీజేపీ 2018కి వచ్చేసరికి కేవలం 32 స్థానాలకు పరిమితమైంది. ఈసారి మాత్రం బాగా పుంజుకుని 20 సీట్లను పెంచుకుంది. ఏకంగా 52 స్థానాలను ఒడిసిపట్టింది. ఇక కాంగ్రెస్‌కు 2018లో ఈ ప్రాంతంలో 38 సీట్లొచ్చాయి. ఈసారి మాత్రం కమలం జోరు దెబ్బకు కాంగ్రెస్ 20 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ప్రాంతం నుంచి నెగ్గిన బీజేపీ ప్రముఖుల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయవర్గీయ తదితరులున్నారు.

గ్వాలియర్-చంబల్

34 అసెంబ్లీ స్థానాలున్న ఈ ప్రాంతంలో మాత్రం బీజేపీ జోరుకు కాంగ్రెస్ కాస్త కళ్లెం వేయగలిగింది. బీజేపీ 19 సీట్లు నెగ్గగా కాంగ్రెస్ కూడా 15 స్థానాలను కైవసం చేసుకుంది. 2018లోనైతే ఆ పార్టీ ఇక్కడ ఏకంగా 26 సీట్లు సాధించింది. ఆ ఎన్నికల్లో మొత్తమ్మీద 114 స్థానాలు సాధించి అధికారంలోకి రావడానికి మాల్వా–నిమార్‌తో పాటు ఈ ప్రాంతంలో అద్భుత ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది. ఈ ప్రాంతం కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన రాజ వంశీకుడు జ్యోతిరాదిత్య సింధియా కంచుకోట. ఈసారి బీజేపీ బాగా పుంజుకుని మెజారిటీ సీట్లు సొంతం చేసుకోవడానికి, కాంగ్రెస్ చతికిలపడటానికి ప్రధానంగా సింధియా కరిష్మాయే కారణమైంది. ఇక్కడి నుంచి పోటీ పడ్డ ప్రముఖుల్లో కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ విజయం సాధించగా రాష్ట్ర హోం మంత్రి నరోత్తం మిశ్రా మాత్రం ఓటమి చవిచూడటం విశేషం!

బుందేల్‌ఖండ్

26 సీట్లున్న ఈ ప్రాంతంలో బీజేపీ ఏకంగా 20 స్థానాలు కొల్లగట్టింది. గతంతో పోలిస్తే దానికి 6 సీట్లు పెరిగాయి. 2018లో 10 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి ఆరింటితో సరిపెట్టుకుంది.

భోపాల్

రాష్ట్ర రాజధానితో కూడిన ఈ ప్రాంతంలో 20 స్థానాలున్నాయి. పరిసర ప్రాంతాలనూ కలుపుకుంటే 36 సీట్లుంటాయి. ఇక్కడ బీజేపీ ఈసారి 31 సీట్లు ఒడిసిపట్టింది. 2018లో ఇక్కడ 12 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి ఐదింటితో సరిపెట్టుకుంది. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నియోజకవర్గం బుధ్నీ ఈ ప్రాంతం కిందికే వస్తుంది. అక్కడినుంచి ఈసారి ఆయన ఏకంగా లక్షా నాలుగు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించారు.

మహాకోశల్

47 స్థానాలున్న మహాకోశల్‌లో బీజేపీ ఈసారి 31 స్థానాలను ఒడిసిపట్టింది. 2018తో పోలిస్తే అదనంగా 14 సీట్లు నెగ్గింది. అప్పుడు 28 స్థానాలు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి 12 సీట్లు పోగొట్టుకుని 16కు పరిమితమైంది. ఇక్కడి నుంచి నెగ్గిన ప్రముఖుల్లో పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఉన్నారు. తన కంచుకోట ఛింద్వారా నుంచి ఆయన మంచి మెజారిటీతో గెలుపొందారు. కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే మాత్రం ఇక్కడి నివాస్ స్థానం నుంచి ఓటమి చవిచూడటం విశేషం. మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ మాత్రం నర్సింగాపూర్ నుంచి విజయం సాధించారు.

వింధ్య

30 అసెంబ్లీ సీట్లున్న ఈ ప్రాంతంలో 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అచ్చు గుద్దినట్టు పునరావృతమయ్యాయి. బీజేపీ 24 స్థానాలు కైవసం చేసుకోగా కాంగ్రెస్‌కు కేవలం 6 సీట్లు దక్కాయి. ఇక్కడి సత్నా స్థానం నుంచి బీజేపీ ఎంపీ గణేశ్‌సింగ్ ఓటమి చవిచూశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

శీతాకాలంలో రాజకీయ వేడి

ఎన్నికల నైరాశ్యం సభలో వెళ్లగక్కొద్దు: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల సంక్షేమానికి, దేశ ఉజ్వల భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న వారికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పట్ల అంకితభావం, సుపరిపాలన అందిస్తున్నప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత (యాంటీ ఇంకంబెన్సీ) అన్న పదానికి సంబంధం లేదన్నారు. ఎన్నికల వైఫల్యాల నుంచి ప్రతిపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలే తప్ప ఓటమి నైరాశ్యాన్ని సభలో వెళ్లగక్కరాదని సూచించారు. ప్రతికూల భావాలను విడిచిపెట్టి ముందుకు సాగాలని, అది వారి పట్ల ప్రజల దృక్పథాన్ని మార్చవచ్చునని తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు మోదీ మీడియాతో మాట్లాడారు. ''శీతాకాలం సమీపిస్తుంటే రాజకీయ ఉష్ణోగ్రతలు మాత్రం వేగంగా పెరుగుతున్నాయి. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా, ఉత్సాహకరంగా ఉన్నాయి'అని అన్నారు. ''ఫలితాలను చూసి విపక్షాలు ఆందోళన చెందొద్దు. సభలో సహకరించాలని కోరుతున్నా. ద్వేషం, ప్రతికూలతను పక్కనపెట్టి దేశానికి సానుకూల సందేశాన్నివ్వాలి. నిర్మాణాత్మకంగా పనిచేసేందుకు ఈ సమావేశాలు వాటికి సువర్ణావకాశం''అన్నారు.

సమావేశాల తొలి రోజే డిమాండ్లు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలైన తొలిరోజే విపక్ష సభ్యుల డిమాండ్లు మొదలయ్యాయి. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరీపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ సభ్యుడు దానిష్ అలీ సోమవారం లోక్‌సభలో డిమాండ్‌చేశారు. సెషన్ మొదలవగానే ఇటీవల మృతిచెందిన సభ్యులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నివాళులర్పించారు. వెంటనే దానిష్ అలీ మెడలో ' బిధూరీని శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న ప్లకార్డు మెడలో వేసుకుని సభలో నినాదాలిచ్చారు. దీనిని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తప్పుబట్టారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించకూడదంటూ అలీ చర్యను తప్పుబట్టిన స్పీకర్ వెంటనే సభను మధ్యాహ్నానికి వాయిదావేశారు.

న్యాయ వృత్తిలో 'దళారి' వ్యవస్థకు చెక్

న్యాయవాదుల వద్దకు కేసులను తీసుకొచ్చి నగదు ప్రయోజనాలు పొందే దళారి(టౌట్) వ్యవస్థపై ఉక్కుపాదం మోపేందుకు ఉద్దేశించిన అడ్వకేట్స్(సవరణ)బిల్లు, 2023కు సోమవారం పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. దళారులకు ఈ చట్టం కింద ప్రతిపాదించిన శిక్షలు అత్యల్పంగా ఉన్నాయని, వాటిని కఠినతరం చేయాలని కొందరు సభ్యులు డిమాండ్ చేశారు.

వర్డ్ ఆఫ్ ది ఇయర్.. రిజ్



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా పాపులర్ అయిన 'రిజ్(ఆర్ఐజెడ్‌జెడ్) పదాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్(ఓయూపీ) 2023 ఏడాదికి 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా సోమవారం ప్రకటించింది. రిజ్ అనే పదానికి అనేక అర్థాలున్నాయి. స్టైల్, ఆకట్టుకునే గుణం, సరసం కోసం భాగస్వామిని ఆకట్టుకునే ఒడుపు, ఛాటింగ్ .. ఇలా అనేక అర్థాల్లో రిజ్ పదాన్ని వాడుతున్నారు. వాస్తవానికి ఛరిష్మా అనే పదం పొట్టిరూపమే రిజ్'' అని ఓయూపీ అభివర్ణించింది. ఛరిష్మా పదం ఉచ్చారణ 'ఛ,రిజ్,మా'లోని మధ్య పదం రిజ్‌ను తీసుకుని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని వారి మాటల్లో, రాతల్లో, భావాల్లో విరివిరిగా వాడుతున్నారు'' అని ఓయూపీ తెలిపింది. సిట్యుయేషన్‌షిప్, స్విఫ్టీ, బీగీ ఫ్లాగ్, డీ–ఇన్‌ఫ్లూయెన్సింగ్, పారాసోషియల్, హీట్‌డోమ్, ప్రాంప్ట్ అనే పదాలు.. 'ఈ ఏడాది పదం' కిరీటం కోసం పోటీపడ్డాయి. దాదాపు 1900 కోట్ల పదాల డేటాలో అత్యధికంగా ఈ ఏడాది వాడిన పదాలను షార్ట్‌లిస్ట్ చేసి చివరకు ఎనిమిది పదాలను ఓయూపీ నిపుణులు విశ్లేషించి ఈ పదానికి పట్టంకట్టారు.

వందల కోట్ల వ్యూస్

''రి'ఫ్రిజ్'రేటర్ నుంచి ఫ్రిజ్ పదాన్ని, ఇన్'ఫ్లూ'యెంజా పదం నుంచి ఫ్లూ పదాన్ని సృష్టించినట్లే రిజ్‌ను నూతన జెడ్ తరం సృష్టించి తరచూ వాడుతోంది. నవతరం తమ భావ వ్యక్తీకరణ కోసం భాషను, పదాలను తమకు అనుగుణంగా మార్చేస్తున్నారు. ముఖ్యంగా గేమింగ్, ఇంటర్నెట్ సంస్కృతిలో మునిగితేలే టీనేజర్లు ఇలా కొత్త కొత్త పదాలను కనిపెడుతున్నారు. తొలిసారిగా టిక్‌టాక్‌లో ఈ రిజ్ పదంతో హ్యాష్‌ట్యాగ్ మొదలైంది. వందల కోట్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రిజ్‌ను ఈ తరం వారు కర్తగా, క్రియగా ఎలాగంటే అలా తమకు నచ్చినట్లు వాడుకుంటున్నారు'' అని ఆక్స్‌ఫర్డ్ లాంగ్వేజెస్ విభాగ అధ్యక్షుడు కాస్పర్ గ్రాథ్‌ఓల్ వ్యాఖ్యానించారు.

సాయుధ బలగాల్లోకి మహిళలు రావాలి



మల్వాన్(మహారాష్ట్ర): సాయుధ బలగాల్లో మహిళల సంఖ్యను పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. భారత నేవీలోని అధికార హోదాలకు దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా పేర్లు మారుస్తామని అన్నారు. అదేవిధంగా, నావికాదళ అధికారులు అలంకరించుకునే ఆప్లెట్లు ఇకపై ఛత్రపతి శివాజీ ప్రతిబింబం కలిగి ఉంటాయని చెప్పారు. మహారాష్ట్రలోని కోస్తా ప్రాంతంలో ఉన్న సింధుదుర్గ్ జిల్లా మల్వాన్‌లో సోమవారం నేవీ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నివాళులర్పించారు. నావికా శక్తి ప్రాధాన్యతను 17వ శతాబ్దంలోనే గుర్తించిన శివాజీ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆధునిక నావికాదళాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా బానిసత్వ భావనను విడనాడి, నేడు దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకెళుతోందని చెప్పారు. ప్రపంచం నేడు భారత్‌ను విశ్వ మిత్రుడిగా భావిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా తర్కలి బీచ్‌లో నేవీ షిప్పులు, సబ్‌మెరీన్లు, ఎయిర్‌క్రాఫ్ట్, ప్రత్యేక బలగాల 'కార్యాచరణ సన్నద్ధత'ను తిలకించారు. అంతకుముందు ఆయన సింధుదుర్గ్ జిల్లాలోనే ఉన్న రాజ్‌కోట్ కోటలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఎక్కువ మందిని కనండి: కిమ్



సియోల్: దేశాన్ని బలోపేతం చేయాలంటే జననాలను పెంచటం మహిళల విధి అని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ చెప్పారు. ఆదివారం జరిగిన నేషనల్ మదర్స్ సమావేశంలో కిమ్ ప్రసంగిస్తూ ఎక్కువ మంది పిల్లలను కనాలని మహిళలకు పిలుపునిచ్చారు. జననాల రేటు క్షీణతను అడ్డుకోవడం, చిన్నారుల సంరక్షణ, విద్య అనేవి తల్లుల వల్లే సాధ్యమవుతాయని చెప్పారు. దేశ జనాభా గణాంకాలను ఉత్తరకొరియా ప్రభుత్వం బహిర్గతం చేయడం లేదు. అయితే, అక్కడ గత పదేళ్లుగా జననాల రేటు తగ్గుతూ వస్తోందని పొరుగు దేశం దక్షిణ కొరియా అంటోంది. పిల్లల పెంపకం, చదువు చెప్పించడం వంటివి చాలా ఖరీదైన వ్యవహారంగా మారడంతో ఉత్తర కొరియాలోని చాలా కుటుంబాలు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు సిద్ధంగా లేరని పరిశీలకులు అంటున్నారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కార్మికుల సమీకరణపై ఆధారపడే ఆ దేశానికి ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

ఎంపీ చద్దాపై సస్పెన్షన్ ఎత్తివేత



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎంపీ రాఘవ్ చద్దా మీడియాకు తప్పుదోవ పట్టించే సమాచారం అందించారని రాజ్యసభ ప్రివిలేజెస్ కమిటీ ధ్రువీకరించింది. ప్రతిపాదిత ఎంపిక ప్యానెల్‌లో అనుమతి లేకుండా కొందరి సభ్యుల పేర్లను చేర్చడంపైనా ఆయన్ను దోషిగా తేల్చింది. రాఘవ్ చద్దాపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన ప్రివిలేజెస్ కమిటీ నివేదికను సోమవారం కమిటీ సభ్యుడు ఎలమారం కరీం రాజ్యసభ ముందుంచారు. అనంతరం చద్దాపై సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనను బీజేపీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సభలో ప్రవేశపెట్టారు. రాఘవ్ చద్దాపై మోపిన అభియోగాలకు ఇప్పటివరకు ఆయనపై కొనసాగిన సస్పెన్షన్ శిక్ష సరిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్మానం మూజువాణి ఓటుతో సభ ఆమోదం పొందింది. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ..గౌరవ సభ్యుడు రాఘవ్ చద్దా సభా ఇక కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని చెప్పారు. పై రెండు అభియోగాలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఎగువ సభ ఆగస్టు 11వ తేదీ నుంచి చద్దాపై సస్పెన్షన్ విధించింది.

ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం



పడాంగ్: ఇండోనేసియాలో మరపీ అగ్నిపర్వతం బద్దలైన ఘటనలో 11 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. 12 మంది జాడ తెలియాల్సి ఉంది. ఆదివారం ఈ ఘటన జరిగింది. 'క్రియాశీలకంగా ఉన్న మౌంట్ మరపీ బిలం వైపుగా మూడు కిలోమీటర్ల సమీపంలోకి వెళ్లకూడదని పర్వతారోహకులు, గ్రామస్తులను గతంలోనే హెచ్చరించాం. అయినా సరే వినకుండా శనివారం దాదాపు 75 మంది పర్వతారోహకులు అటువైపుగా 'హద్దులు' దాటి పర్వతారోహణ మొదలెట్టారు. ఆచూకీ గల్లంతైన వారి జాడ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాం'' అని వోల్కనాలజీ, జియోలాజికల్ కేంద్రం అధిపతి హెంద్రా గునవాన్ చెప్పారు. 2,900 మీటర్ల ఎత్తయిన మరపీ అగ్నిపర్వతం 2011 ఏడాది నుంచి క్రియాశీలకంగా ఉంది. నాలుగు తీవ్రస్థాయి హెచ్చరికల్లో మూడో లెవల్ ప్రమాద హెచ్చరికను అధికారులు గతంలోనే ప్రకటించారు. ఆదివారం అగ్నిపర్వతం బద్దలై భారీ స్థాయిలో లావా బయటికొచ్చి ధూళి 3,000 మీటర్ల ఎత్తుకు ఆకాశంలోకి ఎగసిపడింది. అదే సమయంలో పర్వతారోహకులు అటుగా వెళ్లడంతో ప్రమాదం బారిన పడ్డారు. వెంటనే హుటాహుటిన సహాయక బృందాలు గాలింపు చేపట్టి సోమవారం 11 మృతదేహాల జాడ కనిపెట్టాయి. మరో 12 మంది జాడ తెలియాల్సి ఉంది.

సాక్షి
కరీంనగర్

మంగళవారం | 5 | డిసెంబర్ | 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: కార్తీక సోమవారం సందర్భంగా రాజన్నను 30 వేల మంది దర్శించుకున్నారు. రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కె.వీ.తెలంగాణచౌక్ ఫీడర్ పరిధిలోని సప్తగిరికాలనీ కొంతభాగం, కాశ్మీర్‌గడ్డ, భగత్‌నగర్, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ముకరంపుర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడిఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గెలుపుపై న్యాయవాదుల సంబరాలు



జిల్లాకోర్టులో సంబరాలు జరుపుకుంటున్న న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: కాంగ్రెస్ పార్టీ గెలుపుపై సోమవారం జిల్లా కోర్టులోని న్యాయవాదుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించడం సంతోషకరమని అన్నారు. పార్టీ గెలుపు కోసం సహకరించిన కాంగ్రెస్ కార్యకర్తలకు, మేధావులకు, ఉద్యోగులకు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు కల్లేపల్లి లక్ష్మయ్య, వేల్పుల బాలకిషన్, ఉప్పుల అంజనీ ప్రసాద్, లుక్క రాజేషం, రూపిరెడ్డి దేవేందర్ రెడ్డి, కొత్తకొండ శంకర్, రాచకొండ ప్రభాకర్, పెంచాల లక్ష్మణరావు, ఆర్.కుమార్, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామడుగు(చొప్పదండి): మండలంలోని దేశరాజ్‌పల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మ, పీఈటీ వెంకటరమణ తెలిపారు. బాలికల విభాగంలో ఎ.స్వాతి, ఎం.అర్పిత, శివాణి, కావ్య, సంధ్య, బాలుర విభాగంలో వేణుకుమార్, శ్రీకాంత్, అభినయ్‌లు కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను సోమవారం హెచ్‌ఎంతోపాటు సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ సభ్యుడు మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కుమార్ అభినందించారు.

పవర్ బీఐపై వర్క్‌షాప్



విశాల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పవర్ బీఐపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐటీ సొల్యూషన్స్ అధినేత విశాల్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో పవర్ బీఐ టెక్నాలజీ నేర్చుకోవడంతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పవర్ బీఐ ఉపయోగించి డేటాను అనాలసిస్ చేసి రిపోర్టు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం విశాల్‌కుమార్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్లు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ లలితాఅశ్విని, లెక్చరర్లు ఇందిర, శారద, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో పాత వాహనాల వేలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా జైలులో పాత మారుతీ ఓమ్నీ వ్యాన్, హీరోహోండా సీడీ-100 వాహనాలను ఈనెల 8వ తేదీన వేలం వేయనున్నట్లు జైలు సూపరింటిండెంట్ జి.సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

నామినేటెడ్ పోస్టులకు రాజీనామా

కరీంనగర్: కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్(సుడా) పదవికి జీవీ.రామకృష్ణారావు, రాష్ట్ర సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి సర్దార్ రవీందర్‌సింగ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి అనిల్ కుర్మాచలం సోమవారం రాజీనామా చేస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వంలో ఏర్పడిన రాజకీయ పరిణామాల దృష్ట్యా వారు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

కంచుకోటకు బీటలు

- ఉమ్మడి జిల్లాలో 'కారు'కు ఊహించని ఫలితాలు
- ఏ పథకం మొదలు పెట్టినా ఇక్కడ నుంచే..
- పథకాల అమలులోనూ పక్షపాతం
- పార్టీ నేతల అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు ఓటమికి కారణమని అనుమానం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి శాసనసభ ఫలితాల్లో ఊహించని దెబ్బ తగిలింది. తెలంగాణ ఏర్పడ్డాక మొదటిసారిగా శాసనసభకు జరిగిన ఎన్నికల్లో 2014లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ శాసనసభ్యుడిగా తాటిపర్తి జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మిగతా 12 సీట్లను బీఆర్‌ఎస్ గెలుచుకుని సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2018 ఎన్నికల్లో మంథని నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక్కరే ఎన్నికయ్యారు. మిగితా 12 చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలువడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ పార్టీకి గుండెకాయలా నిలిచింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఎనిమిది సీట్లను గెలుచుకుని గులాబీ కంచుకోటకు బీటలు పారించడడంతో గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐదు సీట్లకే పరిమితం

బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడం గమనార్హం. రెండు దఫాలుగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒక్క సీటుకు పరిమితం చేయడమేకాకుండా పది సంవత్సరాలుగా జిల్లా పరిషత్, మండల పరిషత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తూ ప్రతిపక్షాలను చిత్తు చేయడంతో ఆ పార్టీల ఊసే లేకుండాపోయింది. సర్పంచ్ మొదలు ఎమ్మెల్యే, మంత్రుల వరకూ గులాబీ దళపతులే కావడంతో పరిపాలన వ్యవస్థ గాడి తప్పింది. బీఆర్‌ఎస్ నేతలు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే క్రమంలో.. లబ్ధిదారుల ఎంపికలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేయడంతో గ్రామాల్లో అలజడులకు బీజం పోసినట్లయింది. పార్టీ నాయకుల ఒంటెత్తుపోకడలు, వారిని అదుపులో పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు ఉండటంతో క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ అంటేనే గ్రామాల్లో ఒకింత అసహనానికి గురి చేసింది. ఇలా పెత్తనం చెలాయించే వ్యక్తుల సంఖ్య క్రమేపీ పెరిగింది. డబుల్‌బెడ్‌రూం, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బీసీ చేయూత, గృహలక్ష్మి వంటి పథకాలు ప్రవేశపెట్టిన క్రమంలో చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో జరిగిన ఆచరణకు పొంతన లేకపోవడంతో పల్లెల్లో ప్రజలు, నాయకులకు మధ్య విభజన రేఖ మొదలైంది. పథకాల అమలు విషయంలో పార్టీ వ్యక్తులు, అనుకూలమైన వారికే కట్టబెట్టడం వంటి సంఘటనలను ప్రజలు మరిచిపోలేకపోయారు. లబ్ధిదారుల అర్హుల జాబితా తయారు చేసే సమయంలో గ్రామాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం, పదుల సంఖ్యలో పథకాలు అమలుకావడంతో ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీపై, నాయకుల తీరుపై చర్చలు తీవ్రస్థాయిలో ఆలోచింపజేసే విధంగా జరిగి అసంతృప్తికి దారి తీశాయి.

మొదలైన పోస్టుమార్టం

గులాబీ జెండాకు అండగా నిలుస్తూ వచ్చిన ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎనిమిది సీట్లను కట్టబెట్టడం.. బీఆర్‌ఎస్‌కు కేవలం ఐదు సీట్లకు పరిమితం చేయడంపై పార్టీలో పోస్టుమార్టం మొదలైంది. పెద్దపల్లి జిల్లా మొత్తంలో ఒక్కసీటు కూడా రాకపోవడంపై బీఆర్‌ఎస్ అగ్రనేతలు ఆరా తీస్తున్నారు. సింగరేణి కార్మికులు ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్ వైపే ఉన్నా.. మంథని, రామగుండం, పెద్దపల్లిలో విజయం సిద్ధించకపోవడంపై పోస్టుమార్టం మొదలైంది. చొప్పదండిలో పోలీసు పోస్టింగుల వివాదం, స్థానిక నేతల మధ్య సయోధ్య కుదరకపోవడం ద్వారా అక్కడ పార్టీ పరాజయం పాలైందని సమాచారం. అలాగే మానకొండూరులో దళితబంధులో అక్రమాలు జరిగాయని, అభివృద్ధి పనులు సరిగా జరగలేదన్న అభిప్రాయం ఓటమికి కారణమై ఉండవచ్చని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. వేములవాడలో బీఆర్‌ఎస్ హోరాహోరీగా పోరాడినా.. కాంగ్రెస్ అభ్యర్థిపై సానుభూతి ముందు నిలవలేకపోయింది. ధర్మపురిలోనూ ఇదే సానుభూతి పవనాలు కాంగ్రెస్ విజయానికి బాటలు వేశాయి. కరీంనగర్‌లో వెన్నుపోటు రాజకీయాలు విజయాన్ని ప్రభావితం చేశాయి. కొందరు కీలక నేతలు ఆఖరు నిమిషంలో పార్టీ మారడం, బీఆర్‌ఎస్‌లో ఉండి ఇతర పార్టీల కోసం పనిచేయడం విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపింది.

ఉమ్మడి జిల్లాకు పెద్దపీట

బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఈటల రాజేందర్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌కు మంత్రి పదవులు కట్టబెట్టడమే కాకుండా పదుల సంఖ్యలో రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను జిల్లాకు చెందిన వారికే అవకాశం ఇచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించకుండా, జిల్లా, మండల, గ్రామ కమిటీలు లేకుండా, పార్టీ అనుబంధ విభాగాలపై దృష్టిసారించకుండా చోటామోటా నాయకులంతా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో పార్టీపై అజమాయిషీ లేకుండా పోయింది. దీంతో క్షేత్రస్థాయి నాయకుల ప్రవర్తనకు, వారు చేస్తున్న అవినీతికి విసిగివేసారిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న తరుణంలో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ప్రత్యామ్నాయ రూపంలో కాంగ్రెస్ పార్టీ కనబడడంతో ఆ పార్టీ వైపే అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపారు. ఇది బీఆర్‌ఎస్ పార్టీ కోటకు బీటలు పడినట్లయింది. ధరణితో ఒకరి భూములు ఒకరికి మారాయని కార్యాలయాల చుట్టూ తిరిగినా రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించకపోవడం, మార్గం చూపించకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రెవెన్యూ, కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట బాహాటంగానే నిరసనలకు దిగిన సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి.

కొంపముంచిన అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగడం, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ద్వితీయ శ్రేణి నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోయింది. పార్టీని సమన్వయం చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలదరికి చేర్చాల్సిన ప్రజాప్రతినిధులు.. గ్రామాల్లో రెండుగా విడిపోయి వర్గాలుగా తయారుకావడం, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటం లాంటి విషయాలు పార్టీని కోలుకోని దెబ్బతీశాయని చెప్పవచ్చు. ఏదేమైనా 2001లో ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా జరిగిన సింహగర్జన బహిరంగ సభ నుంచి, తెలంగాణ ఉద్యమంలో ప్రతి సందర్భాన్ని కరీంనగర్ నుంచే ఉద్యమాన్ని రగిలించడం, చివరకు 2009లో తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకోవడం లాంటి సంఘటనలు ఉద్యమ తొలినాళ్లల్లో మరిచిపోలేని సంఘటనలు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలన్నింటికి ఉమ్మడి కరీంనగర్ జిల్లానే వేదిక కావడం మరిచిపోలేని విషయం.

కొండగట్టు, ధర్మపురిలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



కొండగట్టు ఆలయంలో కలెక్టర్ పూజలు

కొండగట్టు/ధర్మపురి: జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామివార్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం దర్శించారు. అర్చకులు ఆమె గోత్రనామాలపై వేదమంత్రాలు చదివి తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మపురిలో ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలతో సన్మానించారు. కొండగట్టులో ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, అధికారులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తిధర రూ.6,750



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.6,750 పలికింది. సోమవారం మార్కెట్‌కు 116 వాహనాల్లో 1,486 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,200 పలికింది. గన్నీ సంచుల్లో ముగ్గురు రైతులు 10 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,300, మోడల్, కనిష్ఠ ధరలు 6,100కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా మార్కెట్లో సీసీఐ సంస్థ 15మంది రైతుల నుంచి 216.30 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,880 పలికింది. మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ కొనుగోళ్లను పర్యవేక్షించారు.

మావోల లేఖ కలకలం

- వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలి
- మావోయిస్టు పార్టీ జేఎండబ్ల్యూపీ కార్యదర్శి వెంకటేశ్ హెచ్చరిక



మావోయిస్టు పార్టీ లేఖ

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మిల్లు, ఖరీదు వ్యాపారుల మోసానికి వ్యతిరేకంగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ కార్యదర్శి వెంకటేశ్ అలియాస్ కంకణాల రాజిరెడ్డి సోమవారం లేఖ విడుదల చేయడం కలకలం సృష్టించింది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాణిజ్య పంటలు, సీడ్ విత్తనాలు వేయాలని చెప్పిందని లేఖలో పేర్కొన్నారు. విధిలేని పరిస్థితిలో పంటలు వేసిన రైతులకు సబ్సిడీ, సహకార బ్యాంకుల్లో లోన్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో పేద, మధ్యతరగతి అన్నదాతలు వడ్డీ వ్యాపారులు, అడ్తిదారులను ఆశ్రయిస్తే 3 నుంచి 5 రూపాయల వడ్డీకి అప్పులిస్తూ దండుకుంటున్నారని తెలిపారు. గిట్టుబాటు ధరలేక అప్పులపాలై, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్తే తేమ, ఇసుక, తాలు పేరిట క్వింటాల్‌కు 2 నుంచి 5 కిలోల వరకు తీసివేస్తున్నారని, మిల్లుల యజమానులు ఇదే పద్ధతి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. సీసీఐ నామమాత్రంగా ఒకరు, ఇద్దరు తెచ్చిన పత్తిని ఎంపిక చేసుకొని, మిగతా రైతులను గాలికి వదిలేస్తోందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని, ఖరీదుదారులు సిండికేట్‌గా మారి మార్కెట్ ధర కన్నా రూ.200 నుంచి రూ.300 తక్కువ చెల్లిస్తున్నారని తెలిపారు. జమ్మికుంట ఖరీదు వ్యాపారులైన దొనకొండ మల్లారెడ్డి, బాబయ్య, మిగతా వ్యాపారులు పత్తి క్వింటాల్‌కు రూ.20 చొప్పున హమాలీ ఖర్చులు కోసం రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, బచ్చు భాస్కర్, ముక్క నారాయణ కలిసి చిన్న మిల్లర్లతో సిండికేట్ అయ్యారని అన్నారు. రాజకీయ నాయకులకు, అధికారులకు కమీషన్లు ఇచ్చి, రైతుల వద్ద ధాన్యం, పత్తి తీసుకొని వెళ్లిన తర్వాత ధరల్లో క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు తక్కువ ఇస్తూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు, రైతులు తిరగబడతారని హెచ్చరించారు.

అమాత్య అవకాశం ఎవరికో..?

- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో తీవ్రపోటీ
- రేసులో పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి





పొన్నం ప్రభాకర్



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవులు చర్చ మొదలైంది. సీఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కేబినెట్ ఏర్పాటు చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు. వీరిలో ముఖ్యంగా గతంలో మంత్రిగా పనిచేసిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌లను కేబినెట్‌లోకి తీసుకుంటారని ప్రచారం సాగుతోంది. 13 స్థానాలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగు కొత్త జిల్లాలుగా ఆవిర్భావించిన నేపథ్యంలో జిల్లాకు ఒక మంత్రి చొప్పున ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు తెలిపారు. గతంలో కేటీఆర్(సిరిసిల్ల), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), గంగుల కమలాకర్(కరీంనగర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్) నలుగురు మంత్రులుగా కొనసాగారని గుర్తు చేస్తున్నారు.

పోటీలో కొత్తవారు సైతం...

సీనియర్ నాయకులతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాయకులు కూడా మంత్రి మండలిలో చోటు లేదా పార్టీ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీరిలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు కీలక బాధ్యతలు చేపట్టాలని ఉత్సాహంగా ఉన్నారు. పాత జిల్లాలో ఐక్యమత్యంతో పోరాడి 13 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిదింటిని కైవసం చేసుకున్న హస్తం నేతలు ఎన్నికల అనంతరం కూడా తాము ఇదే వైఖరితో ఐక్యంగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులు కూడా కేబినెట్‌లో చోటు ఆశిస్తున్నారని తెలిసింది. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సీనియర్లకు మంత్రి పదవులు, తొలిసారిగా గెలిచిన వారికి సామర్థ్యాన్ని బట్టి సహాయ మంత్రి లేదా పార్టీలో కీలక బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో జగిత్యాల అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈయన కూడా గతంలో అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. ఇప్పటికి శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతుండడంతో ఆయనను మంత్రి మండలిలోకి లేదా స్పీకర్ పదవికి ఎంపిక చేయవచ్చునని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల మధ్యే ఉంటా.. సమస్యలపై పోరాడుతా



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: ఎన్నికల్లో ఓడినప్పటికీ తాను ప్రజల మధ్యే ఉంటానని, సమస్యల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తానని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మానకొండూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మానకొండూర్ ఒక్కచోటే ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వలేదని, ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉందని, కార్యకర్తలు అధైర్య పడొద్దని సూచించారు. తన గెలుపు కోసం నిరంతరం ప్రయత్నం చేసిన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తన ఓటమిపై కార్యకర్తలతో సమావేశంమై చర్చించారు. ఓడినా.. ప్రతీ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. గతం కన్నా ప్రస్తుతం ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్టారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, దుబ్బ నీరజ, శాతరాజు యాదగిరి, సర్పంచ్ పృథ్వీరాజ్ ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గంగాధర(చొప్పదండి): ప్రజా తీర్పును గౌరవించడంతో పాటు, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బూర్గుపల్లిలో మాట్లాడారు. కేసీఆర్ లేని తెలంగాణ సర్కారును ఊహించుకోలేమని రవిశంకర్ కంట తడిపెట్టారు. 2018లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎమ్మెల్యేగా గెలిచి, అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి లేకపోయినా.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఊపిరి ఉన్నంత వరకూ కేసీఆర్ వెంటే



మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: తన ఊపిరి ఉన్నంత వరకు కేసీఆర్ వెంటే నడుస్తానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కేసీఆర్ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై అభిమానం చూపించి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం పాటుపడతానని అన్నారు. ప్రజలకు ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలన్ని నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏవైతే సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలకు అమలు చేసిందో, వాటిని తూచా తప్పకుండా కొనసాగిస్తానని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సతీమణి, కూతురు షాలినిరెడ్డి, శ్రీనికలు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్‌చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, బండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని కె.వందన ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆమెను అభినందించారు. విలువిద్యలో నేర్చుకునే విషయాలు ఎన్నో ఉంటాయని, ముఖ్యంగా ఏకాగ్రతను పెంపొందించే విధానం తెలుసుకుంటామని అన్నారు. క్రీడలతో చాలా లాభాలు ఉంటాయని, ప్రతీ విద్యార్థి రాణించాలని సూచించారు. ఇటీవల మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలబాలికల ఆర్చరీ చాంపియన్ షిప్‌లో వందన ప్రతిభ కనబరిచిందని తెలిపారు. త్వరలో గుజరాత్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కనగర్తి సర్పంచ్ అత్త దారుణ హత్య


నిందితుడిని కట్టేసిన గ్రామస్తులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): తన కుటుంబ విషయంలో జోక్యం చేసుకుంటున్నారన్న కోపంతో ఓ వ్యక్తి ఇల్లందకుంట మండలంలోని కనగర్తి సర్పంచ్ అత్తను దారుణంగా హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కనగర్తికి చెందిన రామంచ కుమార్‌కు ఆరు నెలల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థలతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు పంచాయితీలు జరిగినా ఫలితం లేకపోయింది. అయితే, గ్రామానికే చెందిన మట్ట లచ్చవ్వ (70) కుమారుడు, స్థానిక సర్పంచ్ భర్త వాసుదేవరెడ్డి తన కుటుంబ విషయంలో జోక్యం చేసుకుంటున్నాడని కుమార్ కోపం పెంచుకున్నాడు. సోమవారం సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నానా హంగామా చేశాడు. పంచాయతీ కార్యాలయ తలుపులపై కిరోసిన్ పోసి, నిప్పంటించాడు. స్థానికులు అడ్డుకోవడంతో నేరుగా సర్పంచ్ ఇంటికి వెళ్లాడు. ఇంటి ముందు కూర్చున్న వాసుదేవరెడ్డి తల్లి లచ్చమ్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. గ్రామస్తులు అడ్డుకొని, అతన్ని కట్టేశారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. సంఘటన స్థలాన్ని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్‌ఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. నిందితుడు కుమార్‌ను అదుపులోకి తీసుకొని, విచారణ జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మబ్బులు.. రైతుల్లో గుబులు

- కొంత ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో.. మరికొంత కల్లాల్లో
- జిల్లాలో అంతంతమాత్రంగానే కొనుగోళ్లు
- తూకం ఆలస్యమవుతోందని రైతుల ఆరోపణ
- దళారులకు అమ్ముకోవడం మేలని ఆవేదన


రాఘవాపూర్‌లో ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు



ఈ చిత్రంలో వడ్లు కుప్ప చేస్తూ కనిపిస్తున్న మహిళా రైతు పేరు పంబాల రాజేశ్వరి. మంథని మండలంలోని ఖానాపూర్‌లో ఈమెకు ఎకరం పొలం ఉంది. నాలుగు రోజుల క్రితం మంథని వ్యవసాయ మార్కెట్‌కు వడ్లు తీసుకువచ్చింది. అప్పటినుంచి నిత్యం ఆరబెడుతోంది. వాన వచ్చేలా ఉందని, తూకం పూర్తవడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. పోయిన యాసంగిలో ఇలాగే చెడగొట్టు వాన వచ్చి, పది బస్తాల ధాన్యం కొట్టుకుపోయి, నష్టం జరిగిందని వాపోయింది. ఇది ఈమె ఒక్కరి పరిస్థితే కాదు.. చాలా మంది రైతులది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు.


మంథనిలో ధాన్యం తింటున్న మేకలు

పెద్దపల్లిరూరల్/మంథని: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. కొన్నిచోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండగా.. కొంతమంది రైతులకు చెందిన ధాన్యం కల్లాల్లోనే ఉంది. తుపాన్ ప్రభావంతో మబ్బులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం అక్కడక్కడ చినుకులు రాలడంతో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పేందుకు ఆరాటపడ్డారు. ధాన్యం తడిస్తే రంగుమారి, నష్టం జరుగుతుందని వాపోతున్నారు. మంగళవారం జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనతో వారి గుండెల్లో గుబులు నెలకొంది.

307 కొనుగోలు కేంద్రాలు..

పెద్దపల్లి జిల్లాలో 307 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 273 కేంద్రాల్లో ధాన్యం తూకం వేస్తున్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 203, ఐకేపీ ఆధ్వర్యంలో 52, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 18 కేంద్రాల్లో కొనుగోళ్లు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

4.90 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా

జిల్లాలోని 14 మండలాల్లో 2,01,408 ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈసారి 4.90 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనాకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.236.33 కోట్ల విలువైన 1,07,313 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 16,988 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. వీరిలో 9,869 మందికి రూ.131.14 కోట్లు చెల్లించామని తెలిపారు.

నిబంధనల పేరుతో ఇబ్బందులు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారం, మట్టిపెల్లలు ఉన్నాయని, తేమ శాతం రావడం లేదన్న కారణాలతో కొనుగోలు జాప్యం చేస్తున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల టార్పాలిన్లు అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు. ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి, ఇబ్బందులు పడటం కన్నా దళారులకు కల్లాల వద్దే అమ్ముకోవడం నయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడే అవకాశం ఉందని, త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

పెరిగిన మద్దతు ధర

కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర పెంచగా ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చింది. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు రూ.143 చొప్పున పెంచింది. గతంలో సాధారణ రకం పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,040 ఉండగా, ఇప్పుడు రూ.2,183కు పెరిగింది. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి గతంలో రూ.2,060 ఉండగా ఇప్పుడు రూ.2,203కు పెంచినట్లు అధికారులు తెలిపారు.

ఇబ్బందుల్లేకుండా కొనుగోలు

రైతులు తెచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని ఇబ్బందుల్లేకుండా కొనుగోలు చేస్తున్నాం. మట్టిపెల్లలు, తాలు ఉంటే శుభ్రం చేయించేందుకు అవసరమైన ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాం. వర్షం కురిసినా ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైనన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి.

– దేవరాజ్ పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, పెద్దపల్లి

ప్రతీసారి ఇదే పరిస్థితి



పంట కల్లాల్లో ఉన్నప్పుడే వర్షం పడుతోంది. ప్రతీసారి ఇదే పరిస్థితి. నేను పోయినసారి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలిస్తే 10 బస్తాల వరకు కొట్టుకుపోయింది. ఈసారి మళ్లీ ఎక్కడ నష్టం జరుగుతుందోనని భయంగా ఉంది.

– కొట్టె సంపత్, రైతు, మంథని

ఫలించిన ఎమ్మెల్యే దుద్దిళ్ల వ్యూహం

- మంథనిలో మరోసారి పాగా వేసిన కాంగ్రెస్
- ప్రత్యర్థి, ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకొని విజయం

మంథని: విలక్షణమైన తీర్పు ఇచ్చే ఆనవాయితీ ఉన్న మంథని ప్రజల నాడిని అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పసిగట్టారు. ఆయన రచించిన వ్యూహం ఫలించడంతో ఐదోసారి విజయం సొంతం చేసుకున్నారు. ప్రచారంలో వెనకబడినట్టుగానే ఉండి, చివరి రోజుల్లో తనదైన శైలిలో ముందుకు సాగడంతో గెలుపు సొంతమైంది. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొన్న అసమ్మతిని గుర్తించి, ఆ పార్టీకి చెందిన అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగడంతోపాటు మరోచోట బుంగ పడటాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల మూడేళ్లుగా గోదావరి, మానేరు తీర రైతుల్లో వ్యతిరేకతను గుర్తించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని రెండుసార్లు నియోజకవర్గానికి రప్పించడం లాభించిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నియోజకవర్గంలో అది పెద్ద మండలమైన ఉమ్మడి కమాన్‌పూర్ బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉందని భావించి, కమాన్‌పూర్, రామగిరి మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకుల అంచనాలు తలకిందులు చేస్తూ రామగిరి నుంచి 5,103, మంథని మండలం నుంచి 4,700 ఓట్ల మెజారిటీ సాధించారు. తూర్పు మండలాలైన మహాముత్తారం, కాటారం, మహదేవపూర్, మల్హర్‌లకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులను కాంగ్రెస్‌లో చేర్చుకొని, పట్టు సాధించారు. కాటారం నుంచి 7 వేల పైచిలుకు, మహదేవపూర్, మల్హర్ మండలాల నుంచి 3 వేల పైచిలుకు మెజారిటీ రాబట్టుకున్నారు. ఒక్క పలిమెల మండలంలో కొద్దిపాటి తేడా తప్ప అన్ని మండలాల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మెజారిటీ రావడం విశేషం. దీంతో ఆయన 31 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయన స్థానికంగా ఉండటం లేదని ప్రత్యర్థి చేసిన ఆరోపణలను తిప్పి కొట్టారు. గతంలో నాలుగుసార్లు ఇక్కడి నుంచి గెలిచానని, తన వద్ద ప్రజలు ఏనాడూ ఆ విషయాన్ని ప్రస్తావించలేదని, ఎక్కడున్నా వారి అభివృద్ధి, సంక్షేమం కోసమే పని చేశానని ప్రచారం చేశారు. ఈ మాటలు ప్రజలను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది.

విండో చైర్మన్, అనుచరులపై కేసు నమోదు చేయాలి


బాధితులతో కలిసి మాట్లాడుతున్న సదానందం

ముత్తారం: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గెలుపుపై సర్వారం గ్రామంలో ఆదివారం రాత్రి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకుడి కుటుంబంపై దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ముత్తారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం డిమాండ్ చేశారు. సోమవారం సర్వారంలో బాధితులతో కలిసి, మాట్లాడారు. గ్రామానికి చెందిన పెయ్యల పోశం, అతని కుమారుడు సాయితేజ, భార్య స్వరూపలపై సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, అతని అనుచరులు జంగ వెంకట్‌రెడ్డి, చీరాల కుమార్, శ్రీను, అబ్బు ప్రతాప్‌రెడ్డి, సోలేటి సంతు అకారణంగా దాడి చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఓటమిని జీర్ణయించుకోలేకనే ఇలా చేశారని మండిపడ్డారు. వారిపై కేసు నమోదు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు చెలుకల జితేందర్, బండ సమ్మయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన పాలపు సత్తయ్య(60) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సత్తయ్య ఆదివారం సాయంత్రం నుస్తులాపూర్ శివారులో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సింగరేణి క్వార్టర్లకు ‘భగీరథ’ నీరిస్తాం


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి క్వార్టర్లకు త్వరలో మిషన్ భగీరథ నీరిస్తామని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ నేతృత్వంలో స్థానికంగా నిరుద్యోగ, వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులు మహంకాళి స్వామి, ముస్తఫా, పెద్దెల్లి ప్రకాశ్, సుతారి లక్ష్మణ్‌బాబు, కాల్వ లింగస్వామి, గట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్ స్పోర్ట్స్: పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో మంగళ, బుధవారాల్లో జరగనున్న 8వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ మహేందర్ తెలిపారు. ఇటీవల ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 14 మంది రాణించారన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి వారిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి, జాతీయస్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

డీజే వద్దన్నందుకు కర్రలతో దాడి


గాయపడిన మహేశ్

గోదావరిఖని(రామగుండం): డీజే వద్దన్నందుకు కర్రలతో దాడి చేసి, ఓ వ్యక్తిని గాయపరిచిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే గెలుపు సందర్భంగా స్థానిక రాజీవ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు ఎంచర్ల మహేశ్ ఇంటి ఎదుట డీజే సౌండ్స్‌తో పలువురు నృత్యాలు చేశారు. వద్దని చెప్పినా వినకపోవడంతో అతను ఇంట్లో నుంచి కొద్దిసేపు బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని, కర్రలతో దాడి చేయగా గాయపడ్డాడు. దాడికి పాల్పడిన మేకల పోశం, మేకల మహేశ్, పల్లె ఉదయ్, పల్లె సంజయ్‌లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా, గాయపడిన మహేశ్‌ను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సోమవారం పరామర్శించి, ధైర్యం చెప్పారు.

సమష్టి కృషితోనే కాంగ్రెస్ విజయం


మాట్లాడుతున్న రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే కాంగ్రెస్ విజయం సాధించిందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి అన్నారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలోని ఐదు డివిజన్లతోపాటు రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లి పంచాయతీ పరిధి కేకే నగర్, కుమారస్వామి నగర్, షాపింగ్ కాంప్లెక్స్ తదితర ఏరియాలకు చెందిన ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేసి, గెలిపించారని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను, మంథనిలో శ్రీధర్ బాబును భారీ మెజారిటీతో గెలిపించిన సింగరేణి కార్మికులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు మార్క రాజు, రాములు, తిరుపతి రెడ్డి, సారయ్య, రాజేశం, యాదగిరి తిరుపతి, వీరారెడ్డి, చాట్ల సదానందం, రమేశ్ రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున పోరాటం చేస్తాం

- బీజేపీ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి


మాట్లాడుతున్న సంధ్యారాణి

గోదావరిఖని(రామగుండం): సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున పోరాటం చేస్తామని బీజేపీ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయిన కందుల సంధ్యారాణి తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాషాయ జెండాను ఎట్టిపరిస్థితుల్లో వీడేది లేదని, రాబోయే కార్పొరేషన్, ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బీజేపీకి మంచి మెజారిటీ వచ్చిందని పేర్కొన్నారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల ధర్మపురి, వడ్డేపల్లి రామచంద్రం, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమల మహేశ్, కొండపర్తి సంజీవ్‌కుమార్, గోపగోని నవీన్‌గౌడ్, గాండ్ల స్వరూప, మూకిరి రాజు, బోడకుంట జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు


స్వీట్లు పంచుకుంటున్న సింగరేణి ఉద్యోగులు


ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద..

యైటింక్లయిన్‌కాలనీ: మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు గెలుపుపై ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకుడు మురాద్ ఖాన్ (మతిన్) ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. సింగరేణి ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీధర్‌బాబు మంత్రి హోదాలో సింగరేణి ఏరియాలో అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైజీఎం ఎర్రన్న, ఎస్ఈ రాంరెడ్డి, ఇంజినీర్ సంజీవ్, ఫోర్‌మెన్లు రామారావు, బాబు, రాజ్‌కుమార్, ప్రభాకర్ రెడ్డి, దశరథం, శ్రీనివాస్, రవీందర్, రఫీక్, ఇజాజ్ ఖాన్, కృష్ణ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ ఘన విజయం సాధించడంతో ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబా, సత్యంల ఆధ్వర్యంలో మక్కాన్‌సింగ్ సోదరుడు అయోధ్య సింగ్ కార్మికులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆయన ముందుంటారని అన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేయాలి


ఢిల్లీలో నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారికి దరిచేరడం లేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సభ్యుడు మద్దెల దినేశ్ ఆరోపించారు. జాతీయ దళిత సమ్మిట్ పిలుపు మేరకు చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితుల హక్కుల పరిరక్షణకు ఎస్సీ సబ్ ప్లాన్, ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలపై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల మద్దతుతో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌కు ఏఐటీయూసీ నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోషం అభినందనలు తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంటనే కార్మికుల సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. క్వార్టర్లలో మార్బుల్ స్టోన్ వేయించాలని, కార్మికుల మారుపేర్లు మార్చాలన్నారు. శిథిలమైన క్వార్టర్ల స్థానంలో డబుల్ బెడ్‌రూంలతో కొత్తవి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కార్మికుల ఓట్లతో గెలుపొందిన నాయకులు సమస్యలు విస్మరించారని, అందుకే ఈసారి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇచ్చి, రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు గౌతం గోవర్దన్, రంగు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సతీశ్‌బాబు, స్వామి, తిరుపతి, మల్లేశ్, రమేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ రమేశ్ రెడ్డి, నిర్వాహకులు

- శ్రీ చైతన్య కళాశాల చైర్మన్ రమేశ్ రెడ్డి
- మెగా స్పోర్ట్స్ మీట్ 2కే–23 ప్రారంభం

తిమ్మాపూర్(మానకొండూర్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి, గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని తిమ్మాపూర్ శ్రీ చైతన్య కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో మెగా స్పోర్ట్స్ మీట్ 2కే–23 ప్రారంభించి, మాట్లాడారు. వారం రోజులపాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటల ద్వారా పోటీతత్వం, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. జేతలకు సర్టిఫికెట్‌తోపాటు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, రన్నింగ్, త్రోబాల్, కబడ్డీ, క్యారమ్స్, బ్యాడ్మింటన్, షార్ట్‌పుట్ క్రీడాంశాల్లో పోటీలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, నిర్వాహకులు శ్రీరామచంద్, వినయ్, ఏవో రామారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి రమేశ్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న సైకత శిల్పం



కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన సైకతశిల్పి రేవెల్లి శంకర్ ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహిస్తున్న ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో నాల్గోరోజు సోమవారం కోణార్క్ ఆలయ సమీపంలోని చంద్రభాగా నదీ తీరంలో 'అతిథి దేవో భవ' అంశంపై సైకత శిల్పాన్ని రూపొందించి అభినందనలు అందుకున్నారు. ఏటా ఐఎస్ఏ ఫెస్టివల్‌కు హాజరయ్యే విదేశీ పర్యాటకులకు హిందూ సాంప్రదాయ ప్రకారం ఓ మహిళ స్వాగతం తెలియజేస్తున్నట్లు శంకర్ వేసిన శిల్పం ఆకట్టుకుంది.

అలరించిన భక్తి సంగీత విభావరి



విద్యానగర్(కరీంనగర్): కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీనీలకంఠ భజన మండలి (మహిళా విభాగం) వారు జనగాం జిల్లా పాలకుర్తి మండలం వల్మిడిలోని శ్రీసీతారామాలయంలో సోమవారం నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. శ్రీనీలకంఠ భజనమండలి గౌరవ అధ్యక్షుడు గర్రెపెల్లి,ఆంజనేయులు, అధ్యక్షుడు వడాల మాధవి, ప్రధాన కార్యదర్శి కొండూరి పుష్పలత, సభ్యులు సంధ్య, రజిత, కవిత, శారద, ఎజ్జు శ్రీనివాస్, పంజాల శ్రీధర్‌గౌడ్ ఆలపించిన భక్తి పాటలు భక్తిపరవశ్యంలో ముంచెత్తాయి. సంగీతా విభావరిలో సంగీతాన్ని సదానందం, స్వామి, కమలాకర్, కొమురవెల్లి సుధాకర్, రవీంద్రచారిలు అందించారు.

విద్యుత్ ఉద్యోగుల సంబరాలు



కొత్తపల్లి: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో పాటు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ సోమవారం కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ ఆవరణలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-327(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి విద్యుత్ సంస్థను ముందజలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుతుందని యూనియన్ కంపెనీ కార్యదర్శి కొండూరి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.యుగంధర్, కె.శ్రీనివాస్, నాయకులు అమీర్‌పాషా, రహ్మత్ అలీ, రమేష్, శ్రీనివాస్, రవీందర్, అంజయ్య, సుధాకర్, లక్ష్మణ్, తిరుపతి, సత్యం, రాజు, కొట్టె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు 'పారమిత' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రితీష్ మెహతా

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రితీష్ మెహతా తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన సీనియర్స్ మహిళా కబడ్డీ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో వి.అశ్విత(10వ తరగతి), బి.వంశిక (9వ తరగతి)లు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే, 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ముగ్గురు ఎంపికయ్యారని అన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14 బాలుర విభాగంలో ఎల్.ప్రీతమ్ (7వ తరగతి), అండర్-17 విభాగంలో ఎల్.సుప్రీత్ (9వ తరగతి), టి.రిషికుమార్ (పదోతరగతి) ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు, వి.యు.యం.ప్రసాద్ అభినందించారు. ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్రపాత్రో, రాము, హరిప్రియ, సరిత, పీఈటీ రాజు తదితరులున్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరీంనగర్: నగరంలోని జాన్సన్ గ్లోబల్ స్కూల్‌లో సోమవారం వాసన్ కంటి ఆస్పత్రిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ మన శరీరంలో కన్నుది ముఖ్య పాత్ర అని, దీనివల్ల ప్రపంచాన్ని చూడగలుగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎస్‌వీజేసీ డైరెక్టర్స్ వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పది 'లక్ష్య'సాధనకు ప్రత్యేక తరగతులు

- వందశాతం ఫలితాలపై దృష్టి
- రోజుకో సబ్జెక్టు బోధన

కరీంనగర్‌రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో కంటే అధికశాతం 10జీపీఏ సాధించాలనే ఉద్దేశ్యంతో ప్రణాళిక రూపొందించారు. దీని కోసం 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్‌రూరల్, కార్పొరేషన్, కొత్తపల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతనెల 6వ తేదీ నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌రూరల్‌లో 245, కార్పొరేషన్‌లో 674, కొత్తపల్లి మండలంలో 217 మంది చొప్పున మొత్తం 1136 విద్యార్థులున్నారు.

రోజుకో గంట ప్రత్యేక తరగతులు

ప్రతీరోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు రోజుకో గంట చొప్పున ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ప్రతీరోజు ఒక్కో సబ్జెక్టులో 1-2 సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలను ఇచ్చి అరగంటలో స్లిప్‌టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో ఆయా సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థులకు బోధనపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యాచరణ రూపొందించారు. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు నెలరోజులుగా తరగతులు నిర్వహిస్తున్నారు.



ఎలగందల్ జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

కరదీపికలు పంపిణీ

పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పాఠశాలలకు లక్ష్య పేరుతో సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలకు ఒకటి చొప్పున ప్రత్యేక కార్యాచరణ, పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా కార్యాచరణతో కూడిన కరదీపికలు అందజేశారు. విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మినహా గణితం, భౌతిక, రసాయన, జీవ, సాంఘీక శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలు అందించారు.

ప్రత్యేక దృష్టి పెడుతున్నాం

ఆయా పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టాం. విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు పాఠాలను బోధించేలా చర్యలు చేపట్టాం. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.

– ఎం.మధుసూదనచారి, ఎంఈవో, కరీంనగర్

'ఇది తెలంగాణకు నిజమైన విమోచనం'

విద్యానగర్(కరీంనగర్): బీఆర్‌ఎస్ పాలన అంతం కావడం వల్ల తెలంగాణకు నిజమైన విమోచనం కలిగిందని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నిరంకుశ కుటుంబ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి జరిగిందన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రం ఇప్పటివరకు నియంత చేతిలో బంది అయిందని తెలిపారు. ఇక రాష్ట్రానిని చక్కదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు అక్రమంగా సంపదించిన డబ్బుపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిగిరి శ్రీధర్, రామ్మూర్తి, కిషన్, కాలీద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

ఎంఐఎం నాయకులకు అభినందన

కరీంనగర్: కరీంనగర్ ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌తో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యురాలు, నాయకులను ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఏఐఎంఐఎం జాతీయ ప్రధాన కార్యాలయం దారుసలాంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్‌లను గులాం అహ్మద్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై పూర్తి స్థాయి అంశాలను వివరించారు. మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 35 స్థానాల్లో ఎంఐఎం పార్టీని బలోపేతం చేసి 25 కార్పొరేటర్లు గెలిపే లక్ష్యంగా కృషి చేయాలని ఆదేశించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ త్వరలో అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు కరీంనగర్‌లో పర్యటించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఫసియుద్దీన్ ఖాలీద్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

పారిశ్రామిక సందర్శన



కరీంనగర్ డెయిరీని సందర్శిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని ఎస్ఆర్ఎం కళాశాల ఎంబీఏ విద్యార్థులు కోర్సు కరికులమ్‌లో భాగంగా సోమవారం కరీంనగర్ పాలడెయిరీని సందర్శించారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా పాల సమీకరణ, పాశ్చరైజేషన్, ఉప పదార్థాల తయారీ, మార్కెటింగ్ విధానాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో బోధనతో పాటు పారిశ్రామిక సందర్శన చేపట్టడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెంపొందడంతో పాటు ఉపాధి అవకాశాలు పొందే అవకాశం కల్పించినట్లవుతుందని కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎంబీఏ విభాగ ఇన్‌చార్జి ఎండీ ఖ్వాజా మొయినొద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మాజీ ఈవో ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి క్యాలెండర్‌ను అర్చకుడు మంగళంపల్లి రాజేశ్వరశర్మ, అయ్యప్ప సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15వేల మంది దీక్షాపరులకు క్యాలెండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో కొన్న కాంతారెడ్డి గురుస్వాములు లింగంపల్లి సత్యనారాయణ, రవీంద్రనాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్, రవీందర్; నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం ఉత్కంఠభరితం

- నువ్వా నేనా.. అన్నట్లు సాగిన కౌంటింగ్

కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపులో బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఆధిక్యత కొనసాగించగా మధ్యలో పలుమార్లు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఆధిక్యం ప్రదర్శించారు. ఆ తర్వాత పలు రౌండ్లలో నువ్వా నేనా అన్నట్లుగానే ఓట్లు వస్తుండటంతో అభ్యర్థులు, పార్టీ శ్రేణులు క్షణక్షణం ఉత్కంఠకు గురయ్యారు. త్రిముఖ పోటీలో గంగుల కమలాకర్ ఆధిక్యంలో ఉండగా రెండో స్థానంలో బీజేపీ, మూడో స్థానంలో కాంగ్రెస్ నిలిచింది. గ్రామాలతో పాటు, నగరంలోని పలు డివిజన్లలో బీఆర్‌ఎస్‌కు మంచి అధిక్యత ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్ మొత్తం 5,409 మంది ఉద్యోగులు వేయగా అందులో 126 తిరస్కరణకు గురయ్యాయి. గంగుల కమలాకర్‌కు 950, పురుమల్ల శ్రీనివాస్‌కు 1526, బండి సంజయ్‌కు 2661 మంది బ్యాలెట్ ఓటేశారు.13 మంది నోటాకు వేశారు. ఓట్ల లెక్కింపులో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు రౌండ్ల వారీగా..

రౌండ్లు	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఆధిక్యత
1	4,856	1,312	3,711	1,145
2	3,790	1,996	3,412	378
3	4,246	2,721	3,364	882
4	4,036	1,151	4,279	243
5	3,803	2,403	4,746	1,400
6	4,125	1,914	3,053	1,072
7	3,603	2,309	2,724	879
8	4,199	2,362	1,958	2,241
9	3,199	935	3,969	770
10	3,356	1,007	1,549	1,807
11	1,846	769	3,157	1,311
12	3,792	1,663	2,592	1,200
13	2,718	1,032	2,759	41
14	3,253	913	5,411	2,158
15	5,995	1,728	2,283	3,712
16	5,200	2,066	2,509	2,691
17	3,243	1,499	3,215	28
18	4,392	1,451	1,948	2,444
19	2,881	1178	4,956	2,075
20	2,977	1,297	5,402	2,425
21	3,614	1,427	3,628	14
22	3,558	1,188	4,378	820
23	3,440	1,441	5,284	1,844
24	2,935	1,757	4,023	1,088
25	2,266	1,007	2,034	1,259
26	418	247	533	115
పోస్టల్‌బ్యాలెట్	950	1,526	2,661	1,135
మొత్తం	92,179	40,052	89,016	3163(బీఆర్‌ఎస్)

కాంగ్రెస్‌లో చేరిక

కరీంనగర్‌కార్పొరేషన్: తెలంగాణ ముస్లిం నూర్‌భాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ అజిముద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాక్రే సమక్షంలో అజీముద్దీన్ కాంగ్రెస్ గూటికి చేరారు. అనంతరం మంథని నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న అజిముద్దీన్

'గంగుల' గెలుపు.. అభిమాని మొక్కు



కరీంనగర్: కరీంనగర్ నియోజక వర్గం నుంచి నాల్గోసారి గంగుల కమలాకర్ విజయం సాధించడంతో ఆయన అభిమాని కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నునుగొండ చందు మొక్కు తీర్చుకున్నారు. గంగుల కమలాకర్ గెలిస్తే తలనీలాలు ఇస్తానని కొండగట్టు ఆంజనేయ స్వామికి మొక్కుకున్నారు. కమలాకర్ విజయంతో సోమవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొని తలనీలాలు సమర్పించారు.

నేడు అల్ఫోర్స్‌లో 'అయ్యప్ప మహా పడిపూజ'

కొత్తపల్లి: కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి అయ్యప్ప మహా పడి పూజ మహోత్సవం, అల్పా ఏర్పాటు చేసినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. లోకకల్యాణార్థమై, మానవాళి శ్రేయస్సుకై ఏటా అత్యంత వైభవోపేతంగా అయ్యప్ప మహాపడి పూజ నిర్వహిస్తున్నామని అన్నారు. చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల గురుస్వామి ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య పదునెట్టంబడి పూజను శరణు ఘోష మధ్య నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పూజలో భాగంగా మహాగణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన, విశేష భజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పడిపూజ అనంతరం అల్పాను ఏర్పాటు చేసినట్లు, దీక్షాపరులు, భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులై ఆధ్యాత్మిక వాతావరణాన్ని శోభాయమానం చేయాలని కోరారు.







కార్తీక సోమవారం పూజలు

కార్తీక మాసం పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో అర్చనలు, అభిషేకలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- కరీంనగర్‌కల్చరల్





కాంగ్రెస్ అధికారంలోకి రావడంపై పూజలు



కరీంనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచినా సందర్భంగా కమాన్‌పూర్‌లోని అభయాంజనేయ ఆలయంలో సోమవారం యూత్ కాంగ్రెస్ కొత్తపల్లి మండల అధ్యక్షుడు బూస ప్రశాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. పూజల్లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్, నాయకులు శ్రవణ్‌నాయక్, సిరిపురం నాగప్రసాద్, అంజయ్య, పంజాల కృపసాగర్, శ్రీనివాస్, ప్రభాకర్, మనోహర్, చంద్రయ్య, మల్లేశం, అనిల్ గుప్తా, కిషన్, సంపత్, శేఖర్, రాజు, రమేశ్, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, గిన్ర రమేశ్, సంతోష్, రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఐదు జిల్లాల్లో దుర్గమ్మ ప్రచార రథయాత్ర

ఈ నెల 6న ప్రారంభం.. 24న ముగింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఐదు జిల్లాల్లో ప్రచార రథయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయం తీసుకుంది. శోభకృత నామ సంవత్సర భవానీ దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దుర్గమ్మ ప్రచార రథయాత్ర అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో సాగనుంది. ఈ మేరకు రూట్‌మ్యాప్‌ను ఆలయ వైదిక కమిటీ నిర్ణయించి ఈవో కె.ఎస్.రామారావుకు అందజేసింది. ప్రచార రథయాత్రలో నిత్యం ఆది దంపతులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో చండీ హోమం, కుంకుమార్చనతో పాటు శాంతి కల్యాణం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రచార రథ యాత్రపై ఇప్పటికే ఆయా జిల్లాల్లోని గ్రామపెద్దలు, గురు భవానీలు, భక్త సమాజాలకు సమాచారం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామోత్సవంతో పాటు పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది.

ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్..



జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్–1, యూనిట్–2లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. యూనిట్–1లో పలు సాంకేతిక కారణాలతో గత నెల 20 నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి మరమ్మతు చేస్తున్నారు. యూనిట్–2లో ట్యూబ్ లీకేజీల కారణంగా ఈ నెల ఒకటి నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయడంతో రెండు యూనిట్లల్లోనూ ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. యూనిట్–2 నుంచి విద్యుత్ ఉత్పత్తికి అధికార యంత్రాంగం అంతా రాత్రింబవళ్లు శ్రమిస్తుండగా మంగళవారం నాటికి ప్రారంభించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఒక్కో యూనిట్ నుంచి సుమా రు 13.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రెండు యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోవడంతో రోజుకు సుమారు రూ.14 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతోంది.

24% పెరిగిన సైబర్ నేరాలు

2022లో దేశవ్యాప్తంగా 65,893 సైబర్ కేసుల నమోదు

- సైబర్ నేరాల నమోదులో 40 శాతం పెరుగుదలతో మొదటి స్థానంలో తెలంగాణ
- దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం పెరుగుదల.. అన్ని నేరాల్లో 4.5 శాతం తగ్గుదల
- జాతీయ నేర గణాంకాల బ్యూరో–2022 నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశంలో సైబర్ నేరాల నమోదు ఏటా పెరుగుతోంది. 2021తో పోలిస్తే దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నమోదు 2022లో 24.4 శాతం పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)–2022 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని పేర్కొంది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాల నమోదు తెలంగాణలో 40 శాతం పెరిగిందని వివరించింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని రకాల నేరాల నమోదు 4.5 శాతం తగ్గినట్లు నివేదిక తెలిపింది. ఎన్‌సీఆర్‌బీ–2022 వార్షిక నివేదికను కేంద్ర హోంశాఖ సోమవారం విడుదల చేసింది. ఏటా జూలై లేదా ఆగస్టు వరకు ఈ నివేదిక విడుదల చేస్తుండగా ఈసారి ఎన్‌సీఆర్‌బీ నివేదిక విడుదలలో దాదాపు 5 నెలలపాటు జాప్యమైంది.

58.24 లక్షల కేసులు...

ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక ప్రకారం ఐపీసీ, స్పెషల్ లోకల్ లా (ఎస్ఎల్ఎల్) సెక్షన్ల కింద కలిపి 2021లో మొత్తం 60,96,310 కేసులు నమోదవగా 2022లో అన్ని రకాల నేరాలు కలిపి 4.5 శాతం తగ్గుదలతో 58,24,946 కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మందికి నేరాల నమోదు పరిశీలిస్తే 2021లో 445.9 నేరాలు నమోదుకాగా 2022లో ఆ సంఖ్య 422.2కు తగ్గింది. దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం, చిన్నారులపై నేరాల్లో 8.7 శాతం, వృద్ధులపై నేరాల్లో 9.3 శాతం, ఎస్సీలపై నేరాల్లో 13.1 శాతం, ఎస్టీలపై నేరాల్లో 14.3 శాతం, ఆర్థిక నేరాల్లో 11.1 శాతం పెరుగుదల నమోదైంది. అదే సమయంలో తెలంగాణలో ఐపీసీ, ఎస్ఎల్ఎల్ చట్టాల కింద నమోదైన అన్ని రకాల కేసుల నమోదు చూస్తే కేసుల నమోదు సంఖ్య పెరిగింది.

2021లో 1,58,809 కేసులు నమోదవగా 2022లో రాష్ట్రవ్యాప్తంగా 1,65,830 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో 2022లో నమోదైన కేసుల్లో 79.7 శాతం కేసులలో చార్జిషీట్లు దాఖలయ్యాయి.

రాష్ట్రంలో సైబర్ క్రైం పైపైకి...

తెలంగాణలో 2022లో మొత్తం 15,272 సైబర్ నేరాలు నమోదవగా 2021లో మొత్తం 10,303 కేసులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. 2021తో పోలిస్తే తెలంగాణలో 2022లో 40 శాతం మేర సైబర్ కేసులు నమోదు పెరిగినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 2022లో మొత్తం 65,893 సైబర్ నేరాలు నమోదుకాగా, 2021లో 52,974 కేసులు నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాలపై కేసుల నమోదు 24.4% పెరుగుదల ఉంది. 2022లో నమోదైన సైబర్ నేరాలను పరిశీలిస్తే 64.8 శాతం (42,710 కేసులు) సైబర్ నేరాలకు కారణం మోసం చేసే ఉద్దేశమని నివేదిక తేల్చింది. ఆ తర్వాతి స్థానంలో 5.5 శాతం (3,648 కేసులు) బెదిరింపులకు సంబంధించినవి, లైంగిక దోపిడీ కారణమైన సైబర్‌నేరాలు 5.2 శాతం (3,434 కేసులు) ఉన్నట్లు వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో తెలంగాణ తర్వాత స్థానంలో కర్ణాటక (18.6 శాతం), మహారాష్ట్ర (6.6 శాతం) ఉన్నాయి.

ఇతర నేరాలు ఇలా...

రాష్ట్రంలో మహిళలపై నేరాల సంఖ్య పెరిగింది. 2021లో 20,865 కేసులు నమోదవగా 2022లో అవి 22,066కు పెరిగాయి. మానవ అక్రమ రవాణా కేసులు 2022లో దేశవ్యాప్తంగా 2,250 కేసులు నమోదవగా 391 కేసుల నమోదుతో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర (295), బిహార్ (260) నిలిచాయి. హత్య కేసుల సంఖ్య 2022లో తెలంగాణలో తగ్గింది. 2021లో 1,026 హత్య కేసులు నమోదవగా 2022లో ఆ సంఖ్య 337కు తగ్గింది. వాటిలో వివాహేతర సంబంధాల కారణంగా 116 హత్యలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది.

హైదరాబాద్‌లో బీఆర్‘ఎస్’ బయట కాంగ్రెస్

- ముస్లిం మైనారిటీ ఓటర్ల తీరులో మార్పు!
- క్షేత్రస్థాయి పరిశీలనలోనే గుర్తింపు.. పోస్ట్ పోల్ సర్వేలదీ అదే మాట

సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలంగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ వచ్చిన ముస్లిం మైనారిటీల తీరులో మార్పు వచ్చినట్టు తాజా ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. మజ్లిస్ పోటీ చేసే స్థానాల్లో ఆ పార్టీకి ఏకపక్షంగా ఓట్లు వేస్తూ, మజ్లిస్ పోటీలో లేని స్థానాల్లో పూర్తిగా బీఆర్ఎస్ అభ్యర్థుల పక్షాన నిలిచే సంప్రదాయాన్ని పక్కన పెట్టినట్టు అవగతమవుతోంది. అయితే జంటనగరాలు, దాని శివారు ప్రాంత నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్ఎస్‌నే ఆదరించారు. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా హవా ప్రదర్శించినా జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం చేతులెత్తేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మా త్రం ముస్లిం మైనారిటీలు.. ముందే చెప్పినట్లు సంప్రదాయాన్ని పక్కనబెట్టి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ముస్లిం ఓటర్లు గణనీయ సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇండియా టుడే నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వేలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. హైదరాబాద్ వెలుపలి నియోజకవర్గాల్లో ముస్లింలు కాంగ్రెస్ పక్షాన నిలిచినట్లు వెల్లడించింది.

ఒవైసీ పిలుపును పట్టించుకోకుండా..

‘ఒవైసీ హైదరాబాద్ నేత. ఆయన అభ్యర్థులు అక్కడే గెలుస్తారు. ఆ ప్రాంత ముస్లిం ఓటర్లను ఆయన ప్రభావితం చేస్తారు. కానీ మాకు ఒవైసీతో సంబంధం లేదు. బీఆర్ఎస్‌కు ఓటేయాలన్న ఆయన పిలుపును కాకుండా మా ప్రాంత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మేం నిర్ణయం తీసుకుంటాం. ఈసారి కాంగ్రెస్‌కే ఓటేయాలని నిర్ణయించుకున్నాం..’ఇది ఇటీవల క్షేత్ర పరిశీలనలో పరిగి, తాండూరు లాంటి ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లు ‘సాక్షి’తో చెప్పిన మాట. దానికి తగ్గట్టే ఇప్పుడు ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ముస్లింల ప్రాబల్యం ఉన్న చోట్ల కాంగ్రెస్ గెలిచింది.

ఆ ప్రచారమే కారణమా?

‘ముస్లింలలో సింహభాగం గతంలో కాంగ్రెస్ పక్షానే నిలిచేవారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారి తీరు మారింది. కేసీఆర్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి చర్యలు తీసుకోవటంతో వారు బీఆర్ఎస్ వైపు మళ్లారు. అయితే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్–బీజేపీలు కలిసి పోయాయని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే నంటూ కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేస్తూ వచ్చింది. ‘మద్యం కేసు’కు సంబంధించి కవిత విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరు, ఎన్డీయేలో చేరతానంటూ కేసీఆర్ స్వయంగా తన వద్దకు వచ్చారని ప్రధాని మోదీ పేర్కొనటం, బీజేపీ తీసుకొచ్చిన కొన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలపటం.. లాంటి విషయాలను కాంగ్రెస్ జనంలోకి బలంగా తీసుకెళ్లింది. బీఆర్ఎస్–బీజేపీ దోస్తీ అంటూ ఆ పార్టీ చేసిన ప్రచారాన్ని ముస్లింలు నమ్మారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే హైదరాబాద్ వరకు మాత్రం బీఆర్ఎస్ వైపే నిలిచారని పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ముస్లింలు క్రమంగా కాంగ్రెస్‌కు చేరువవుతున్న తీరును గుర్తించే రేవంత్‌రెడ్డిపై ఆర్ఎస్ఎస్ ముద్ర వేసే ప్రయత్నం ఒవైసీ చేశారని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ మత కలహాలు పెరుగుతాయంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమేనని అంటున్నారు.

సాధికార మహోత్సవం

ప్రజల ఆదరాభిమానాలతో రాప్తాడులో దిగ్విజయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభ

సాక్షి,అమరావతి/రాప్తాడు రూరల్: ఫ్యాక్షన్‌ను తోసిరాజని అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికారత నినాదం మార్మోగింది. రాయలసీమ ప్రాంతంలో కీలక నియోజకవర్గం అయిన రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆదరాభిమానాలతో సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం అపూర్వ రీతిలో ఉత్సవంలా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ప్రజలు విజయయాత్ర చేశారు. ముఖ్యంగా మహిళలు కూడా పెద్దసంఖ్యలో తరలిరావడం విశేషం. సీఎం వైఎస్ జగన్ పాలనలో తమకు లభించిన ప్రాధాన్యతను, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు పోటెత్తారు. సీఎం జగన్ నామస్మరణతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరించినప్పుడు ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. ‘జగనన్నే మా భవిష్యత్తు.. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగనే గెలవాలి .. జగనే కావాలి’ అంటూ ఒకే గళమై నినదించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

‘కారు’ ఓటమికి కారణాలెన్నో!

- పోటీ చేసిన ఎమ్మెల్యేలపై ప్రజాగ్రహం
- కొంపముంచిన నాయకుల అతివిశ్వాసం
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారులూ కరుణించలే..
- ఓడిన బీఆర్ఎస్ అభ్యర్థుల్లో అంతర్మథనం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో అంతర్మథనం మొదలైంది. నిత్యం ప్రజాజీవనంలో ఉంటున్నామని చెప్పుకునే సీనియర్ నాయకులకు సైతం ఈ ఎన్నికలు చేదు అనుభవాన్నే మిగల్చడం ప్రజా వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాటి టీఆర్ఎస్ వరుసగా రెండు ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు సాధించింది. ప్రత్యేక సంక్షేమ పథకాల లబ్ధిదారులు ప్రతీచోట ఉన్నారని లెక్కలు వేసుకుని ఓటుబ్యాంకుగా నమ్మకం పెట్టుకున్నారు. తొమ్మిదిన్నరేళ్ల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. ఎన్నికలకు ముందే ఈ పరిస్థితి అంచనా వేయలేకపోవడంతో అపజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. అధికార పార్టీలో ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను సరిగా అంచనా వేయలేకపోయారు. క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తి ప్రతిపక్షాలకు ఓట్లు తెచ్చి మేలు చేసింది. కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలపై అవినీతి, కమీషన్లు, అక్రమదందాల ఆరోపణలే కొంపముంచాయి. ఉదాహరణకు చెన్నూరు నియోజకవర్గంలో బాల్క సుమన్ పేరు చెప్పి చేసిన దందాలు ఈ ఎన్నికల్లో చావు దెబ్బతీశాయి. కేవలం నెల రోజుల ముందే బీజేపీని వదిలి కాంగ్రెస్‌లో చేరి ఎన్నికల బరిలో దిగిన మాజీ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ 37వేలకు పైగా మెజార్టీ సాధించి సత్తా చాటారు. ఎంతో అభివృద్ధి చేశానని చెప్పుకునే చెన్నూరు ఎమ్మెల్యేకు ప్రతీ పోలింగ్ కేంద్రం నుంచి ఆశించిన మేర ఓట్లు పడలేదు. ఇక నిర్మల్‌లో మంత్రి ఐకే రెడ్డి, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, ముథోల్‌లో విఠల్‌రెడ్డి, మంచిర్యాలలో దివాకర్‌రావు, బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్య, సిర్పూర్‌లో కోనేరు కోనప్పకు ఘోర పరాజయమే మిగిలింది.

బీజేపీతో బీఆర్ఎస్ గెలుస్తుందని..

నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, సిర్పూర్, బోథ్, ఖానాపూర్‌లో బీజేపీ అభ్యర్థులు బలంగా ఉండడంతో అక్కడ పార్టీ మరింత దృష్టి సారించి ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వెళ్లింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అగ్రనేతలు తరలిరావడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి. రెండింటి మధ్య పోటీ జరిగి, బీజేపీ పోటీలో ఉన్న ప్రతీచోట వ్యతిరేక ఓట్లు చీలి బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టెక్కుతారని ఆ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కానీ.. అందుకు భిన్నంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు తగ్గి నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులకే మేలు చేశాయి. సిర్పూర్‌లో బీఎస్పీ ఓట్లు చీల్చింది. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వకుండా ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్, బోథ్‌లో అనిల్‌జాదవ్‌కు అవకాశం ఇవ్వగా, బోథ్‌లో మాత్రమే గెలిచారు. ఆసిఫాబాద్‌లో ఆత్రం సక్కు గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిస్తే, టీఆర్ఎస్ నుంచి కోవ లక్ష్మీ స్వల్ప తేడాతో ఓడిపోయారు. తర్వాత సక్కు బీఆర్ఎస్‌లో చేరినా.. ఈ ఎన్నికల్లో కోవ లక్ష్మీకే టికెట్ దక్కింది. చివరకు ఆమెనే మళ్లీ గెలిపించారు.

సొంత కార్యకర్తలే వేయలేదా?

చాలాచోట్ల బీఆర్ఎస్ కార్యకర్తలమని చెప్పుకుని, పార్టీలో రిజిష్టర్ అయిన వాళ్లు సైతం ఓట్లు వేయలేనట్లుగా తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఉన్న కోపం ఓట్ల రూపంలో వెల్లడయ్యాయి. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా వేల కొద్దీ సభ్యత్వాలు చేశారు. గడిచిన పదేళ్లలో రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వాలు చేయించారు. వా రందరూ ఓట్లు వేసినా, గులాబీ పార్టీకి కనీస ఓట్లు రావాల్సి ఉంది. చాలా పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్షాలకే అధిక ఓట్లు రావడంతో వీరంతా సొంత పార్టీకి ఓట్లు వేశారా? లేదా? అనే సందేహాలు వస్తున్నాయి.

జీవన్‌రెడ్డి ఓడినా.. పదవి యోగం!



జీవన్‌రెడ్డి

జగిత్యాలజోన్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి పదవీకాలం 2025 మే వరకు ఉండటంతో.. ఆయనకు పదవి యోగం వచ్చే అవకాశముందని జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. శాసన మండలిలో కాంగ్రెస్ తరఫున ఏకైక ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఉండటంతో.. జీవన్‌రెడ్డిని శాసన మండలి నాయకుడిగా చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు కొత్తగా ఎన్నికైన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో దాదాపు సగం మంది కొత్తవారు కావడంతో.. ప్రభుత్వంపై పట్టు ఉండే అవకాశం లేదు. దీంతో సీనియర్ నాయకుడితో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలు, సాగునీటి వ్యవస్థపై మంచి పట్టున్న జీవన్‌రెడ్డికి వ్యవసాయ మంత్రి పదవిస్తే.. అసెంబ్లీలో బలంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీ ప్రతిపక్షాల నుంచి వచ్చే మాటల దాడులను తిప్పికొట్టేందుకు సరైన నాయకుడు జీవన్‌రెడ్డి అని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 2024 ఏడాదిలో పార్లమెంట్ ఎన్నికలుండటం.. గతంలో కేసీఆర్‌పై రెండుసార్లు ఎంపీగా పోటీ చేయడంతో.. జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపేందుకు సైతం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటినుంచే కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బేస్ ఏర్పాటు చేసుకునేందుకు జీవన్‌రెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకొని.. ఆ రెండు పార్లమెంట్ స్థానాల్లో పట్టు బిగించేందుకు కూడా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. జీవన్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నేను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిని.. నా సేవలు పార్టీకి అవసరమనుకొని ఏ బాధ్యత అప్పగించినా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఏనాడూ పదవుల కోసం తాపత్రయపడలేదని, పదవి వచ్చినా ఒక్కటే, రాకున్నా ఒక్కటేనని, ఎప్పుడూ ప్రజల మధ్యే ప్రజాసేవ కోసం కృషి చేస్తానని ప్రకటించడం విశేషం.

మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

- టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ ఆదేశించారు. కరీంనగర్ విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పాట్ బిల్లింగ్, డీలిస్టు ఆపరేషన్, వర్క్ ఆర్డర్స్ క్లోజింగ్, లింకింగ్ ఆన్ అగ్రికల్చరల్ టు డొమెస్టిక్, విద్యుత్ సరఫరా, డీటీఆర్‌ల ఫెయిల్యూర్, టీఎస్ఐపాస్, వ్యవసాయ విద్యుత్ సరఫరా అంశాలపై కరీంనగర్ రూరల్, టౌన్, హుజూరాబాద్ డివిజన్ల అధికారులతో చర్చించారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఏవో ఎ.రాజేశం, డీఈలు చంద్రమౌళి, జె.రాజం, ఎం.తిరుపతి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, ఏడీఈలు నరేందర్, సుధీర్‌కుమార్, అంజయ్య, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, లావణ్య, స్వప్న, ప్రశాంత, ఏఈలు పాల్గొన్నారు.

నెరవేరిన కల..

- పద్నాలుగేళ్లకు ఆదిని వరించిన విజయం
- మొదటి నుంచే ముందడుగు వేసిన శ్రీనివాస్
- నియోజకవర్గంలో కాంగ్రెస్ సంబరాలు

వేములవాడ: వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఆది శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మారుమూల ప్రాంతం, నక్సలైట్ల ప్రాబల్యం, గ్రామీణ వాతావరణం, వ్యవసాయమే ప్రధానాధారంగా ఉన్న ఈ ప్రాంతం నుంచి గ్రామస్థాయి నుంచి మొదలుకొని మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోస్టుల్లోనూ పని చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీగా విధులు నిర్వహించడమే కాకుండా వైఎస్సార్‌కు అత్యంత ప్రియ శిష్యుడిగా పేరున్న ఆది శ్రీనివాస్ రాజన్న ఆలయ చైర్మన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. అప్పటి నుంచి రాజకీయంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. 2009లో వేములవాడ నియోజకవర్గంగా ఏర్పడిన అనంతరం మొదటిసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమి చెందారు. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పక్షాన పోటీ చేసి ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బీఫామ్ అందకపోవడంతో బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇలా నాలుగుసార్లు ఓటమి చెందినా కుంగిపోకుండా పట్టు వదలని విక్రమార్కుడిగా పోరాటం చేస్తూనే ఉన్నారు. రమేశ్‌బాబుపై పౌరసత్వం కేసును సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లారు. చివరికి ఈ అంశమే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో టికెట్ కేటాయించకుండా చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు కేటాయించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఆది శ్రీనివాస్(ఫైల్)

14,581 ఓట్ల మెజారిటీ..

పద్నాలుగేళ్ల నిరీక్షణ, పోరాటం అనంతరం ఎట్టకేలకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా 14,581 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలోనూ వంద నుంచి 200 మందిని పేరుతో పలకరించే సత్తా ఉన్న ప్రజల నాయకుడిగా పేరు గడించారు. మంచిచెడులకు ప్రజల వద్దకు చేరుకొని తనలోని మంచితనాన్ని చాటి చెప్పారంటూ జనం చెప్పుకుంటున్నారు. నాలుగుసార్లు ఓటమి చెందడంతో పెరిగిన సానుభూతి, ఇద్దరు వెలమ సామాజికవర్గానికి చెందినవారు మాత్రమే కాకుండా నాన్‌లోకల్ వాళ్లనే భావన ముందునుంచే పెరిగిపోవడంతో ఆది గెలుపునకు దోహదపడ్డాయి. ఎట్టకేలకు పద్నాలుగేళ్ల తర్వాత ఆది శ్రీనివాస్‌కు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం జనం కల్పించారు. ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్లిపోవడంతో ఆది రాక కోసం పార్టీ శ్రేణులు, అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదికి మంత్రి పదవి వస్తుందన్న అంశాలు మీడియాలో చూసి మరింత ఆనందపడిపోతున్నారు.

ఆది నుంచే..

వేములవాడ నియోజకవర్గంలోని 260 బూత్‌ల్లో ఆది నుంచి శ్రీనివాస్‌కు ఓట్లు పెరుగుతూనే వచ్చాయి. మొత్తంగా 19 రౌండ్లలో కేవలం నాలుగు రౌండ్లు మినహా మిగతా రౌండ్లలో ఆదికే ఆధిక్యం కనిపించింది. దీంతో సునాయాసంగా ఆదిని గెలుపు వరించింది. మిగతా అభ్యర్థులు రూ.కోట్లు గుమ్మరించినా ఆదిని అడ్డుకోలేకపోయారని జనం చర్చించుకుంటున్నారు.

సెంటిమెంట్‌కు బ్రేక్

వేములవాడ రాజన్న గుడి చైర్మన్ పదవి చేసిన వాళ్లకు రాజకీయ భవిష్యత్తు ఉండదంటూ నిన్నటివరకు ఉన్న అపవాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ అపవాదుకు బ్రేక్ వేసింది. రాజన్న గుడి చైర్మన్‌గా రెండు పర్యాయాలు విధులు నిర్వహించిన ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఆ సెంటిమెంట్‌ను బ్రేక్ చేశారు. గతంలోనూ వేములవాడ రాజన్నను దర్శించుకున్న వారి పదవులు ఊడతాయంటూ ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు పెద్ద నాయకులు వచ్చి వెళ్లినా తిరిగి పదవులు వరించడంతో.. అప్పట్లో ఉన్న ఈ అపవాదుకు బ్రేక్ పడినట్లయింది.

భారత రాయబారితో వీసీ భేటీ



భేటీ అయిన వీసీ వెంకటరమణ

భైంసా(ముధోల్): హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌లో సోమవారం రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా భారత రాయబారి అజనీష్‌కుమార్‌తో బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ భేటీ అయ్యారు. ఎస్టోనిక్ విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీ సంయుక్తంగా పరిశోధన, ఉపాధి అవకాశాలు పెంపొందించే కోర్సుల గురించి చర్చించారు. ఎస్టోనియ విశ్వవిద్యాలయాలు ఆరు నెలల నుంచి ఆరేళ్ల వరకు వ్యవధి గల పలు కోర్సులను అందిస్తున్నాయన్నారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు జరిపినట్లు వీసీ తెలిపారు.

పడవెక్కిన స్కూటీ!



మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న పెన్‌గంగ దాటేందుకు భీంపూర్ మండలవాసులకు తిప్పలు తప్పట్లేదు. ఇక్కడి వారికి పొరుగున ఉన్న మహారాష్ట్ర వారితో ఎక్కువ బంధుత్వాలు ఉన్నాయి. నిత్యం రాకపోకలు చేస్తుంటారు. అయితే నదిపై వారధి లేకపోవడంతో నాటుపడవలపై ఇలా ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోంది. సోమవారం ఓ ద్విచక్ర వాహన యజమాని తనతో పాటు స్కూటీని ఇలా పడవలో తీసుకెళ్తుండగా కనిపించిన దృశ్యమిది. – తాంసి

రిపోర్ట్



అయినా భర్త మారలేదు

**ఎన్ని కథలు రాసినా
ఎన్ని సినిమాలు తీసినా
ఎన్ని చట్టాలు చేసినా
హింస వల్ల భార్యాభర్తల బంధానికి
ఎంత గట్టి దెబ్బ తగులుతుందో
వార్తల ద్వారా నిత్యం చదువుతున్నా
భర్త మాత్రం మారడం లేదు.
'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో'
(ఎన్.సి.ఆర్.బి.)
డిసెంబర్ 3న విడుదల చేసిన
తాజా నివేదికలో
భార్యల మీద భర్తల హింస
2021తో పోలిస్తే 2022లో
ఇంకా పెరిగిందని తెలిపింది.
ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడే
రోజున వచ్చిన ఈ నివేదిక
ఎన్ని ప్రభుత్వాలు మారినా మగాణ్ణి
మార్చలేకపోతున్నాయన్న
కఠోర సత్యాన్ని ముందుకు తెచ్చింది.**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న డిసెంబర్ 3వ తేదీన 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్.సి.ఆర్.బి.) ఏటా దేశంలో జరిగే నేరాలపై ఇచ్చే వార్షిక నివేదికను 2022 సంవత్సరానికి విడుదల చేసింది. 2022లో జరిగిన అన్ని నేరాల్లో భార్యలపై భర్తలు నెరపిన హింసాత్మక చర్యల కేసులే ప్రథమ స్థానంలో నిలిచాయని ఈ నివేదిక చెప్పింది. అంటే పెద్ద చదువులు, భారీ జీతాల ఉద్యోగాలు, చట్టాలు, సంఘపరమైన మర్యాదలు... ఏవీ మగాణ్ణి మార్చలేకపోతున్నాయని అతడు రోజురోజుకూ మరింత తీసికట్టుగా తయారవుతున్నాడని ఈ నివేదిక వల్ల అర్థమవుతోంది. తానే సర్వాధికారి అన్నట్టుగా ఇంటి యజమాని స్థానంలో ఉంటూ భార్యతో హింసాత్మకంగానే వ్యవహరిస్తున్నాడు. 'ఇది మగ సమాజం' అని మగవాడు భావించడమే ఇందుకు కారణం. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎంత మంది స్త్రీలకు సీట్లు దక్కాయో, ఎంతమంది స్త్రీలు గెలిచారో గమనిస్తే అవును.. ఇది మగసమాజం అనుకోకుండా ఉండగలరా ఎవరైనా? కాబట్టి ఎన్నికల ఫలితాల రోజే ఈ నివేదిక వెలువడటం యాదృచ్ఛికం కాదు.

> **4,45,256 కేసులు**
> 2022లో స్త్రీలకు జరిగిన హానిపై దేశ వ్యాప్తంగా 4,45,256 కేసులు నమోదయ్యాయి. 2021 కంటే 2022లో ఈ నేరాలు 4 శాతం పెరిగాయి. అయితే ఈ మొత్తం నాలుగున్నర లక్షల కేసుల్లో ప్రథమ స్థానం వహించినవి భార్య మీద భర్త, అతని సంబంధీకులు చేసిన హింసకు సంబంధించినవే కావడం గమనార్హం. రెండవ స్థానం వహించిన కేసులు స్త్రీల కిడ్నాప్. మూడవ స్థానంలో నిలిచిన కేసులు స్త్రీ గౌరవానికి భంగం కలిగించే చర్యలు. నాల్గవ స్థానంలో నిలిచినవి అత్యాచారాలు. అంటే భర్త, కుటుంబ సభ్యుల సంస్కార స్థాయి మెరుగ్గా ఉండి స్త్రీని గౌరవించే విధంగా ఉంటే దాదాపు సగం కేసులు ఉండేవే కావు.

పిల్లలూ బాధితులే

ఈ నివేదికలో మరో బాధాకరమైన వాస్తవం ఏమిటంటే దేశంలో 2022లో స్త్రీల తర్వాత అత్యధికమైన కేసులు నమోదైనవి బాలలకు జరిగిన హానిపై నమోదైనవే. 2022లో పిల్లలపై హింసకు సంబంధించి 1,62,449 కేసులు నమోదయ్యాయి. వీటిలో సగానికి సగం కిడ్నాపులు. మిగిలినవి పోక్సో కేసులు. వీటిలో పిల్లలపై జరిగిన లైంగిక అసభ్యతతో పాటు అత్యాచారాలు కూడా ఉన్నాయి. గమనించాల్సిన సంగతి ఏమిటంటే భార్యాభర్తల మధ్య హింస చోటు చేసుకుంటున్నప్పుడు పిల్లలపై శ్రద్ధ పెట్టే అవకాశం తక్కువ. లేదా తల్లిదండ్రుల తగాదాలను చూసి ఇల్లు వీడే పిల్లలు, ఇంట్లో ఉండలేక వేరే చోట ఆడుకోవడానికి వెళ్లి లైంగిక దాడులకు గురయ్యే పిల్లలు అధికంగా ఉంటారు. అంటే గృహహింస వల్ల కేవలం స్త్రీలే కాక పిల్లలు కూడా బాధితులవుతున్నారని తెలుసుకోవాలి. 2022లో స్త్రీలపై, పిల్లలపై జరిగిన నేరాల తర్వాత 60 ఏళ్ల దాటిన వృద్ధులపై ఎక్కువ నేరాలు జరిగాయి. అంటే మన దేశంలో స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఎక్కువగా హింసను ఎదుర్కొంటున్నారు.

భర్తలూ మారాలి

వివాహం అంటే స్త్రీ పురుషులు కలిసి నడవాల్సిన సమాన వేదిక అనే భావన ఇంకా పురుషుడికి ఏర్పడకపోవడమే స్త్రీలపై నేరాలకు ప్రధాన కారణం. పెళ్లి ద్వారా తనకు భార్య అనే బానిస లేదా సేవకురాలు లేదా తాను అదుపు చేయదగ్గ మనిషి అందుబాటులోకి రాబోతున్నదని పురుషుడు భావిస్తూనే ఉన్నాడు. పైగా 'ఇదంతా మామూలే. తాతలు తండ్రులు చేసిందే నేనూ చేస్తున్నాను' అని తాను నమ్మడమే కాక 'మీ నాన్న మీ తాత చేస్తున్నదే నేనూ చేస్తున్నాను' అని భార్యతో అంటున్నాడు. ఇందుకు భార్య అభ్యంతరం పెడితే, తన నిర్ణయాలను వ్యతిరేకిస్తే, మరొక అభిప్రాయం కలిగి ఉంటే ఆమెపై హింస జరుగుతున్నది. భర్త హింస చేయకపోతే అతని సంబంధీకులు ఇందుకు తెగబడుతున్నారు. గాయపరచడం నుంచి హత్య చేయడం వరకు ఈ దాడులు ఉంటున్నాయి.

నమోదైనవి మాత్రమే

ఎన్.సి.ఆర్.బి. ఈ నివేదికను నమోదైన కేసుల ఆధారంగానే ఇస్తుంది. మన దేశంలో ఎంతమంది భార్యలు కేసుల వరకూ వెళతారో ఊహించవచ్చు. పది శాతం స్టేషన్ దాకా వెళితే 90 శాతం ఇంట్లోనే ఉంటూ ఈ హింసను అనుభవిస్తుంటారు. పురుషులను మార్చడానికి సాహిత్యం, సినిమా, సామాజిక చైతన్యం ఎంతో ప్రయత్నం చేస్తున్నాయి. అయినా సరే పురుషుడు మారకపోతే ఎలా? కాఫీ చల్లారిందని, కూర బాగలేదని, కట్నం పేరుతోనో, ఉద్యోగం చేయవద్దనో, మగ పిల్లాణ్ణి కనలేదనో, పుట్టింటికి తరచూ వెళుతోందని, అత్తింటి వారిని అసలు పట్టించుకోవడం లేదనో ఏదో ఒక నెపం వెతికి హింసకు తెగబడితే ఎలా? భర్తలూ ఆలోచించండి.

మల్టీ టాలెంట్



• కవితా శుక్లా

• చిన్నప్పుడు అమ్మమ్మ ఇంట్లో కవితా శుక్లా

అమ్మమ్మ ఇంట్లో వచ్చిన ఐడియా జీవితాన్నే మార్చేసింది!

**సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వెళితే ఏం దొరుకుతుంది?
అంతులేని ఆనందం. అయితే అమెరికా నుంచి ఇండియాలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వచ్చిన కవితా శుక్లాకు ఆనందంతో పాటు 'ఐడియా' కూడా దొరికింది. ఆ ఐడియా ఆమెను ఇన్వెంటర్‌ని చేసింది. ఆ తరువాత ఎంటర్‌ప్రెన్యూర్‌ను చేసింది.
ఇన్వెంటర్, ఎంటర్‌ప్రెన్యూర్, మోటివేషనల్ స్పీకర్, డిజైనర్‌గా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది కవితా శుక్లా...**

చిన్నప్పటి నుంచి సైన్స్, కళలు అంటే కవితకు ఆసక్తి. సైన్స్‌లో రకరకాల ప్రయోగాలు చేసేది. తాను ఇన్నోవేటర్ కావడానికి ఆ ప్రయోగాలు పునాదిగా ఉపయోగపడ్డాయి. పదిహేడు సంవత్సరాల వయసులోనే ఎన్నో పేటెంట్లు తీసుకుంది. 'ఫ్రెష్‌పేపర్' రూపంలో ఆహార వ్యర్థాలను తగ్గించే సాంకేతిక ఆవిష్కరణ కవితకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చింది. ఈ ఫ్రెష్ పేపర్ ఆహారం, కూరగాయలలో బ్యాక్టీరియా, ఫంగస్ పెరుగుదలను నిరోధించి వాటిని ఎక్కువసేపు తాజాగా ఉంచుతుంది. బోస్టన్‌లోని స్థానిక రైతు మార్కెట్‌లో ఫ్రెష్ పేపర్ లాంచ్ చేశారు. మౌత్‌టాక్‌తోనే ఈ పేపర్ పాపులర్ అయింది.

ప్రస్తుతం ఈ ఫ్రెష్‌పేపర్ 180 దేశాల్లో అందుబాటులో ఉంది. 'యూఎస్‌లో ఆహార వృథా అనేది ఇంత పెద్ద సమస్య అని తెలియదు. ఫ్రెష్ పేపర్‌కు వచ్చిన స్పందన నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. పండ్లు, కూరగాయలు, ఆహారాన్ని తాజాగా ఉంచడానికి తద్వారా ఆరోగ్యంగా ఉండడానికి ఇది ఉపయోగపడుతుంది. లోకల్‌ఫుడ్ బ్యాంకులకు వీటిని విరాళంగా ఇచ్చాం' అంటుంది కవిత.

ఫుడ్ ప్రిజర్వేషన్‌కు సంబంధించిన ఆసక్తి కవితలో పదమూడు సంవత్సరాల వయసు నుంచే మొదలైంది. సెలవులు వచ్చినప్పుడు ఇండియాలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది కవిత. ఒకరోజు పొరపాటున కలుషితమైన నీరు తాగింది. ఆందోళన పడిన అమ్మమ్మ వెంటనే కవితతో ఏదో కషాయం తాగించింది. దీంతో కవితకు ఏమీ కాలేదు. అమెరికాకు తిరిగిన వచ్చిన తరువాత కషాయంలో అమ్మమ్మ ఉపయోగించిన పదార్థాల గురించి వివరంగా తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఆహారపదార్థాలు, కూరగాయలు చెడిపోకుండా సంరక్షించడానికి సంబంధించిన పరిశోధనలు మొదలుపెట్టింది.

జర్మనీలో పుట్టిన కవిత ఇలియట్ సిటీ (యూఎస్)లో పెరిగింది. హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పుచ్చుకుంది.

'సింపుల్ ఐడియాలకు మార్పు తెచ్చే శక్తి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఉపయోగించవచ్చు' అంటుంది కవిత.

ఆహార భద్రత, సంరక్షణకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్న విశిష్ట వ్యక్తులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న కవిత మోటివేషనల్ స్పీకర్ కూడా. ఎన్నో కాలేజీలలో, సమావేశాలలో యువతను ఉద్దేశించి ఉత్తేజకరమైన ప్రసంగాలు చేసింది. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు అందుకుంది. ఫోర్బ్స్ '30 అండర్ 30: సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్స్' టైమ్ మ్యాగజైన్ '5 మోస్ట్ ఇనోవేటివ్ ఉమెన్ ఇన్ ఫుడ్' న్యూస్‌వీక్ '125 ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్' జాబితాలలో చోటు సంపాదించింది. రెండు సంవత్సరాల క్రితం వర్జీనియాలో జరిగిన వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ఇండిపెంటెంట్ ఇన్వెంటర్‌లు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రొఫెషనల్స్ సమావేశంలో కీలక ఉపన్యాసం ఇచ్చింది.

ఇన్వెంటర్ అయిన కవిత 'ఫ్రెష్ గ్లో' కంపెనీతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా అద్భుత విజయం సాధించింది.

'మీకు ఏదైనా ఆసక్తిగా అనిపిస్తే దాని గురించి లోతుగా ఆలోచించండి. ఆ తరువాత పరిశోధించండి. ఫలితాలు చేతికి అందేవరకు ప్రయోగాలు చేయండి' అంటుంది కవిత.



> **ఆలోచించండి... అద్భుతాలు చేయండి**
> కష్టాల దారిలో ప్రయాణించి విజయాలు సాధించిన ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం. వారి గురించి సమావేశాల్లో చెబుతుంటాను. వారి విజయగాథలు ఎంతో మందికి స్ఫూర్తిని ఇస్తాయి. ఆలోచిస్తే ఐడియాలు వస్తాయి. ఆ ఐడియాలతో ఎన్ని గొప్ప పనులైనా చేయవచ్చు. మన ఐడియాను మొదట ఇతరులతో పంచుకోవడానికి భయంగా అనిపిస్తుంది. ఆ భయాన్ని వదులుకొని ఆత్మవిశ్వాసంతో చెప్పండి. ఆత్మవిశ్వాసం ఉన్న చోటుకి విజయం త్వరగా వస్తుంది.
> **- కవితా శుక్లా,**
> ఫ్రెష్ గ్లో కంపెనీ ఫౌండర్, సీయీవో

నేడు
ప్రపంచ నేలల దినోత్సవం



వాతావరణ మార్పు వల్ల కరువు, వరదలు, అధిక ఉష్ణోగ్రతలు విరుచుకుపడుతున్న నేపథ్యం ఇది. పంటల సాగు, పశుపోషణ, ఆక్వా సాగులో రైతులు అనేక కష్టనష్టాలకు గురవుతున్న కలికాలం. మనతో పాటు సకల జీవరాశి మనుగడకు నేల, నీరే మూలాధారాలు. నేలను, నీటిని ప్రాణప్రదంగా పరిరక్షించుకుంటూనే సేద్యాన్ని కొనసాగించేలా ఐక్యరాజ్యసమితికి చెందిన వ్యవసాయ ఆహార సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రజలు, రైతులను చైతన్యవంతం చేస్తూ పాలకులకు దిశానిర్దేశం చేస్తూ ఉంటుంది. రసాయనాల్లేకుండా, లోతుగా దుక్కి దున్నకుండా, ఒకటికి నాలుగు పంటలు కలిపి వేసుకోవటం ద్వారా పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను అనుసరించటం ద్వారా నేలను, నీటిని సంరక్షించుకోవటం సాధ్యమవుతుందని సమాజంలో ప్రతి ఒక్కరం గుర్తించాల్సిన తరుణం ఇది. మానవాళికి 95% ఆహారాన్ని అందిస్తున్న నేలలను పరిరక్షించుకోవాలన్న స్ఫూర్తిని కలిగించడానికి ప్రతి ఏటా డిసెంబర్ 5వ తేదీన ప్రపంచ నేలల లేదా భూముల దినోత్సవాన్ని ఎఫ్.ఎ.ఓ. నిర్వహిస్తోంది. ఈ ఏడాది నినాదం: 'నేల, నీరే జీవరాశి అంతటికీ జీవనాధారం'! ఎఫ్.ఎ.ఓ. ఇంకా ఏం చెబుతోందో చదవండి..

సాగుబడి
జ్యేష్ఠ కార్తె:
డిసెంబర్ 15 వరకు



మనకు 95 శాతం ఆహారాన్ని నేలలే అందిస్తున్నాయి. జల శక్తికి జేజేలు.

అతిగా దుక్కి చేస్తూ ఉంటే.. పంటలతో గానీ/ గడ్డీ గాదంతో గానీ ఆచ్ఛాదన కల్పించకపోతే నేల త్వరగా పొడిబారుతుంది. నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని 40% మేరకు కోల్పోతుంది.

తేమను నిలుపుకునే సామర్థ్యం కోల్పోయిన నేల పొడిబారుతుంది. వానకు, గాలికి ఎక్కువగా కొట్టుకుపోతుంది. ఇసుక/ దుమ్ము తుపాను గాలులకు అతిగా కోతకు గురవుతుంది. నిస్సారమవుతుంది.




నేల నీరే జీవనాధారం!



infographics courtesy: UNFAO

నేలను, నీటిని వాడుకునే సామర్థ్యాన్ని మనం చాలా మెరుగు పరచుకోవాల్సి ఉంది.










ఆరోగ్యవంతమైన నేల వాన నీటిని అధికంగా పీల్చుకుంటుంది. వడపోసి, శుద్ధి చేసి మరీ భూగర్భంలో నిల్వచేస్తుంది.





8-10 తేదీల్లో విశాఖ ఆర్గానిక్ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. విశాఖలో జరుగుతున్న నాలుగో వార్షిక ఆర్గానిక్ మేళా ఇది. 8న ఉ. 10 గంటలకు రైతుల సమ్మేళనం, 9న గ్రాడ్యుయేట్ రైతుల సదస్సు, 10న ఇంటిపంటలపై సదస్సు, 11న సేంద్రియ ఉత్పత్తుల వ్యాపారుల చర్చాగోష్ఠి జరుగుతుందని నిర్వాహకులు కుమారస్వామి తెలిపారు. వివరాలకు.. 78934 56163, 86862 24466.

9, 10 తేదీల్లో సుందర రామన్ శిక్షణ

తమిళనాడుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఎస్.ఆర్. సుందర రామన్ డిసెంబర్ 9,10 తేదీల్లో సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కామ్యవనంలో రైతులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రసాయనాలతో సాగుచేస్తున్న భూమిని ప్రకృతి వ్యవసాయంలోకి ఎలా మార్చాలి? నేలలో సేంద్రియ కర్బనం ఎలా పెంచాలి? ఉద్యాన పంటలకు పిచికారీ లేకుండా సమగ్ర పోషకాలు ఎలా అందించాలి? వంటి అనేక ప్రకృతి సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ముందస్తు రిజిస్ట్రేషన్ల వివరాలకు.. 94495 96039, 99490 94730.

11న ప్రకృతి సేద్య కార్యకర్తల సమావేశం

ప్రముఖ ప్రకృతి సేద్య నిపుణులు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ డిసెంబర్ 11న ఉ.10 నుంచి. మ.1 గం. వరకు హైదరాబాద్ దోమల్‌గూడలోని రామచంద్రమిషన్‌లో ప్రకృతి వ్యవసాయ వ్యాప్తికి కృషి చేసే కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ముచ్చటిస్తారు. పర్యావరణ సంక్షోభం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని స్వతంత్ర ఉద్యమంగా గ్రామస్థాయిలో రైతుల్లో విస్తరింపజేయటంపై చర్చిస్తారు. వివరాలకు.. సేవ్ స్వచ్ఛంద సంస్థ: 63091 11427.

14 నుంచి పల్లెసృజన శోధాయాత్ర

ప్రకృతితో మమేకమై జీవించే గ్రామీణులు ముఖ్యంగా రైతులు, వృత్తిదారులు, కళాకారుల విజ్ఞానాన్ని తెలుసుకోవటం.. అజ్ఞాతంగా మిగిలిపోయిన గ్రామీణ ఆవిష్కరణలను వెలికితేవటమే లక్ష్యంగా పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ శోధాయాత్రలు నిర్వహిస్తోంది. 47వ చిన్న శోధాయాత్ర అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి వెంకట రాజంపేట వరకు డిసెంబర్ 14 నుంచి 17 వరకు జరుగుతుంది. వలంటీర్లు కాలినడకన పయనిస్తూ ప్రజలతో ముచ్చటిస్తారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకొని యాత్రలో పాల్గొనవచ్చు. వివరాలకు.. బ్రిగేడియర్ పి.గణేశం – 98660 01678, 99666 46276, 99859 19342.

15న పాలేకర్ ఫైవ్ లేయర్ క్షేత్ర సందర్శన


వికారాబాద్ జిల్లా ధారూరు మండలం బూరుగడ్డ గ్రామంలో సేవ్ స్వచ్ఛంద సంస్థ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిలో అభివృద్ధి చేసిన ఐదు అంతస్థుల ఉద్యాన పంటల నమూనా క్షేత్రాన్ని డిసెంబర్ 15 (శుక్రవారం)న ఉ. 10.–సా.5 వరకు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ సందర్శిస్తారు. ప్రతి అంశం వెనుక గల శాస్త్రీయతను పాలేకర్ వివరిస్తారు. 4 రాష్ట్రాల రైతులు పాల్గొంటున్నారు. ప్రసంగం తెలుగు అనువాదం ఉంటుందని విజయరామ్ తెలిపారు. 3 కి.మీ. నడవగలిగిన వారే రావాలి. భోజన ఏర్పాట్లు ఉన్నాయి. నేరుగా వచ్చే వారికి ప్రవేశ రుసుం రూ. 100. హైదరాబాద్ రామకృష్ణమిషన్ దగ్గర గల సేవ్ కార్యాలయం నుంచి బస్సులో వెళ్లే వారికి రూ. 500. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వివరాలకు.. 63091 11427.



గుకేశ్‌కు రెండో విజయం

లండన్ చెస్ క్లాసిక్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ రెండో విజయం సాధించాడు. ఆండ్రీ వొలోకితిన్ (ఉక్రెయిన్)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో తమిళనాడుకు చెందిన గుకేశ్ 28 ఎత్తుల్లో గెలుపొందాడు. అంతకుముందు తొలి గేమ్‌లో గుకేశ్ 41 ఎత్తుల్లో మాటెజ్ బార్టెల్ (పోలాండ్)పై నెగ్గి, వితిగోవ్ (ఇంగ్లండ్)తో జరిగిన రెండో గేమ్‌ను 78 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పదిమంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో విజేతకు 15 వేల పౌండ్లు (రూ. 15 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

భారత బాక్సర్లకు మూడు రజతాలు



ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు హార్దిక్ (80 కేజీలు), అమిశా (54 కేజీలు), ప్రాచీ (80 ప్లస్ కేజీలు) రజత పతకాలు నెగ్గారు. అర్మేనియాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఫైనల్స్‌లో హార్దిక్ 2–3తో అశురోవ్ (రష్యా) చేతిలో, అమిశా 0–5తో అయాజాన్ (కజకిస్తాన్) చేతిలో, ప్రాచి 0–5తో షఖోబిద్దినొవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయారు. మరో తొమ్మిది విభాగాల్లో భారత బాక్సర్లు ఫైనల్లో పోటీపడనున్నారు.



పుణేరి పల్టన్ బోణీ

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గత సీజన్ రన్నరప్ పుణేరి పల్టన్ సంచలనంతో బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37–33 పాయింట్ల తేడాతో గెలిచింది. తద్వారా గత సీజన్ ఫైనల్లో జైపూర్ చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. పుణేరి పల్టన్ జట్టు తరఫున కెప్టెన్ అస్లమ్ ముస్తఫా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పది పాయింట్లు సాధించాడు. రెయిడర్ మోహిత్ గోయట్ ఎనిమిది పాయింట్లతో... మొహమ్మద్ రెజా ఐదు పాయింట్లతో రాణించారు. జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ 17 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా తన జట్టును గెలిపించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32–30తో బెంగళూరు బుల్స్ జట్టును ఓడించింది. బెంగాల్ తరఫున రెయిడర్లు భరత్ (6 పాయింట్లు), నీరజ్ నర్వాల్ (5 పాయింట్లు), విశాల్ (4 పాయింట్లు) ఆకట్టుకున్నారు. బెంగళూరు జట్టు కెప్టెన్ మణీందర్ సింగ్ 11 పాయింట్లతో మెరిసినా ఫలితం లేకపోయింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	2	2	0	0	10
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
యు ముంబా	1	1	0	0	5
బెంగాల్ వారియర్స్	1	1	0	0	5
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
యూపీ యోధాస్	1	0	1	0	1
జైపూర్ పింక్ పాంథర్స్	1	0	1	0	1
తెలుగు టైటాన్స్	1	0	1	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

టైటిల్ లక్ష్యంగా బరిలోకి...

- నేటి నుంచి జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్ టోర్నీ
- తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ 'ఢీ'



కౌలాలంపూర్: మూడోసారి విశ్వవిజేతగా నిలవాలనే లక్ష్యంతో... నేటి నుంచి మొదలయ్యే జూనియర్ పురుషుల అండర్–21 హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. పూల్ 'సి'లో భాగంగా నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో ఉత్తమ్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్ తర్వాత భారత జట్టు గురువారం స్పెయిన్‌తో రెండో మ్యాచ్‌ను... శనివారం కెనడాతో మూడో మ్యాచ్‌ను ఆడుతుంది. ఈనెల 16 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పోటీపడుతున్నాయి. జట్లను నాలుగు పూల్స్‌గా విభజించారు. పూల్ 'ఎ'లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ, మలేసియా... పూల్ 'బి'లో ఈజిప్ట్, ఫ్రాన్స్, జర్మనీ, దక్షిణాఫ్రికా... పూల్ 'డి'లో బెల్జియం, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్తాన్ జట్లున్నాయి. ఈనెల 9న లీగ్ మ్యాచ్‌లు ముగిశాక ఆయా పూల్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. క్వార్టర్ ఫైనల్స్ 12న, సెమీఫైనల్స్ 14న, ఫైనల్ 16న జరుగుతాయి. ఈ టోర్నీ మ్యాచ్‌లను స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. 44 ఏళ్ల చరిత్ర కలిగిన జూనియర్ ప్రపంచకప్‌లో భారత జట్టు రెండుసార్లు (2001, 2016) టైటిల్స్ సాధించి, ఒకసారి రన్నరప్‌గా (1997) నిలిచింది.

భారత జట్టు: ఉత్తమ్ సింగ్ (కెప్టెన్), అరైజిత్ సింగ్ (వైస్ కెప్టెన్), ఆదిత్య, సౌరభ్, సుదీప్, బాబీ సింగ్, మోహిత్, రణ్‌విజయ్, శార్దానంద్, అమన్‌దీప్ లాక్రా, రోహిత్, సునీల్, అమీర్ అలీ, విష్ణుకాంత్, పూవణ్ణ, రాజిందర్ సింగ్, అమన్‌దీప్, ఆదిత్య సింగ్.

వన్డే కెప్టెన్‌గా మార్క్‌రమ్

భారత్‌తో సిరీస్‌కు దక్షిణాఫ్రికా జట్ల ప్రకటన



జొహన్నెస్‌బర్గ్: భారత్‌తో సొంతగడ్డపై మూడు ఫార్మాట్‌లలో జరిగే సిరీస్‌ల కోసం దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తమ జట్లను ప్రకటించింది. వన్డే ప్రపంచకప్‌లో సఫారీ టీమ్‌కు సారథిగా వ్యవహరించిన తెంబా బవుమా, పేసర్ కగిసో రబాడలకు వన్డే, టి20 సిరీస్‌ల నుంచి విశ్రాంతి కల్పించింది. దాంతో ప్రస్తుతం టి20 టీమ్ కెప్టెన్‌గా ఉన్న ఎయిడెన్ మార్క్‌రమ్ వన్డే జట్టుకు కూడా నాయకత్వం వహిస్తాడు. తొలి రెండు టి20లకు మాత్రమే అందుబాటులో ఉండే కొయెట్జీ, జాన్సెన్, ఎన్‌గిడిలతో పాటు బవుమా, రబాడ టెస్టు సిరీస్ కోసం సన్నద్ధమయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సఫారీ బోర్డు వెల్లడించింది. డేవిడ్ బెడింగమ్, ట్రిస్టన్ స్టబ్స్, నాండ్రె బర్జర్‌కు తొలిసారి టెస్టు జట్టులో స్థానం లభించగా... కీపర్ కైల్ వెరీన్, పేసర్ ఎన్‌గిడి టెస్టుల్లో పునరాగమనం చేశారు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో దక్షిణాఫ్రికాకు ఇదే మొదటి సిరీస్ కానుంది. ఈ పర్యటనలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య 3 టి20లు, 3 వన్డేలు, 2 టెస్టులు జరుగుతాయి.

దక్షిణాఫ్రికా జట్లు: టి20: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రీజ్‌కే, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, బర్జర్, జాన్సెన్, కొయెట్జీ, ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, షమ్సీ, విలియమ్స్, బార్త్‌మన్, ఎన్‌గిడి.

వన్డే: మార్క్‌రమ్ (కెప్టెన్), జోర్జి, హెన్‌డ్రిక్స్, వాన్‌డర్ డసెన్, వెరీన్, క్లాసెన్, మిల్లర్, బర్జర్, ముల్డర్, ఎంపొంగ్వానా, ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, షమ్సీ, విలియమ్స్, బార్త్‌మన్.

టెస్టు: బవుమా (కెప్టెన్), బెడింగమ్, బర్జర్, కొయెట్జీ, జోర్జి, ఎల్గర్, జాన్సెన్, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, ముల్డర్, ఎన్‌గిడి, పీటర్సన్, రబాడ, స్టబ్స్, వెరీన్.

బాబోయ్... భరించలేం!

2026 కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించలేమన్న ఆస్ట్రేలియా



గోల్డ్‌కోస్ట్ (ఆస్ట్రేలియా): బ్రిటిష్ రాజ్యమేలిన దేశాల మధ్య ప్రతి నాలుగేళ్లకోసారి అంగరంగ వైభవంగా జరిగే కామన్వెల్త్ క్రీడలు ఆతిథ్య నగరాలకు గుదిబండగా మారాయి. ఆస్ట్రేలియాలాంటి అభివృద్ధి చెందిన దేశాలే నిర్వహణ పెనుభారంగా భావిస్తున్నాయి. మాకొద్దంటే మాకొద్దని ఘనమైన ఆతిథ్యానికి దూరం జరుగుతున్నాయి. తాజాగా 2026 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించలేమని ఆస్ట్రేలియాకు చెందిన మరో నగరం గోల్డ్‌కోస్ట్ కూడా వైదొలిగింది. రెండేళ్లలో జరిగే ఈ క్రీడల హక్కుల్ని తొలుత ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం దక్కించుకుంది. అయితే క్రీడాగ్రామం నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటు, రవాణా, ఇతరత్రా ఆధునిక సదుపాయాల కల్పన తదితర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని నిర్ధారించుకున్నాక విక్టోరియా ఆతిథ్యం నుంచి తప్పుకుంటున్నట్లు ఈ జూలైలోనే వెల్లడించింది. దీంతో 2018లో ఈ క్రీడల్ని విజయవంతంగా నిర్వహించిన గోల్డ్‌కోస్ట్ మరోసారి ఆతిథ్యమిచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే 700 కోట్ల డాలర్లకు పైగా వ్యయమయ్యే ఈ క్రీడల ఆతిథ్యాన్ని మరోసారి భరించడం కష్టమని వివరిస్తూ గోల్డ్‌కోస్ట్ కూడా ఈ క్రీడల నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలిగింది. ఇతర ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందిగా కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్)కు గోల్డ్‌కోస్ట్ నగర మేయర్ టామ్ టేట్ సూచించారు. ఆస్ట్రేలియా కాకుండా మరో మూడు దేశాలు కామన్వెల్త్ క్రీడల కోసం ఆసక్తి చూపిస్తున్నాయని చెబుతున్నప్పటికీ అనుకున్నట్లుగా 2026లో కామన్వెల్త్ గేమ్స్ జరిగే అవకాశాలు లేవు. ఒకవేళ జరిగితే మాత్రం మరుసటి ఏడాది (2027) జరగొచ్చు.

కృతిక శుభారంభం

జాతీయ అండర్–13 చెస్ టోర్నీ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి బి.కృతిక శుభారంభం చేసింది. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో కృతిక 80 ఎత్తుల్లో బోరెలి సిసిక (తమిళనాడు)పై గెలిచింది. మరో గేమ్‌లో సీనా గోర్లి (ఆంధ్రప్రదేశ్) 36 ఎత్తుల్లో శ్రీధనియా (తమిళనాడు)ను ఓడించింది. దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ (ఎస్‌సీఆర్‌ఎస్‌ఏ) చెస్ సెక్రటరీ ప్రియా అగర్వాల్, అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) అధ్యక్షుడు సంజయ్ కపూర్ ఈ టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 'డబుల్ ఒలింపియన్', ఎస్‌సీఆర్‌ఎస్‌ఏ స్పోర్ట్స్ ఆఫీసర్ జేజే శోభ, ఏఐసీఎఫ్ కోశాధికారి నరేశ్ శర్మ, టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వెస్టిండీస్ సంచలన విజయం

- షై హోప్ అజేయ సెంచరీ
- ఇంగ్లండ్‌తో తొలి వన్డే



షై హోప్

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షై హోప్ (83 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో విండీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (72 బంతుల్లో 71; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా...జాక్ క్రాలీ (48), ఫిల్ సాల్ట్ (45), స్యామ్ కరన్ (38) రాణించారు. మోతీ, ఒషాన్, షెఫర్డ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం వెస్టిండీస్ 48.5 ఓవర్లలో 6 వికెట్లకు 326 పరుగులు చేసి విజయాన్నందుకుంది. వన్డేల్లో విండీస్‌కు ఇది రెండో అతి పెద్ద లక్ష్యఛేదన కావడం విశేషం. 39 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 214/5 వద్ద విండీస్‌కు విజయావకాశాలు తక్కువగా కనిపించాయి. అయితే రొమారియో షెఫర్డ్ (28 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ పరిస్థితి మార్చింది. హోప్, షెఫర్డ్ ఆరో వికెట్‌కు 51 బంతుల్లోనే 89 పరుగులు జోడించారు. చివరి 2 ఓవర్లలో 19 పరుగులు చేయాల్సిన దశలో స్యామ్ కరన్ వేసిన ఓవర్లో హోప్ 3 సిక్సర్లు బాది ఆట ముగించాడు. ఈ క్రమంలో వన్డేల్లో హోప్ 16వ సెంచరీ పూర్తయింది. చివరి 9.5 ఓవర్లలో విండీస్ 112 పరుగులు సాధించింది. మరోవైపు స్యామ్ కరన్ వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు (98) ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు.

'బైజూస్'కు నోటీసులు

బీసీసీఐకి రూ. 158 కోట్లు బాకీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి బాకీ పడిన రూ. 158 కోట్లకు సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) 'బైజూస్' సంస్థకు నోటీసులు జారీ చేసింది. భారత క్రికెట్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌కు స్పందిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఈ నోటీసులు ఇచ్చింది. 'దీనిపై స్పందించేందుకు బైజూస్‌కు రెండు వారాల గడువు ఇచ్చాం. ఆపై మరో వారం రోజుల్లో బీసీసీఐ తమ అభ్యంతరాలను దాఖలు చేయాలి' అని ఆదేశించిన ఎన్‌సీఎల్‌టీ... ఈ కేసును డిసెంబర్ 22కు వాయిదా వేసింది. 2019లో భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌గా వచ్చిన బైజూస్ సంస్థ తర్వాతి రోజుల్లో దివాళా తీయడంతో బీసీసీఐకి రూ. 158 కోట్లు బాకీ పడింది.

సినిమా



నాగార్జున

లవ్.. యాక్షన్.. రొమాన్స్

హీరో నాగార్జున, తమిళ దర్శకుడు అనిల్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ కొన్ని రోజులుగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'లవ్.. యాక్షన్.. రొమాన్స్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మిస్తారనే ప్రచారం జరుగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తెరకెక్కనుందట. ఇక ప్రస్తుతం 'నా సామిరంగ' చిత్రంతో బిజీగా ఉన్నారు నాగార్జున.

నాన్నగారి ప్యాషన్ మమ్మల్ని నిలబెట్టింది

\- అల్లు అరవింద్



శరత్ మరార్, రాజీవ్ చిలక, అల్లు అరవింద్, శ్రీనివాస్ చిలక

''మా నాన్నగారు (అల్లు రామలింగయ్య) సినిమా ఇండస్ట్రీలో పని చేయాలనే లక్ష్యంతో పెట్టె సర్దుకుని అమ్మని ఊళ్లోనే వదిలేసి చెన్నై వెళ్లారు. ఆ ప్యాషనే ఈరోజు మమ్మల్ని ఇక్కడ నిలబెట్టింది. దాన్ని ప్యాషన్ అనో, పిచ్చి అనో అనుకున్నా పర్లేదు. అలాంటి పిచ్చి ఉన్న రాజీవ్ అంటే నాకు తెలియని ప్రేమ, అభిమానం. ఆయన చిత్ర పరిశ్రమలోకి రావడం సంతోషంగా ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. యానిమేషన్ రంగంలో గుర్తింపు సంపాదించుకున్న గ్రీన్ గోల్డ్ గ్రూప్ అధినేతలు రాజీవ్ చిలక, శ్రీనివాస్ చిలక 'చిలక ప్రొడక్షన్స్' బ్యానర్ పేరుతో చిత్ర నిర్మాణ రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ బ్యానర్ లోగోను నిర్మాతలు అల్లు అరవింద్, శరత్ మరార్ విడుదల చేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''రాజీవ్ చేసిన 'చోటా భీమ్'ని నేను తెలుగులో రిలీజ్ చేశాను. రాజమౌళి దగ్గరున్న ప్యాషన్‌ని రాజీవ్‌లో చూశాను'' అన్నారు. ''సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్న శ్రీనివాస్, రాజీవ్‌లకు అభినందనలు'' అన్నారు శరత్ మరార్. రాజీవ్ చిలక మాట్లాడుతూ– ''లయన్ కింగ్' సినిమా చూసి ఇలాంటి సినిమాను ఇండియాలో ఎందుకు తీయకూడదు? అనిపించింది. అలాంటి యానిమేషన్ సినిమా చేయాలనే లక్ష్యంతోనే 'గ్రీన్ గోల్డ్ సంస్థ'ని ప్రారంభించాం. మా చిలక ప్రొడక్షన్స్‌లో ప్రస్తుతానికి రెండు తెలుగు సినిమాలు, హిందీలో ఓ చిన్న పిల్లల సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు. ''2004లో కృష్ణ యానిమేషన్ సిరీస్‌ను ఆరంభించాం. 2008లో ఆరంభించిన 'చోటా భీమ్' ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ ప్రయాణంలో భాగంగా సినిమాలు నిర్మించడానికి చిలక ప్రొడక్షన్స్‌ని స్టార్ట్ చేశాం'' అని శ్రీనివాస్ చిలక అన్నారు.

అమ్మాడి.. నాకో పెద్ద సవాల్!

\- మృణాల్ ఠాకూర్



''హాయ్ నాన్న' చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది. భావోద్వేగాలూ ఉంటాయి. దర్శకుడు శౌర్యువ్‌కి ఇది తొలి సినిమా అయినా ఎక్కడా కొత్త దర్శకుడితో పని చేస్తున్నామనే ఫీలింగ్ రాలేదు. తన విజన్, అప్రోచ్ చాలా క్లారిటీగా ఉన్నాయి. శౌర్యువ్ సృష్టించిన మ్యాజిక్‌ని ఈ గురువారం ప్రేక్షకులు చూస్తారు" అని హీరోయిన్ మృణాల్ ఠాకూర్ అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా శ్రుతీహాసన్, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మృణాల్ ఠాకూర్ పంచుకున్న విశేషాలు.

- 'సీతారామం' సినిమా తర్వాత నన్ను మరిన్ని వైవిధ్యమైన పాత్రల్లో చూడాలని ప్రేక్షకులు అనుకుంటున్నారు. వారిని అలరించేందుకు నా మనసుకు దగ్గరైన పాత్రలు, సినిమాలు చేయడంపై దృష్టి పెట్టాను. 'సీతారామం' హిట్ తర్వాత నేను చేసిన 'హాయ్ నాన్న'పై అంచనాలుంటాయి. వాటికి తగ్గట్టు చాలా అద్భుతమైన కథ ఇది. ఇందులో నేను యష్ణ, నానీగారు విరాజ్ పాత్రల్లో నటించాం. తెరపై విరాజ్, యష్ణ ప్రయాణాన్ని చూసిన ప్రేక్షకులు తప్పకుండా వారితో ప్రేమలో పడిపోతారు.
- కథని, పాత్రలని బలంగా నమ్మి యూనిట్ అంతా నిజాయితీతో చేసిన సినిమా ఇది. ఇందులో నా పాత్ర న్యూ ఏజ్ అమ్మాయిగా ఉంటుంది. ఈ మూవీలోని మానవీయ బంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులకు నచ్చుతాయి. ఈ సినిమాలో పాట పాడటం సవాల్‌గా అనిపించింది. ఇందులో 'అమ్మాడి..' పాటలో ప్రతి పదాన్ని ట్యూన్‌కి తగ్గట్టు లిప్ సింక్ చేయాలి. అది నాకు చాలా సవాల్‌గా అనిపించింది. ఈ పాటకి అనంత శ్రీరామ్‌గారు మంచి సాహిత్యం అందించారు.
- నానీగారు చాలా సపోర్టివ్. షూటింగ్‌లో నాకు ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. మోహన్, విజయేందర్ రెడ్డి గార్లు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. రాజీపడకుండా సినిమాకి కావాల్సిన ప్రతిదీ సమకూర్చారు. ఈ మూవీలో రాక్ స్టార్ ఎవరంటే బేబీ కియారానే. తన పాత్ర ప్రేక్షకుల మనసుని హత్తుకుంటుంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతం. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు సంగీతాన్ని చాలా ఎంజాయ్ చేస్తారు.
- మా నాన్న నా బిగ్గెస్ట్ ఇన్‌స్పిరేషన్. ఈ రోజు నేనీ స్థాయిలో ఉండటానికి కారణం ఆయనే. ఎన్ని సమస్యలున్నా హాయిగా నవ్వుతూ జీవితాన్ని గడపాలని నేర్పించారు. మంచి విషయాలు జరగడానికి సమయం పడుతుందని, జీవితంలో ఓర్పుతో ఉండాలని చెబుతుంటారు. నాన్నే నా జీవితానికి మూలస్తంభం. ఇండస్ట్రీలో నేను ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలి. ఇంకా మంచి మంచి సినిమాలు, పాత్రలు చేయాలి. ప్రేక్షకులకు నా పేరు గుర్తు ఉండకపోయినా పర్లేదు కానీ, సీత.. యష్ణ.. ఇలా చేసిన పాత్రలతో నేను గుర్తుండిపోవాలి. దాని కోసం నిజాయితీగా కష్టపడి పని చేస్తాను. ప్రస్తుతం తెలుగులో 'ఫ్యామిలీ స్టార్', హిందీలో పలు సినిమాల్లో నటిస్తున్నాను.



గొర్రెల సుబ్రహ్మణ్యం, సుమంత్ జి. నాయుడు, సుధీర్‌బాబు, జ్ఞానసాగర్

నా కెరీర్‌లో గేమ్ చేంజర్ అయ్యే చిత్రమిది

\- సుధీర్ బాబు

''హరోం హర' సినిమా కోసం యూనిట్ అంతా చాలా కష్టపడ్డాం. ఒక్కో రోజు సెట్స్‌లో వెయ్యిమంది ఉండేవారు. మంచి ఎమోషన్స్, హై కమర్షియల్ కంటెంట్ ఉన్న చిత్రమిది. ఇందులో చాలా బలమైన పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో గేమ్ చేంజర్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సుధీర్ బాబు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి. నాయుడు నిర్మించిన పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవికా శర్మ హీరోయిన్. హైదరాబాద్‌లో యూనిట్ నిర్వహించిన ఈ చిత్రం టీజర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సుధీర్ బాబు మాట్లాడుతూ– ''సుమంత్ జి. నాయుడు వంటి నిర్మాతలు చిత్ర పరిశ్రమకు రావాలి. మైత్రీ, సితార, వైజయంతి.. లాంటి బ్యానర్స్‌లానే కథని నమ్మి ఎంతైనా ఖర్చు పెట్టే నిర్మాణ సంస్థగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పరిశ్రమలోకి వచ్చినట్లేనని నమ్ముతున్నాను. నా కోసమే ఈ చిత్రకథ రాసుకొచ్చిన సాగర్‌కి థ్యాంక్స్'' అన్నారు. ''నా రెండో చిత్రానికి ఇంత హై బడ్జెట్ ఇస్తారని ఊహించలేదు. మంచి సినిమా చేశాం'' అన్నారు జ్ఞానసాగర్. ''నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. టీజర్‌కి వస్తున్న స్పందన చూస్తుంటే ఓ మంచి సినిమా చేశాననే నమ్మకం వచ్చింది'' అన్నారు సుమంత్ జి. నాయుడు. ఈ వేడుకలో కెమెరామేన్ అరవింద్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టు కోల్పోవడం వల్లే ప్రమాదం



రితికా సింగ్

'గురు' ఫేమ్ రితికా సింగ్ ఓ యాక్షన్ సీన్‌లో గాయపడ్డారు. హీరో రజనీకాంత్ నటిస్తున్న 170వ సినిమాకి టీజీ జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో రితికా సింగ్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో తాను గాయపడ్డట్లు ఆమె పేర్కొని, చేతులపై అక్కడక్కడా గీసుకుపోయి రక్తం వస్తున్న ఫొటోను పోస్ట్ చేశారు. ''తలైవర్ 170' సెట్‌లో అనుకోని ఘటన జరిగింది. క్షణాల్లో జరిగిపోయేవాటిని మనం ఆపలేం. నేను పట్టు కోల్పోవడం వల్లే ఇలా జరిగింది. షూటింగ్ స్పాట్‌లో ఉన్న ఒక గాజు అద్దం ఈ ప్రమాదానికి కారణమైంది. చిత్రీకరణ సమయంలో ఒక్కోసారి ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. ఈ గాయం వల్ల షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చాను. కోలుకున్న తర్వాతే చిత్రీకరణలో పాల్గొంటాను'' అన్నారు రితికా సింగ్.

కాన్సెప్ట్ కొత్తగా ఉంది

\- దర్శకుడు విక్రమ్ కె. కుమార్



వెంకట్, విక్రమ్ కె. కుమార్

''తికమక తాండ' ట్రైలర్ చాలా ఆసక్తిగా ఉంది. వెంకట్ ఎంచుకున్న కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. తనకు పెద్ద విజయం చేకూరాలి. అలాగే ఆరిస్టులు హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషాలకు మంచి పేరు రావాలి'' అని దర్శకుడు విక్రమ్ కె. కుమార్ అన్నారు. హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషా హీరో హీరోయిన్లుగా వెంకట్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తికమక తాండ'. తిరుపతి సత్యం సమర్పణలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని విక్రమ్ కె. కుమార్ రిలీజ్ చేశారు. ''ఇప్పటికే విడుదల చేసిన పాటలు, టీజర్‌కి మంచి స్పందన లభించింది. ఈ నెల 15న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, కెమెరా: హరికృష్ణన్.

ప్రేమలో వరలక్ష్మి



ఆషిక

కలర్‌ఫుల్ లంగా, ఓణీ, పసందైన ఆభరణాలు, చేతికి మట్టి గాజులు.. ఇలా సంప్రదాయబద్ధంగా ముస్తాబైంది వరలక్ష్మి. ఇంత అందంగా కనిపిస్తున్న వరలక్ష్మి వైపు కొంటెగా చూస్తూ.. బీడీ కాలుస్తుంటాడా అబ్బాయి. కట్ చేస్తే.. అద్దంలో చూసుకుంటూ అతనిలా బీడీ కాలుస్తున్నట్లు ఖాళీ చేతులతో అనుకరిస్తుంది వరలక్ష్మి. ఈసారి ఈ బ్యూటీ నలుపు రంగు చీరలో ఆ అబ్బాయికి దర్శనమిస్తుంది. అదే కొంటె చూపు విసురుతాడు. వరలక్ష్మి సిగ్గు పడిపోతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది అనడానికి ఇంతకన్నా ఏం కావాలి? నాగార్జున హీరోగా ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్న 'నా సామి రంగ' చిత్రం నుంచి రిలీజైన గ్లింప్స్‌లో పైన పేర్కొన్న దృశ్యాలు కనిపించాయి. మాస్ లుక్‌లో నాగార్జున, ట్రెడిషనల్ లుక్‌లో ఆషికా రంగనాథ్ కనిపించారు. ఈ చిత్రంలో ఆషికా పాత్ర పేరు వరలక్ష్మి అని పేర్కొని, ఆమె లుక్, గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకునిగా పరిచయం చేస్తూ శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, సమర్పణ: పవన్ కుమార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,384	68,865
నిఫ్టీ ▲	419	20,687

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,161	▼ 144
డోజోన్స్	36,128	▼ 116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,521	▼ 9
డాక్స్	16,439	▲ 41
షాంఘై	3,023	▼ 9
నికాయ్	33,231	▲ 200

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,281
బంగారం (99.5 స్వచ్ఛత)	63,028
వెండి (కిలో)	76,430

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.73	107.11
€	యూరో	ఒకటి	89.20	92.30
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.99	57.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.38	56.75
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.29
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.27	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.80	23.59
¥	చైనా యువాన్	పదింటికి	10.56	12.63

బీజేపీకి జై.. సూచీలు రయ్..!

కొత్త శిఖరాలపై సెన్సెక్స్, నిఫ్టీ

18 నెలల్లో ఒక రోజు అతిపెద్ద లాభం

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు



ముంబై: అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఓటర్లు మూడు రాష్ట్రాల్లో బీజేపీకి 'జై' కొట్టడంతో సోమవారం స్టాక్ సూచీలు ఏకంగా రెండు శాతం ర్యాలీ చేశాయి. ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఉత్సాహాన్నిచ్చాయి. ద్రవ్యోల్బణం దిగిరావడంతో అంతర్జాతీయంగా వడ్డీ రేట్ల పెంపు భయాలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్లకు దిగువకు చేరుకుంది. ఫలితంగా సూచీలు 18 నెలల్లో (మే 20, 2022 తర్వాత) అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,384 పాయింట్లు పెరిగి 68,865 ముగిసింది. నిఫ్టీ 419 పాయింట్లు బలపడి 20,687 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు.

ట్రేడింగ్‌లోనూ జీవితకాల గరిష్టాల నమోదు

జాతీయ, అంతర్జాతీయ సానుకూల పరిణామాల నేపథ్యంలో ఉదయం సూచీలు భారీ లాభంతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 945 పాయింట్లు పెరిగి 68,435 వద్ద, నిఫ్టీ 334 పాయింట్ల లాభంతో 20,602 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. మీడియా తప్ప అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన షేర్లు రాణించడం ఓ దశలో సెన్సెక్స్ 1,437 పాయింట్లు దూసుకెళ్లి 53 ట్రేడింగ్ సెషన్ల తర్వాత 68,918 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 435 పాయింట్లు ఎగసి 20,703 వద్ద రెండో రోజూ రికార్డు ర్యాలీ చేసింది.

ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ రెండుశాతం ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5.81 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ. 343.48 లక్షల కోట్లకు చేరింది. కాగా అయిదు రోజుల ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.14.76 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

- సూచీల రికార్డు ర్యాలీని అందిపుచ్చుకున్న అదానీ షేర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 9%, అంబుజా సిమెంట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 7%, అదానీ పోర్ట్స్, ఏసీసీ 6%, అదానీ పవర్, అదానీ ఎనర్జీ 5%, అదానీ టోటల్ గ్యాస్ 4%, ఎన్‌డీటీవీ 3%, అదానీ విల్మార్ 2% చొప్పున లాభపడ్డాయి. మొత్తం పది కంపెనీల షేర్లూ రాణించడంతో ఇంట్రాడేలో గ్రూప్ సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ జనవరి 31 తర్వాత తొలిసారి రూ.12 లక్షల కోట్లను తాకింది. చివరికి రూ.11.95 లక్షల కోట్ల వద్ద ముగిసింది.
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఐసీఐసీఐ బ్యాంక్ 5%, ఎస్‌బీఐ 4%, కోటక్ బ్యాంక్, పీఎస్‌బీ, ఇండస్ ఇండ్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు 3% లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఏయూ బ్యాంకులు 2%, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులు ఒకశాతం పెరిగాయి. ఫలితంగా ఎన్‌ఎస్‌ఈలో బ్యాంక్ నిఫ్టీ 91 ట్రేడింగ్ సెషన్ల తర్వాత 46,484 వద్ద కొత్త ఆల్‌టైం హైని నమోదు చేసింది.



అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్వసించాయి. ద్రవ్యోల్బణం తగ్గడం, స్థూల ఆర్థిక అంశాలు మెప్పించడంతో రానున్న రోజుల్లో ఎఫ్ఐఐల కొనుగోళ్లు కొనసాగొచ్చు. రికార్డు ర్యాలీ నేపథ్యంలో స్థిరీకరణ జరిగితే నిఫ్టీకి 20,400 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది.

– వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్

పసిడి.. పరుగో పరుగు!

- అంతర్జాతీయంగా, దేశీయంగా ఆల్‌టైమ్ గరిష్టానికి...
- ఢిల్లీలో 10 గ్రాములు రూ. 64,300కు అప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బంగారం ధరల రికార్డు పరుగు ప్రభావం భారత్ బులియన్ మార్కెట్‌లో కనబడింది. దేశ రాజధానిలో పసిడి 10 గ్రాముల ధర సోమవారం అంతక్రితం ముగింపుతో పోల్చితే రూ.450 పెరిగి రూ.64,300 రికార్డు స్థాయికి చేరినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేర్కొంది. ఇక ముంబైలో ధర సోమవారం క్రితం (శుక్రవారం ముగింపు)తో పోల్చితే 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.553 పెరిగి రూ.63,281కి ఎగసింది. 99.5 స్వచ్ఛత ధర రూ.551 ఎగసి రూ.63,028ని చూసింది. ఇక వెండి విషయానికి వస్తే, రెండు నగరాల్లో దాదాపు స్థిరంగా ఉన్నాయి. ఢిల్లీలో వెండి కేజీ ధర రూ.80,200 పలికితే, ముంబైలో ఈ విలువ రూ.76,430గా ఉంది.

విజయవాడ మార్కెట్లో తీరిది...

గడిచిన రెండు రోజుల్లో విజయవాడ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,250 పెరిగి రూ.64,200కు చేరింది. డిసెంబర్1న రూ.62,950 గా ఉన్న బంగారం ధర ఒకేరోజు రూ.810 పెరిగి రూ.63,760కు చేరగా, తాజాగా సోమవారం మరో రూ.440 పెరిగి రూ.64,200కు చేరింది. ఇదే సమయంలో 22 క్యారట్ల ఆభరణాల పది గ్రాముల బంగారం ధర రూ.1,150 పెరిగి రూ.57,700 నుంచి రూ.58,850కు పెరిగింది.



అంతర్జాతీయ ప్రభావం...

అంతర్జాతీయ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్లో ఫిబ్రవరికి సంబంధించి క్రియాశీలంగా ట్రేడ్ అవుతున్న పసిడి ఔన్స్ (31.1 గ్రాములు) ధర తాజాగా రికార్డు స్థాయిలో 2,151 డాలర్లను తాకింది. అయితే లాభాల స్వీకరణ నేపథ్యంలో ఈ వార్త రాసే రాత్రి 11 గంటల సమయానికి 2.3 శాతం క్షీణించి 2,040 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక ఆసియన్ ట్రేడింగ్‌లో కూడా ఇంట్రాడేలో ధర ఆల్‌టైమ్ కొత్త రికార్డు స్థాయి 2,135 డాలర్లను చూసింది. అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతాయన్న అంచనాలు, డాలర్ బలహీనత, పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితులు పసిడి పరుగుకు కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) ఇటీవలి సర్వే విడుదలచేస్తూ, ప్రపంచవ్యాప్తంగా 24 శాతం సెంట్రల్ బ్యాంక్‌లు రాబోయే 12 నెలల్లో తమ బంగారం నిల్వలను పెంచుకోవాలని భావిస్తున్నాయని వెల్లడించింది. రిజర్వ్ అసెట్‌గా డాలర్ కంటే బంగారమే సరైనదన్న అభిప్రాయం దీనికి కారణమని పేర్కొంది. ఈ అంశం కూడా తాజా బంగారం ధర జోరుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏఏఏఐ డైరెక్టరుగా 'శ్లోకా' శ్రీనివాస్ ఎన్నిక



శ్రీనివాస్



ప్రశాంత్ కుమార్

హైదరాబాద్: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టరుగా శ్లోకా అడ్వర్టైజింగ్ ఎండీ, సీఈవో కె. శ్రీనివాస్ తిరిగి ఎన్నికయ్యారు. డైరెక్టర్ల బోర్డుకు తెలుగు రాష్ట్రాల నుంచి వరుసగా రెండోసారి ఎవరైనా ఎన్నికవడం ఇదే ప్రథమం. అడ్వర్టైజింగ్, మార్కెటింగ్‌లో శ్రీనివాస్‌కు 30 ఏళ్ల పైగా అనుభవం ఉంది. డైరెక్టర్ల బోర్డుకు మరోసారి ఎన్నికవడంపై శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ వ్యాపార విధానాలు అమలయ్యేలా చూసేందుకు బోర్డు సభ్యులతో కలిసి పని చేస్తానని తెలిపారు. ఏఏఏఐ ప్రెసిడెంట్‌గా గ్రూప్ ఎం మీడియా సీఈవో (దక్షిణాసియా) ప్రశాంత్ కుమార్ మరోసారి ఎన్నికయ్యారు. అలాగే, హవాస్ మీడియాకు చెందిన రాణా బారువా ఏకగ్రీవంగా వైస్-ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్‌డీ రేట్ల పెంపు

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచింది. రూ. 2 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఉండే ఎఫ్‌డీలకు సంబంధించి వివిధ కాల వ్యవధులకు రేటును 5.25%-7.25% వరకు సవరించింది. ఇవి డిసెంబర్ 1 నుంచి వర్తిస్తాయి. అటు రూ. 2 కోట్ల కంటే తక్కువ ఉండే ఎఫ్‌డీలపై 2 ఏళ్ల కాల వ్యవధికి 7.25%-7.90% వరకు బ్యాంక్ ఇటీవలే పెంచింది.

కీలక వడ్డీ రేటు యథాతథమే..!

రేపటి నుంచి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) సమీక్షా సమావేశం డిసెంబర్ 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. పాలసీ వివరాలను 8వ తేదీన గవర్నర్ వెల్లడిస్తారు. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఎకానమీ వృద్ధే లక్ష్యంగా ప్రస్తుత యథాతథ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు- ప్రస్తుతం 6.5 శాతం)నే కొనసాగిస్తుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. యథాతథ రేటు కొనసాగిస్తే ఈ తరహా నిర్ణయం ఇది వరుసగా ఐదవసారి అవుతుంది. ద్రవ్యోల్బణం అదుపులోనికి వచ్చినట్లు కనబడుతున్నప్పటికీ, దీని కట్టడికి కఠిన రేటు విధానాన్నే అవలంభించాలని ఆర్‌బీఐ కమిటీ భావిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో గత నాలుగు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది.



స్పైస్‌జెట్‌పై దివాలా పిటిషన్‌కు ఎన్‌సీఎల్‌టీ తిరస్కరణ



న్యూఢిల్లీ: లీజుదార్ల నుంచి దివాలా పిటిషన్లు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) కాస్త ఊరట లభించింది. బకాయిలను రాబట్టుకునేందుకు కంపెనీపై విల్లిస్ లీజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. 2023లో విల్లిస్ ఇదే వివాదంపై దాఖలైన దరఖాస్తును వెనక్కి తీసుకుందని, కొత్తగా మళ్లీ మరొకటి వేయడం సరికాదన్న స్పైస్‌జెట్ వాదనలతో ఏకీభవించింది. విల్లిస్‌తో పాటు విమానాలు లీజుకిచ్చిన మరో మూడు లీజుదార్లు కూడా స్పైస్‌జెట్‌పై దివాలా పిటిషన్లు వేశాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 995 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరో.. దేశవ్యాప్తంగా ఐబీ పరిధిలోని సబ్సిడియరీ ఇంటెలిజెన్స్ బ్యూరోల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 995
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 15.12.2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.44,900 నుంచి రూ.1,42,400.
» **ఎంపిక విధానం:** టైర్-1 రాతపరీక్ష, టైర్-2 పరీక్ష, టైర్-3/ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** టైర్-1 రాతపరీక్ష ఆబ్జెక్టివ్, టైర్-2 పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. టైర్-1 పరీక్షలో కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్/లాజికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. టైర్-2 పరీక్షలో ఎస్సే, ఇంగ్లిష్, కాంప్రహెన్షన్, ప్రిసైజ్ రైటింగ్ ఉంటుంది. 50 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి ఒక గంట. 100 మార్కులతో టైర్-3/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2023
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:**19.12.2023
» **వెబ్‌సైట్:** mha.gov.in or www.ncs.gov.in

కేంద్ర సాయుధ బలగాల్లో 26,146 కానిస్టేబుల్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. వివిధ కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్ /రైఫిల్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26,146.
» **పోస్టుల వివరాలు:** బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)-6,174, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)-11,025, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) -3,337, సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ)-635, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) -3,189, అస్సాం రైఫిల్స్(ఏఆర్)-1490, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్)-296.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీలు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీలకు తగ్గకూడదు.
» **వయసు:** 01.01.2024 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 మధ్య చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరితేది:** 01.01.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 04.01.2024, 05.01.2024, 06.01.2024.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** ఫిబ్రవరి-మార్చి 2024.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 17 పోస్టులు

బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
» **పోస్టుల వివరాలు:** డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్(డీసీపీవో)-01, ప్రొటెక్షన్ ఆఫీసర్(ఇన్‌స్టిట్యూషన్ కేర్)-01, ప్రొటెక్షన్ ఆఫీసర్ (పీఓ-ఎన్ఐసీ) (నాన్-ఇన్‌స్టిట్యూషన్ కేర్)-01, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్(ఎల్‌సీపీవో)-01, అకౌంటెంట్-01, డేటా అనలిస్ట్-01, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్-01, ఔట్ రీచ్ వర్కర్(ఫిమేల్)-01, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్-01, ఎడ్యుకేటర్ (పార్ట్‌టైమ్)-01, ఆర్ట్-క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్-01, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా ట్రైనర్-01, కుక్(అవుట్ సోర్సింగ్)-02, హెల్పర్-కమ్-నైట్ వాచ్‌మెన్-02, హౌస్‌కీపర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బరంపేట, బాపట్ల జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.12.2023.
» **వెబ్‌సైట్:** https://bapatla.ap.gov.in

ఎస్‌బీఐ.. ఆఫీసర్ అవుతారా!

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. క్లరికల్ నుంచి స్పెషలిస్ట్ ఆఫీసర్స్ వరకు.. నిత్యం ఏదో ఒక జాబ్ నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. తాజాగా మరో భారీ నోటిఫికేషన్‌తో ఉద్యోగార్థుల ముందుకొచ్చింది. 5,447 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి ప్రకటన ఇచ్చింది! ఆన్‌లైన్ టెస్ట్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్స్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» 5,447 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్ట్‌లకు ఎస్‌బీఐ ప్రకటన
» డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం
» ప్రారంభంలో రూ.36 వేల వేతనం, ఇతర భత్యాలు
» రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ



బ్యాంక్ జాబ్స్

16 సర్కిల్స్.. 5,447 పోస్ట్‌లు

ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 16 సర్కిల్స్‌లో 5,447 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్(సీబీవో) పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిల్లో 167 బ్యాక్‌లాగ్ పోస్టు కూడా ఉన్నాయి. గతేడాది 1,422 సీబీవో పోస్ట్‌లకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఈ సంవత్సరం 5,447 పోస్ట్‌లకు ప్రకటన ఇవ్వడం విశేషం.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు ఆయా సర్కిళ్ల పరిధిలోని రాష్ట్రాల్లో ఏదైనా ఒక రాష్ట్రంలోని ఖాళీలకే దరఖాస్తు చేసుకోవాలి.
- **పని అనుభవం:** 31.10.2023 నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ లేదా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఆఫీసర్‌గా కనీసం రెండేళ్ల ఉద్యోగ అనుభవం తప్పనిసరి. నిబంధనల ప్రకారం డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాతే ఈ అనుభవం పొంది ఉండాలి.
- **వయసు:** 31.10.2023 నాటికి 21-30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** ప్రారంభ వేతన శ్రేణి రూ.36,100 -రూ.63,840గా ఉంటుంది.

ఎంపిక విధానం

సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్ట్‌లకు చేపట్టే నియామక ప్రక్రియలో మూడు దశలు ఉంటాయి. తొలుత ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఆ తర్వాత సర్టిఫికెట్ల స్క్రీనింగ్ ఉంటుంది. చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

రాత పరీక్షకు 120 మార్కులు

ఎంపిక ప్రక్రియ తొలి దశలో రాత పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, బ్యాంకింగ్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ 30 ప్రశ్నలు-30 మార్కులు, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు-20 మార్కులు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు-120 మార్కులకు ఆన్‌లైన్ టెస్ట్ జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కుల విధానం లేదు.

డిస్క్రిప్టివ్ టెస్ట్

మొదటి దశలోని రాత పరీక్షలో భాగంగానే ఆబ్జెక్టివ్ పరీక్ష ముగిసిన తర్వాత ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై 50 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ 50 మార్కులకు ఉంటాయి. ఈ పరీక్షకు కేటాయించిన సమయం 30 నిమిషాలు.

సర్టిఫికెట్ల స్క్రీనింగ్

ఎంపిక ప్రక్రియ రెండో దశలో.. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల దరఖాస్తులను, సర్టిఫికెట్లను ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీ పరిశీలిస్తుంది. అప్పటికే వారు చేస్తున్న ఉద్యోగం, ఇతర అర్హతల వివరాలను పరిశీలిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, స్క్రీనింగ్ దశల్లో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను గుర్తించి ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఖాళీలకు అనుగుణంగా.. ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు కేటాయించారు. అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఉన్న ఆసక్తి, సమకాలీన పరిణామాలపై అవగాహన, బ్యాంకింగ్ రంగ పరిజ్ఞానాన్ని పరిశీలించే విధంగా ఈ ఇంటర్వ్యూ ఉంటుంది.

వెయిటేజీ విధానం

తుది ఎంపికలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో ప్రతిభకు 75 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కల్పిస్తారు. అంటే..170 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో పొందిన మార్కులను 75 శాతానికి.. 50 మార్కులకు జరిపే ఇంటర్వ్యూలో పొందిన మార్కులను 25 శాతానికి మదింపు చేస్తారు. ఆ తర్వాత రాష్ట్రాల వారీగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

లాంగ్వేజ్ టెస్ట్

అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న రాష్ట్రానికి చెందిన భాషకు సంబంధించిన పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే నియామకం ఖరారు చేస్తారు. పదో తరగతి, 12వ తరగతిని సంబంధిత రాష్ట్రానికి చెందిన మాతృ భాషలో చదివిన వారికి ఈ లాంగ్వేజ్ టెస్ట్ నుంచి మినహాయింపు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 12.12.2023
- **ఆన్‌లైన్ టెస్ట్ కాల్ లెటర్ డౌన్‌లోడ్:** 2024 జనవరిలో
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2024 జనవరిలో
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
- **ఆన్‌లైన్ దరఖాస్తు, పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/web/careers

విజయం సాధించాలంటే

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే..ఇంగ్లిష్‌లో బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

జనరల్ ఎవేర్‌నెస్/ఎకానమీ

ఆర్థిక, వాణిజ్య, వ్యాపార పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్‌లో ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ,ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఎకానమీకి సంబంధించి జీడీపీ మూల భావనలు,సమ్మిళిత వృద్ధి, మైక్రో, మాక్రో ఎకనామిక్స్ భావనలు తెలుసుకోవాలి.

బ్యాంకింగ్ నాలెడ్జ్

బీఎఫ్ఎస్ఐ రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్

కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి. అదే విధంగా కంప్యూటర్ పదజాలం, బ్యాంకింగ్ రంగంలో వినియోగించే సాఫ్ట్‌వేర్‌ల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్

డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో ఉండే లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌లో రాణించడానికి బిజినెస్ లెటర్స్, అఫిషియల్ లెటర్స్, పర్సనల్ లెటర్స్‌ను రాయడం అలవర్చుకోవాలి. ఎస్సే రైటింగ్‌కు సంబంధించి బ్యాంకింగ్ రంగ పరిణామాలకు ప్రాధాన్యమిస్తూ వ్యాసాలు రాయగలిగే నేర్పు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దిన పత్రికల్లో ప్రచురించే బిజినెస్ న్యూస్, అనాలిసిస్‌లను పరిశీలించడం ఉపయుక్తంగా ఉంటుంది. వాటిని విశ్లేషించి సారాంశాన్ని గ్రహించి ఎస్సే రాయగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

జేఎంజీఎస్-1 హోదా


సీబీఓ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-1 హోదాలో కొలువు ఖరారు చేస్తారు. ఆరు నెలల పాటు ప్రొబేషన్ ఉంటుంది. ఈ ప్రొబేషన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకం ఖరారు చేస్తారు. ఇలా శాశ్వత నియామకం ఖరారు చేసుకున్న వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-1 హోదా కల్పిస్తారు. రూ.36 వేల మూల వేతనంతో కెరీర్ ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత ప్రతిభ, పనితీరు ఆధారంగా చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.


తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కలవకూరు చెక్‌డ్యామ్‌పై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది


చెన్నై ఎయిర్‌పోర్టులో పరిస్థితి ఇదీ..

తీవ్ర తుపానుగా మిచాంగ్

- నేడు మధ్యాహ్నం ఏపీలోని బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం
- తెలంగాణలో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే చాన్స్
- ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు భారీ వర్ష సూచన
- మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం



సాక్షి, హైదరాబాద్: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న మిచాంగ్ తుపాను సోమవారం మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరాలకు దగ్గరగా కొనసాగుతోంది. క్రమంగా బలపడుతూ, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమాంతరంగా కదులుతూ.. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దాని ప్రభావంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపింది. మంగళ, బుధవారాల్లోనూ పలు ప్రాంతాల్లో మోస్తరు వానలు పడతాయని వెల్లడించింది.

పలుచోట్ల భారీ వర్షాలు

మంగళవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు.. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వర్షాలు కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు, గంటకు 30 నుండి 40కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలు లు వీస్తాయని తెలి పింది. ఇక బుధవారం రోజున పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడ తాయని.. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడవచ్చని వివరించింది.

రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలివీ..

కేంద్రం	కనిష్ట ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	18.2
మెదక్	18.2
హకీంపేట్	19.8
హనుమకొండ	20.0
రామగుండం	20.2
నిజామాబాద్	20.4
నల్లగొండ	20.6
దుండిగల్	20.9
హైదరాబాద్	22.5
మహబూబ్‌నగర్	22.6
ఖమ్మం	23.8
భద్రాచలం	24.0

ఉష్ణోగ్రతలు తగ్గే చాన్స్

సోమవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా రామగుండంలో 33.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత.. అత్యల్పంగా మెదక్, ఆదిలాబాద్‌లలో 18.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశంఉందని తెలిపింది.

రైళ్ల రాకపోకలపై తుపాను ఎఫెక్ట్

- హైదరాబాద్ నుంచి దక్షిణాదికి నిలిచిన రైళ్లు
- ఉత్తరాది నుంచి వచ్చే వాటికీ బ్రేక్
- ఇప్పటికే 150కిపైగా రైళ్లను రద్దు చేసిన దక్షిణమధ్య రైల్వే
- వివరాల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని రైల్వే అధికారులకు జీఎం ఆదేశాలు
- అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలని సూచనలు

మిచాంగ్ తుపాను కారణంగా భారీగా రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రయాణికులు ఈ నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.
సికింద్రాబాద్: 040-2778666, 040-27801112
నాంపల్లి: 9676904334
కాచిగూడ: 040-27784453

సాక్షి, హైదరాబాద్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైల్వేశాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఉత్తరాది నుంచి దక్షిణాది రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. దక్షిణమధ్య రైల్వే నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే సుమారు 150 రైళ్లను అధికారులు ఇప్పటికే రద్దు చేశారు. ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా చెన్నై వెళ్లే రైళ్లకు కూడా బ్రేక్ పడింది. కాచిగూడ–చెంగల్పట్టు, హైదరాబాద్–తాంబరం, సికింద్రాబాద్–కొల్లాం, సికింద్రాబాద్–తిరుపతి, లింగంపల్లి–తిరుపతి, సికింద్రాబాద్–రేపల్లె, కాచిగూడ–రేపల్లె, చెన్నై–హైదరాబాద్, సికింద్రాబాద్–గూడూరు, సికింద్రాబాద్–త్రివేంద్రం తదితర ప్రాంతాల మధ్య నడిచే రైళ్లను రద్దు చేశారు. అటు చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపివేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. రెండు, మూడు రోజుల పాటు పరిస్థితి ఇలాగే కొనసాగనుందని అధికారులు తెలిపారు.

పలుచోట్ల ఇప్పటికే వరదలు మొదలు

ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురిసి, వరదలు పారుతున్న నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. వివిధ ప్రాంతాల్లో రైల్వేలైన్ల పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో తెలంగాణలోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో వరదలు, నీటి ప్రవాహం కారణంగా పట్టాలపై నీరు నిలిచి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. దీంతో ఇప్పటికే పలు మార్గాల్లో రైళ్ల రాకపోకలను నిలిపివేసేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ఎప్పటికప్పుడు వరద నీటిని తొలగించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేసినట్టు అధికారులు చెప్తున్నారు.

ప్రయాణాలను వాయిదా వేసుకోండి

హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి విజయవాడ, విశాఖ, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైళ్లలో కొన్నింటిని ప్రధాన స్టేషన్‌లకే పరిమితం చేశారు. అత్యవసరమైతే తప్ప తుపాను ప్రభావిత ప్రాంతాల దిశగా ప్రయాణాలు వద్దని, ఇప్పటికే రిజర్వేషన్లు చేసుకున్నవారు వాయిదా వేసుకోవడం మంచిదని ప్రయాణికులకు సూచిస్తున్నారు. తుఫాన్ కారణంగా ప్రయాణాలు రద్దు చేసుకొనే వారికి పూర్తిస్థాయిలో చార్జీలను తిరిగి చెల్లించనున్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలోని బుకింగ్ కేంద్రాల్లో టికెట్లను రద్దు చేసుకోవచ్చు.

అయ్యప్ప భక్తులకు ఇబ్బందులు

తుపాను కారణంగా హైదరాబాద్ నుంచి కొల్లాం వెళ్లే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. దీంతో హైదరాబాద్ నుంచి శబరిమలకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్న అయ్యప్ప భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి శబరిమలకు రైళ్లు తక్కువగా ఉన్నాయని, రద్దు కారణంగా వేరే రైళ్లలో టికెట్లు దొరికే పరిస్థితి లేదని చెప్తున్నారు. వాహనాల్లో అంతదూరం ప్రయాణించడం ఇబ్బందికరమేనని అంటున్నారు.

రైల్ నిలయం నుంచి పర్యవేక్షణ

తుపాను ప్రభావం ఉండే ప్రాంతాలకు వెళ్లే రైళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వ యంత్రాంగం, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకుంటూ రైళ్లను నడపాలని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు జనరల్ మేనేజర్ ధనంజయులు నేతృత్వంలో వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు రైల్‌నిలయం నుంచి తుపాను పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వారు డివిజనల్ అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. తుపాను పరిణామాలను ఎదుర్కొనేందుకు అవసరమైన సామాగ్రిని, యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. వంతెనలు, వరద పోటెత్తే ప్రదేశాల్లో వాచ్‌మన్‌లను ఏర్పాటు చేశారు. పట్టాలపై నిలిచే వరదనీటిని తొలగించేందుకు డీజిల్ పంపులను సిద్ధం చేశారు.

ఏపీలో కుండపోత వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను సోమవారం తీవ్ర రూపం దాల్చింది. గంటకు పది కిలోమీటర్ల వేగంతో దక్షిణ కోస్తాంధ్రకు సమాంతరంగా కదులుతుండడంతో ఆ తీరం వెంబడి ఉన్న జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలకు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగలో సోమవారం ఒక్కరోజే 28.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తీరప్రాంతం అతలాకుతలమైంది. విపరీతమైన ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నెల్లూరు నగరం తడిసి ముద్దయింది. కృష్ణపట్నం పోర్టులో 10వ నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సోమవారం ఉదయం నుంచి బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఈ మూడు జిల్లాల్లో వర్షాలు, గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. గుంటూరు జిల్లా రేపల్లె, ప్రకాశం జిల్లా చీరాల, ఒంగోలు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటల్లో సముద్రం 120 నుంచి 250 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకు వచ్చే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేదా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఐఎండీ సూచించింది. తుపాను ప్రభావం వల్ల మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు.. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఎఎస్సార్, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉంది. ఫలితంగా తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, యానాం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

సహాయకచర్యలు చేపట్టండి..

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని.. కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగమంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు.

క్లుప్తంగా...

తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలపై ఆంక్షలు
ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకే రాకపోకలకు అనుమతి

తిరుమల: తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనదారులపై టీటీడీ ఆంక్షలు విధించింది. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరుమల రెండు ఘాట్ రోడ్లలో పొగ మంచు దట్టంగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనదారులు తమ ముందున్న వాహనాలు సరిగా కనపడక ఇబ్బందులకు గురవుతున్నారు. తద్వారా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్షాలు తగ్గి సాధారణ స్థితి వచ్చేంతవరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నట్టు టీటీడీ తెలిపింది.

తగినన్ని వృద్ధాశ్రమాలు ఎందుకు ఏర్పాటు చేయలేదు?
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తగినన్ని వృద్ధాశ్రమాలు ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయా లని ఆదేశించింది. మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టం–2007లోని సెక్షన్ 19 ప్రకారం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 150 మంది ఉండేలా ఒక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని చెబుతున్నా.. ప్రభుత్వం ఆ మేరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖ హైకోర్టుకు అందింది. దీంతో చాలా మంది వృద్ధులు చెట్ల కింద, రహదారుల పక్కన జీవిస్తున్నారని పేర్కొ న్నారు. ఈ లేఖను సుమోటో పిల్‌గా న్యాయ స్థానం విచారణకు చేపట్టింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం సోమవా రం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

త్రిసభ్య కమిటీ భేటీ రద్దు

సాక్షి, అమరావతి: తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ హాజరుకాకపోవడంతో సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం వాయిదా పడింది. ఆయనకు బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే ఫోన్ చేయగా.. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమావేశాన్ని ఏర్పాటు చేస్తే హాజరవుతానని చెప్పారు. దాంతో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని బోర్డు రద్దు చేసింది.

చెన్నైలో జల ప్రళయం..

- ముంచెత్తిన మిచౌంగ్ తుపాను
- ఏకంగా 35 సెంటీమీటర్ల వాన
- పూర్తిగా స్తంభించిన జనజీవనం
- హైవేలు, సబ్‌వేల మూసివేత
- నీట మునిగిన విమానాశ్రయం
- 160 విమానాలు రద్దు
- నేడు మరింత వర్ష సూచన!

సాక్షి, చెన్నై: ఎక్కడ చూసినా నీరే. అంతటా వరద ప్రవాహమే. తమిళనాడు రాజధాని చెన్నై సముద్రాన్ని తలపించింది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మించౌంగ్ తుపానుగా మారి తమిళనాడు రాజధానితో పాటు శివారు జిల్లాల్లో జల ప్రళయమే సృష్టించింది. ఆదివారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి కొనసాగింది. సోమ వారం మధ్యాహ్నానికే చెన్నై, శివారు జిల్లాల్లో 35 సెంటీమీటర్ల వర్షం నమోదైంది! దాంతో వీధులన్నీ వాగులుగా మారాయి. నగరంలో ఎటు చూసినా వరద పోటెత్తింది. ఇళ్లు, పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వందలాది కార్లు, వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి! నడుం లోతుకు పైగా నీరు చేరడంతో నగరంలోని అన్ని హైవేలను, సబ్‌వేలను మూసేశారు. రన్ వేపైకి నీరు చేరడంతో చెన్నై విమానాశ్రయాన్ని కూడా మంగళవారం ఉదయం దాకా మూసేస్తున్నట్టు ప్రకటించారు. 160 విమాన సేవలు రద్దయ్యాయి. వండలూరు జూలోకి వరదనీరు పోటెత్తడంతో పెద్ద సంఖ్యలో మొసళ్లు తప్పించుకున్నాయి. దివంగత సీఎం జయలలిత నివాసం, సూపర్‌స్టార్ రజనీకాంత్ వంటి ప్రముఖులుండే పోయెస్ గార్డెన్ హైవే 7 అడుగుల మేర కుంగింది! అక్కడ టాన్స్‌ఫార్మర్లు, వాహనాలు అందులో పడిపోయాయి. వాన బీభత్సం కొనసాగుతుండటంతో సహాయ చర్యలూ చేపట్టలేని పరిస్థితి ఉంది. ప్రజలంతా ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నారు. మంగళవారం కూడా వర్షాలు కొనసాగుతాయన్న హెచ్చరికలు గుబులు పుట్టిస్తున్నాయి. చెన్నై శివారులోని జాతీయ రహదారి వరద నీటిలో మునగడంతో రాకపోకలు స్తంభించాయి. నగరం, శివార్లలోని చెరువులు, రిజర్వాయర్లు నిండడంతో అడయార్, కూవం నదులు, బకింగ్ హాం కాలువల ద్వారా చెన్నై వైపుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నగరాన్ని చుట్టుముడుతున్న వరదను తొలగించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో మంగళవారం కార్యాలయాలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ఫోన్లో సహాయక చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. వేలాది మంది నిర్వాసితులై చెన్నై, శివార్లలో వందలాది శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వర్షాలకు చెన్నైలో ఐదుగురు మృతి చెందారు. వందలాది రైళ్లు రద్దయ్యాయి.

47 ఏళ్లలో అతి భారీ వర్షం

తాజా వర్ష బీభత్సం చెన్నై నగరంలో గత 47 ఏళ్లలో అత్యంత భారీ వర్షంగా నమోదైంది. 2015 నాటి కుంభవృష్టిని కూడా మించిపోయింది. అప్పటి కష్టాలు పునరావృతం కాకుండా చూసేందుకు డీఎంకే ప్రభుత్వం నగరంలో రూ.4 వేల కోట్లతో నిర్మించిన వరద కాల్వలు పూర్తిగా వాడకంలోకి రాకపోవడంతో ఈసారీ ముంపు సమస్య తలెత్తింది. మంగళవారం నాటికి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది. ''తుపాను కేంద్రం చెన్నైకి తూర్పు, ఈశాన్య దిశగా 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకతమై ఉంది. మంగళవారం ఏపీలో నెల్లూరు– మచిలీపట్నం మధ్య తీరం దాటనుంది''అని తెలిపింది.


ప్రమాదంలో కాలిపోయిన విమాన శకలాలను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

కూలిన ఐఏఎఫ్ శిక్షణ విమానం

- ఇద్దరు పైలట్లు సజీవదహనం
- మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ సమీపంలో దుర్ఘటన
- దుండిగల్‌లోని ఐఏఎఫ్ అకాడమీకి చెందిన శిక్షణ విమానంగా గుర్తింపు

తూప్రాన్: సంగారెడ్డి జిల్లా దుండిగల్‌లోని భారతీయ వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన ఎయిర్ ఫోర్స్ అకాడమీ శిక్షణ విమానం సోమవారం ఉదయం సాంకేతిక కారణాలతో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని రాళ్లగుట్టలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు సజీవదహనం అయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం స్విట్జర్లాండ్‌కు చెందిన పిలాటస్ సంస్థ తయారు చేసిన పీసీ–7 ఎంకే–2 శిక్షణ విమానం రోజువారీ శిక్షణలో భాగంగా ఉదయం 8:30 గంటల సమయంలో తూప్రాన్ పట్టణ సమీపంలోని గగనతలం మీదుగా ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పింది. గాల్లో గింగిరాలు తిరుగుతూ తూప్రాన్ సమీపంలోని టాటా కాఫీ పరిశ్రమ వెనుక ఉన్న రావెల్లి గ్రామ సమీపంలోని రాళ్ల గుట్టలో భారీ శబ్దంతో కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పైలట్లు సజీవదహనమయ్యారు. పొలాల్లో ఉన్న రైతులు, స్థానికులు ప్రమాద వార్తను వెంటనే పోలీసులకు తెలియజేయగా వారు ఘటనాస్థలికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అప్పటికే అప్రమత్తమైన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు మరో రెండు శిక్షణ విమానాలతోపాటు నాలుగు హెలికాప్టర్లతో గాలింపు చర్యలు చేపట్టి ప్రమాద స్థలాన్ని గుర్తించారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు సీ.ఎస్.సీ నాయర్ (బెంగళూరు), వింగ్ కమాండర్ శ్రీనివాసన్ (దుండిగల్) ప్రమాదం జరిగిన తీరును గమనించారు. అనంతరం రెండు అగ్నిమాపక వాహనాలతో మంటలను ఆర్పారు. మృతులను అభిమాన్య రాయ్, వియత్నాంకు చెందిన వువాన్‌తాయ్‌గా గుర్తించారు. ఈ ప్రమాదంపై వాయుసేన విచారణకు ఆదేశించింది. ఘటనా స్థలంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్సై శివానందం, పోలీసు సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.

నా కళ్ల ముందే ప్రమాదం...



నేను టాటా కాఫీ పరిశ్రమ సమీపంలో వాకింగ్ చేస్తుండగా ఓ విమానం ఆకాశంలో ఎగురుతూ ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చింది. అంతలోనే పైకి ఎగిరి ఆకాశంలో గింగిరాలు తిరుగుతూ గుట్టల్లో పడిపోయింది. భారీ శబ్దంతో పాటు మంటలు చెలరేగాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించా.

– సతీష్‌చారి (ప్రత్యక్ష సాక్షి), తూప్రాన్

ఇంటర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌పై తర్జనభర్జన

- కొత్త సర్కార్ అనుమతి ఉంటేనే ముందుకు..
- ఇంటర్ సిలబస్ పూర్తి కాకపోవడం అడ్డంకే
- మూడు నెలల్లో కొత్త విధానం ఎలా అనే సందేహాలు
- ప్రాక్టికల్స్‌పై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాక్టికల్స్‌పై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ సంవత్సరమే ప్రవేశపెడుతున్న ఈ విధానాన్ని కొనసాగించడమా లేక వచ్చే ఏడాదికి వాయిదా వేయడమా అనే విషయాన్ని తేల్చుకోలేకపోతున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టులో 20 మార్కులకు ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ క్రమంలో అవసరమైన మెటీరియల్ కూడా తయారు చేసింది. అన్ని స్థాయిల అధ్యాపకులకు శిక్షణ ప్రక్రియను ముగించింది. ప్రైవేటు కాలేజీలు ఇప్పటికే విద్యార్థులను ఇందుకు సిద్ధం చేస్తుండగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అనేక చోట్ల ఆంగ్ల ప్రాక్టికల్స్‌పై సమగ్ర అవగాహన కొరవడిందన్న వాదన వినిపిస్తోంది. చాలా కాలేజీల్లో ఇప్పటికీ సాధారణ సిలబస్ కూడా పూర్తికాలేదు. కొన్ని కాలేజీల్లో 40 శాతానికి మించి అవ్వలేదని లెక్చరర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడే ప్రభు త్వం ప్రాక్టికల్స్‌కు అంగీకరిస్తుందా అనే సందేహాలు బోర్డు అధికారులను వెంటాడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్నిబట్టి ముందుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.

3 నెలల్లో సాధ్యమా?

ఇంటర్ ఇంగ్లిష్ ద్వితీయ సంవత్సరంలో ఇప్పటి వరకు వంద మార్కులకు పేపర్ ఉంటోంది. ఇదంతా థియరీ. దీని స్థానంలో 80 మార్కులకు థియరీ, 20 మార్కులకు ప్రాక్టికల్స్ పెట్టాలన్నది బోర్డు నిర్ణయం. ఆంగ్లంలో మాట్లాడటం, రాయడం, పరస్పర సంభాషణ, నోట్స్ సిద్ధం చేయడం ఇలా అనేక కోణాల్లో విద్యార్థి ఆంగ్ల ప్రావీణ్యతకు మార్కులు ఇవ్వనున్నారు. అయితే పరస్పర సంభాషణ, నోట్స్ ప్రిపరేషన్, ఆంగ్ల భాషలో మాట్లాడే తీరు పరిశీలన వంటివి ఇప్పటికిప్పుడు ఎలా సాధ్యమనే వాదన తెరపైకి వస్తోంది. ఏటా మార్చి–ఏప్రిల్‌లో వార్షిక పరీక్షలు నిర్వహిస్తుండగా దీన్ని దృష్టిలో ఉంచుకొని తరగతులు మొదలైనప్పట్నుంచే ప్రాక్టికల్స్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంది. కానీ పుస్తకాల పంపిణీ ఆలస్యం కావడం, దసరా సెలవులు, ఎన్నికల విధుల వల్ల ప్రభుత్వ కాలేజీల్లో సిలబస్ పూర్తవ్వలేదు. అతికష్టం మీద జనవరి ఆఖరుకు దీన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత రివిజన్‌కు వెళ్లే వీలుంది. దీంతో ఇక ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు ఇక సమయం ఎక్కడ ఉంటుందని అధ్యాపకులు అంటున్నారు. దీనివల్ల ప్రైవేటు కాలేజీల విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించి అవకాశం ఉందని.. అదే సమయంలో ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం తర్వాతే...

ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌పై ఏడాది నుంచే ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తోంది. నిపుణులతో చర్చించి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసింది. దీనిపై అన్ని స్థాయిల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంది. బోర్డు రూపొందించిన పుస్తకాలపై ఇతర రాష్ట్రాలూ ఆసక్తి కనబరుస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాక్టికల్స్ వల్ల తమకు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెరుగుతుందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారన్నది అధికారుల వాదన. అయితే ఈ కార్యక్రమానికి గత ప్రభుత్వంలో ఆమోదం లభించింది. కానీ పరీక్షల్లో మార్పులు జరగడం వల్ల కొత్త ప్రభుత్వం అనుమతి పొందాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్ విధివిధానాలు, ప్రయోజనాలను కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నివేదిక సమర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనుమతి వచ్చిన తర్వాతే ముందుకెళ్లాలనే యోచనలో ఉన్నారు.

నిర్వహణకు అన్ని ఏర్పాట్లు




ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌పై బోర్డు పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశాం. అధ్యాపకులకూ శిక్షణ ఇచ్చాం.మన ప్రణాళికపై ఇతర రాష్ట్రాలూ ఆసక్తి చూపుతున్నాయి. మంచి కార్యక్రమం కావడంతో విద్యార్థుల్లోనూ ఆసక్తి ఉంది. ప్రభుత్వ కాలేజీల్లో దీనిపై అవగాహనకు కల్పించడం పెద్ద కష్టమేమీ కాదు. కొత్త ప్రభుత్వానికి ప్రాక్టికల్స్‌పై ప్రయోజనాలను వివరించి, ముందుకెళ్తాం.

– జయప్రదాభాయ్
(ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి)

ఖడ్గ మృగానికి కంటి సర్జరీ..

బహదూర్‌పురా: నెహ్రూ జూపార్కులో గత ఆరేళ్లుగా ఎడమ కంట్లో సమస్యతో బాధపడుతున్న 11 ఏళ్ల వయసున్న మగ ఒంటికొమ్ము ఖడ్గమృగానికి (సాయి విజయ్) ప్రభుత్వ వెటర్నరీ వైద్యులు సోమవారం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆరేళ్ల వయసు నుంచి ఎడమ కనుగుడ్డులో సమస్య కారణంగా ఇబ్బంది పడుతున్న ఖడ్గమృగం ఆ నొప్పి తీవ్రం కావడంతో గత ఆరు నెలలుగా విలవిల్లాడుతోంది. దీంతో ఖడ్గ మృగానికి శస్త్రచికిత్స చేసే ముందు కంటి నుంచి అన్ని జీవ నమునాలను సేకరించి రోగ పరీక్షల నిర్ధారణ కోసం మెహిదీపట్నంలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వీబీఆర్ఐ)కు పంపారు. వాటి ఫలితాల ఆధారంగా జూపార్కులో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.శంభులింగం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్, సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.రాధాకృష్ణారావు, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్, జూ వెటర్నరీ సిబ్బంది, జంతు సంరక్షకుల సాయంతో, డైరెక్టర్, క్యూరేటర్ సమక్షంలో శస్త్రచికిత్స చేసి ఎడమ కనుగుడ్డును తొలగించారు. ఈ ఖడ్గమృగాన్ని మైసూరు జూపార్కు నుంచి గతంలో నెహ్రూ జూపార్కుకు తీసుకొచ్చారు.


ఖడ్గ మృగానికి శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.